వాసాల గతి నిరంతరాలపై వినోదభరిత
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మహబూబ్‌నగర్ fb.com/vaartha

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-6-2024 మంగళవారం సంపుటి: 30 సంచిక: 139 పేజీలు: 10+4 వెల: 6.50

ఐసెట్ మొదటి విడతలో 72.6% సీట్ల కేటాయింపు 3లో

తెలంగాణలో పేట్రేగుతున్న నకిలీ వైద్యులు 6లో



## పట్టాలపై ఘోరం
### పశ్చిమ బెంగాల్‌లో దుర్ఘటన

# గూడ్స్‌ను ఢీకొన్న ఎక్స్‌ప్రెస్

సోమవారం డార్జిలింగ్ జిల్లాలో గూడ్స్‌ను ఢీకొన్న ఘటనలో గాలిలోకి లేచిన ఎక్స్‌ప్రెస్ బోగీ

- గాలిలోకి లేచిన బోగీలు
- 15 నిండు ప్రాణాలు బలి
- మరో 60 మందికి తీవ్ర గాయాలు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- ఘటనా ప్రదేశానికి వెంటనే వెళ్లిన రైల్వే మంత్రి వైష్ణవ్, సిఎం మమత
- మృతుల కుటుంబాలకు రూ. 10లక్షల పరిహారం ప్రకటించిన కేంద్రం
- యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు

**కోల్‌కతా, జూన్ 17:** పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో ఘోర రైలుప్రమాదం జరిగింది. ఒకే ట్రాక్‌పైకి వచ్చిన రెండు రైళ్లు ఢీకొనడంతో ఓ బోగీ గాల్లోకి లేచింది. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 15మంది ప్రయాణికులు మృతి చెందగా.. మరో 60 మంది తీవ్రంగా గాయ పడ్డారు. అసోంలోని సిల్చార్ నుంచి కోల్‌కతాలోని సీల్దాకు బయల్దేరిన కాంచన్‌జంఘా ఎక్స్‌ప్రెస్ మధ్యలో న్యూజల్‌పాయ్‌గుడి వద్ద ఆగింది. అక్కడి నుంచి బయల్దేరిన కాసేపటికే రంగపాని స్టేషన్ సమీపంలో వెనకనుంచి ఓ గూడ్స్ రైలు దీన్ని బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు గూడ్స్ రైలు బోగీలు చెల్లాచెదురుగా పడిపోగా.. ఎక్స్‌ప్రెస్ రైలు రెండు బోగీలు పట్టాలు తప్పాయి. ఓ బోగీ గాల్లోకి లేవడం ప్రమాద తీవ్రతకు అద్దంపడుతోంది. సమాచారమందుకున్న రైల్వే పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనపై డార్జిలింగ్ అదనపు ఎస్పీ మాట్లాడారు. పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. వీరిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సిగ్నల్ జంప్ కారణంగా ఈప్రమాదం చోటుచేసు >>2



ప్రమాదంలో దెబ్బతిన్న బోగీలు, రైల్వే ట్రాక్



## చత్తీస్‌గఢ్ విద్యుత్‌తో నష్టం

# 6 వేల కోట్లు

- 2 రాష్ట్రాల మధ్య తేలని పెండింగ్ బకాయిలు
- డిస్కంలపై రూ.3,110 కోట్ల అదనపు భారం
- ఒప్పందానికి పడని ఇఆర్‌సి ముద్ర
- సిఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్17:** చత్తీస్‌గఢ్ విద్యుత్‌తో తెలంగాణ విద్యుత్ సంస్థలు అంచనాలకు మించి నష్టపోయాయని, దాదాపు రూ.6 వేల కోట్లకు పైగా తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు నష్టపోయాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. చత్తీస్‌గఢ్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఒక్క యూనిట్ ధర రూ.3.90 మాత్రమే అని చెబుతున్నప్పటికీ ఈ విద్యుత్ కొనుగోలుతో రాష్ట్ర విద్యుత్ సంస్థలకు తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

విద్యుత్ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం చత్తీసగఢ్ నుండి రాష్ట్ర డిస్కంలు 17,996 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను కొనుగోలు చేశాయి. ఇందుకు గాను రూ. 7,719 కోట్లను చెల్లించాయి. అంతేకాకుండా చత్తీస్‌గఢ్‌కు ఇంకా రూ.1,081 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. వీటితో పాటు, ట్రాన్స్‌మిషన్ లైన్ చార్జీల కింద మరో రూ.1,362 కోట్లు బకాయిలు పడింది. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుంటే ఒక్క యూనిట్ విద్యుత్‌కు అయిన ఖర్చు రూ.5.64గా లెక్క తేలుతోంది. ఈ నేపథ్యంలో డిస్కంలపై సుమారు రూ.3,110 కోట్ల మేర అదనపు భారం పడింది.

మరోపక్క బకాయిల విషయంలో చతీస్‌గఢ్, తెలంగాణ మధ్య వివాదం ఇంకా పెండింగ్‌లోనే ఉంది. చత్తీస్‌గఢ్ విద్యుత్ సంస్థలు తెలంగాణ నుండి రూ.1,715 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉందని చెబుతుండగా, రూ. 1,081 కోట్లు చెల్లించాలని రాష్ట్ర డిస్కంలు అంటున్నాయి. ఈ వివాదంపై ఇప్పటికే చతీస్‌గఢ్ విద్యుత్ సంస్థ అప్పీలేట్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసింది. చత్తీస్‌గఢ్ విద్యుత్ 2017 చివరి నుంచి అందుబాటులోకి వచ్చింది. ముందు నుంచీ అరకొరగానే సరఫరా అయింది. ఎన్నడూ వెయ్యి మెగావాట్లు సాఫీగా రాలేదు. ఇలా చత్తీసగడ్ ఒప్పందం ప్రకారం విద్యుత్ సరఫరా చేయలేకపోవడంతో తెలంగాణ డిస్కంలు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వచ్చింది. దీంతో 2017 నుండి 2022 వరకూ సుమారు రూ.2,083 కోట్ల మేర అదనపు భారం పడిందని అంచనా వేస్తున్నాయి.

2022 ఏప్రిల్ నుంచి చత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరోవైపు చత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్‌ను తెచ్చుకునేందుకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌తో 1000 మెగావాట్ల విద్యుత్ సరఫరాకు కారిడార్ బుక్ చేసుకోవాల్సి వచ్చింది. బుకింగ్ ఒప్పందం ప్రకారం విద్యుత్ తెచ్చుకున్నా తెచ్చుకోకపోయినా పీజీసిఐఎల్‌కు సరఫరా చార్జీలు కట్టాల్సిందే. ఈ లెక్కన వాడకున్నా పవర్ గ్రిడ్‌కు రూ.638 కోట్లు చొప్పున అదనపు చార్జీలు చెల్లించాల్సి వచ్చింది. గత ప్రభుత్వం నిర్వాకంతో కారిడార్ల బుకింగ్‌తో అదనపు నష్టం జరిగింది. కేవలం 1000 మెగావాట్ల కారిడార్ >>2

## త్వరలో కొత్త రెవెన్యూ చట్టం

### తప్పుల తడకగా ధరణి!

#### కమిటీ సభ్యుల ప్రాథమిక నివేదిక


**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో కొత్త రెవెన్యూ చట్టం రానుందా? ప్రజలుఎదుర్కొంటున్న అన్ని భూ సంబంధిత సమస్యలకు ఏకైక పరి ష్కారంగా కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకురా వాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నదా? ఇందుకు సమాధానంగా అవుననే అంటు న్నాయి రెవెన్యూ శాఖ వర్గాలు. ప్రస్తుతం రాష్ట్రంలోని భూ సమస్యలన్నింటికీ గత ప్రభుత్వం రూపొందించిన ధరణి కారణమని భావిస్తున్న ప్రభుత్వం దీనికి ప్రత్యామ్నా యంగా కొత్త చట్టం తీసుకు రానుందని సమాచారం. వచ్చే అసెంబ్లీ సమావేశాలలో కొత్త చట్టంపై ప్రకటించే అవకాశం ఉందని రెవెన్యూ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేసి దాని స్థానంలో కొత్త రెవెన్యూ చట్టం తీసుకురానున్నట్లు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇదే అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో సైతం చేర్చింది. గత ఎన్నికలలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడంతో కొత్త చట్టం రూపకల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి ధరణి కారణంగా సుమారు 2.50 లక్షల పై >>7

# 'అర్హు'లకే రుణ మాఫీ!

## ఆదాయం పన్ను కట్టేవారు, ఉద్యోగులు, ఎంపి, ఎమ్మెల్యేలకు కట్

- 2018 డిసెంబర్ 12 నుంచి తీసుకున్న పంట రుణాలకే వర్తింపు
- 40 లక్షల మంది రైతులకే ఛాన్స్
- మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్17:** ఆగస్టు 15వ తేదీలోపు రూ.2లక్షల వరకు తెలంగాణ రైతుల రుణమాఫీ విషయంలో విధి విధానాల ఖరారుపై రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. అర్హులైన వారికే రుణ మాఫీ వర్తింపజేసేందుకు అధికారులు వివిధ ప్రతిపాదనలు అందిస్తున్నారు. ఎవరికీ వర్తింప చేయాలి, ఎవరెవరిని ఈ స్కీం నుంచి మినహాయించాలనే విషయంలో పలు ప్రతిపాదనలు ప్రభుత్వం ముందుకొచ్చాయి. వాటిని పరిశీలిస్తూ ఆగస్టు 15లోగా రుణమాఫీ పూర్తి చేయాలని రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రయత్నిస్తోంది. ఇటివలి లోక్‌సభ ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేసి చూపాలని కృత నిశ్చయంతో ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే అధికారులు ఓ కొత్త ప్రతిపాదనను ప్రభుత్వం ముందు ఉంచారు. రాష్ట్రంలో ల్యాండ్ పాస్ బుక్, రేషన్‌కార్డు ఉన్న రైతులకే రుణమాఫీ వర్తింప జేయాలని చెప్పారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,ఆదాయపన్ను చెల్లించేవారు, ఉద్యోగులకు ఈ పథకం నుంచి మినహాయించాలని సిఎం రేవంత్ వద్దకు ప్రతిపాదనలు వచ్చాయి. మరోవైపు రూ.2లక్షల లోపు రుణాలు తీసుకున్న రైతుల వివరాలను బ్యాంకర్ల నుంచి ప్రభుత్వం తెప్పిస్తోంది. మరో రెండు,మూడు రోజుల్లో ఈ జాబితా అధికారులకు చేరే చాన్స్ ఉంది. తెలంగాణలో ఇప్పటికే అమలు చేస్తున్న రైతుబంధు పథకానికి 66లక్షల మంది లబ్దిదారులు ఉన్నారు. దాదాపుగా వీరంతా రూ.2లక్షల లోపు రుణం పొందారని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు.

అయితే రైతుబంధు లబ్దిదారులలో సుమారు 6లక్షల మందికి పట్టాదార్ పాస్ బుక్‌లు లేవని, దీనిని ప్రామాణికంగా తీసుకుంటే రుణమాఫీ లబ్దిదారుల సంఖ్య 60లక్షలకు తగ్గుతుందని చెబుతున్నారు. మరోవైపు కుటుంబంలో ఇద్దరు, ముగ్గురికి రైతుబంధు వస్తోంది, వీరందరికీ రేషన్‌కార్డులేవు, కుటుంబ పెద్దకు మాత్రమేఉంది. రేషన్‌కార్డును కూడా ప్రమాణికంగా తీసుకుంటే కుటుంబంలో ఒక రైతుకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తుందని తద్వారా 18 లక్షల మంది లబ్దిదారులు తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇలా పాస్‌బుక్,రేషన్‌కార్డు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆదాయపు పన్ను చెల్లించేవారు,ప్రభుత్వ ఉద్యోగులను ఈ >>2



కిరణ్‌కుమార్‌రెడ్డి



అశ్విని కుమార్ చౌబే

# కొత్త గవర్నర్లు?

## తెలంగాణకు అశ్వినీ కుమార్!

## కర్ణాటకకు కిరణ్ కుమార్!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్17:** కేంద్రంలో తిరిగి ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో తెలంగాణతో పాటు రాజకీయాల్లో సంచలన పరిణామాలు చోటు చేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. త్వరలోనే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల గవర్నర్లను మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిపోవడం, కేంద్రంలో ఏర్పాటైన సంకీర్ణ ప్రభుత్వం రాష్ట్రాల గవర్నర్ల మార్పులు చేర్పులపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణకు పూర్తి స్థాయి గవర్నర్‌ను నియమించనున్నట్లు సమాచారం. ప్రస్తుత తెలంగాణ ఇన్‌చార్జ్ గవర్నర్ సిపి రాధాకృష్ణన్... పుదుచ్చేరి, జార్ఖండ్ గవర్నర్‌గా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే తెలంగాణకు కొత్త గవర్నర్‌ను నియ >>2

## 28 మంది ఐపిఎస్ అధికారుల బదలీ

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 28 మంది ఐపిఎస్ అధికారులు బదలీ అయ్యారు. అయితే బదలీ అయిన వారంతా ఎస్‌పి క్యాడర్ స్థాయి అధికారులే కావడం గమనార్హం. బదలీ అయిన వారి స్థానాల్లో కొన్నిచోట్ల ఇంకా కొత్తవారిని నియమించక పోవడంతో రెండు మూడు రోజుల్లో మరోదఫా బదలీలు జరిగే వీలుంద ని తెలుస్తోంది. మంచిర్యాల డిసిపిగా వున్న అశోక్‌కుమార్‌ను జగిత్యాల్ ఎస్‌పిగా నియమించగా అక్కడ వున్న సన్‌ప్రీత్ సింగ్‌ను సూర్యాపేట్ ఎస్‌పిగా నియమించారు. సూర్యాపేట్ జిల్లా ఎస్‌పిగా వున్న రాహుల్ హెగ్డేను హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ డిసిపిగా నియమించగా ఇక్కడ వున్న సుబ్బరాయుడును డిజిపి కార్యాలయానికి బదలీ చేశారు. బాలానగర్ డిసిపిగా వున్న శ్రీనివాసరావును జోగుళాంబ జిల్లా ఎస్‌పిగా నియమించగా >>2



సోమవారం న్యూఢిల్లీ ఖర్గే నివాసంలో జరిగిన సమావేశంలో రాహుల్, ప్రియాంక తదితరులు

## వయనాడ్‌కు రాహుల్ గుడ్‌బై

# బరిలోకి ప్రియాంక

### రాయబరేలి ఎంపీగా కొనసాగాలని రాహుల్ నిర్ణయం

**న్యూఢిల్లీ, జూన్17:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఈ సార్వత్రిక ఎన్నికల్లో రెండు చోట్లా పోటీ చేసి విజయం సాధించిన విషయం తెలిసిందే. వయనాడ్, రాయ్‌బరేలీ నుంచి ఆయన గెలుపొందారు. వీటిలో ఏ స్థానాన్ని వదులుకుంటారని సర్వత్రా ఆసక్తి నెలకొంది. తాజాగా దీనిపై రాహుల్ నిర్ణయం తీసుకున్నారు. వయనాడ్ ఎంపి సీటును ఆయనవదులుకోనున్నారు. రాయ్‌బరేలీ ఎంపిగా >>2

## ఇంకా రాని డిఎస్సీ షెడ్యూలు

### పరీక్షలకు వ్యవధి ఇక నెలరోజులే!

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి జారీ చేసిన డిఎస్సీ-2024 పరీక్షల షెడ్యూల్ కోసం నిరుద్యోగ అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. డిఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరిలో జారీ చేయగా.. అనంతరం మార్చిలో పరీక్షల తేదిలను ప్రకటించారు. డిఎస్సీ పరీక్షలను జులై 17 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్టు పాఠశాల విద్య శాఖ అధికారులు ప్రకటించారు. అయితే అధికారులు ప్రకటించిన పరీక్షల తేదిలకి కేవలం నెల రోజుల సమయం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో 15 రోజుల పాటు నిర్వహించనున్న పరీక్షలకి సంబంధించి రోజువారీ పరీక్షల షెడ్యూల్‌ను జారీ చేయాలని నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. కేవలం నెల రోజుల సమయం మాత్రమే ఉండటంతో.. అధికారులు ప్రకటించినట్టుగా అసలు జులై 17 నుంచి డిఎస్సీ పరీక్షలు జరుగుతాయా? అనే సందేహాన్ని అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారు. జులై 17 నుంచి పరీక్షలను నిర్వహించేటట్టు అయితే వెంటనే పరీక్షల రోజు వారీ షెడ్యూల్‌ను జారీ >>7

# ట్యాపింగ్‌లో ప్రైవేటు సంస్థ!

- పోలీసులకు లభించిన కీలక ఆధారాలు
- రవిపాల్ ల్యాబ్ నుంచి కొన్ని పరికరాలు జప్తు చేసిన పోలీసులు
- వాంగ్మూలం నమోదు.. అరెస్టుకు రంగం సిద్ధం



**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఎస్ఐబి ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఎస్ఐబికి అప్పట్లో టెక్నికల్ కన్సల్టంట్‌గా పనిచేసిన రవిపాల్ పాత్రపై పోలీసు లకు మరిన్ని ఆధారాలు లభించాయి. నగరంలోని కొండాపూర్‌లో రవిపాల్ సొంతంగా నిర్వహిస్తున్న కన్జర్వేషన్ ఇన్నోవేషన్ ల్యాబ్‌లో ఫోన్ ట్యాపింగ్ సందర్భంగా ధ్వంసమైన కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌లు వున్నాయనే సమాచారంతో ఈ కేసును విచారిస్తున్న పశ్చిమ మండల పోలీసులు దాడులు నిర్వహించి కొన్ని వస్తువులను జప్తు చేశారు. ఈ సందర్భంగా రవిపాల్‌తో పాటు అక్కడ పనిచేసే ఉద్యోగుల వాంగ్మూలం తీసుకున్న పోలీసులు వీరిని అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేశారని తెలుస్తోంది. కాగా ఈ ల్యాబ్‌లో లభించిన ధ్వంసమైన మూడు సర్వర్లు, హార్డ్ డిస్క్‌లు, ఐదు మాక్ మినీ డివైజ్‌లు ఫోన్ ట్యాపింగ్‌లో ప్రధాన నిందితులుగా వున్న ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావుతో పాటు మీడియా అధినేత శ్రవణ్ రావుల ప్రమేయాన్ని మరింతగా నిర్ధారించేదిగా వున్నాయని పోలీసులు చెబుతున్నారు.

రాష్ట్ర పోలీసు శాఖలో దుమారం రేపి, రాజకీయంగా ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబి నాటి కన్సల్టంట్ రవిపాల్ పేరు మరోసారి తెరపైకి వచ్చింది. ఫోన్ ట్యాపింగ్ ఉదంతం వెలుగుచూసిన మొదట్లోనే రవిపాల్ పేరు ప్రచారంలోకి వచ్చింది. >>2

## 24 నుంచి 3 రోజులు

# ఎపి అసెంబ్లీ

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ సమావేశాలు ముందుగా ఊహించినట్లు ఈ నెల19న జరుగడంలేదు. ఈ షెడ్యూల్ మారినట్లు అసెంబ్లీ వర్గాలు స్పష్టం చేసాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి అసెంబ్లీ సమావేశం కానుంది. మూడు రోజుల పాటు ఈ సమావేశాలు జరుగుతాయి. వాస్తవానికి ఈ సమావేశాలు బుధవారం నుంచి జరగవలసి ఉంది. అయితే గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ బక్రీద్ సందర్భంగా సెలవుపై మూడు రోజులు తమ స్వరాష్ట్రం కర్నాటక వెళ్లినట్లు సమాచారం. దాంతో సమావేశాలను 24కి వాయిదా వేయాలని నిర్ణయించారు. సమావేశాల తొలి రోజున గోరంట్ల బుచ్చయ్యను ప్రోటెర్మ్ స్పీకరుగా ఎన్నుకుంటారు. తరువాత శాసనసభ సభ్యులతో ప్రమాణ >>2



ప్రమాద స్థలిలో సహాయక చర్యలు నిర్వహిస్తున్న బృందాలు



డార్జిలింగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

# గూడ్స్‌ను ఢీకొన్న ఎక్స్‌ప్రెస్

>>కున్నట్లు తెలుస్తోంది. రెడ్ సిగ్నల్ వేసినా గూడ్స్ రైలు పట్టించుకోకుండా వెళ్లినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

**ప్రమాద ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి**

రైలు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీముర్ము విచారం వ్యక్తంచేశారు. 'ఈ విపత్కర సమయంలో నా ఆలోచనలన్నీ బాధిత కుటుంబాల వెంటేఉన్నాయి. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. సహాయకచర్యలు విజయవంతమవ్వాలి' అని ముర్ము ఆకాంక్షించారు. పశ్చిమబెంగాల్‌లో చోటుచేసుకున్న రైలు ప్రమాద ఘటన తీవ్ర విచారకరమని ప్రధాని నరేంద్రమోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఆయన.. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని ఆరా తీశారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ ఘటనాస్థలానికి బయల్దేరినట్లు వెల్లడించారు.

**రైలు ప్రమాదం తీవ్రంగా కలిచివేసింది : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ**

పశ్చిమబెంగాల్‌లో కంచన్‌జంఘా రైలు ప్రమా దంపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సోమవారం స్పందించారు. రైలు ప్రమాదంలో చాలా మంది మరణించారనే వార్త తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. మృతుల కుటుం బాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. రైలు ప్రమాద ఘటన స్థలంలో సహాయక చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు. ప్రమాదంపై రాష్ట్ర ముఖ్యమంత్రి మమతాబెనర్జీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఘటనాస్థలంలో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైద్యులు, అంబులెన్స్‌లు, విపత్తు నిర్వహణ బృందాలు వెంటనే అక్కడకు చేరుకున్నాయన్నారు. అటు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ దీనిపై స్పందించారు. ఇది తీవ్ర దురదృష్టకర ఘటన అని విచారం వ్యక్తం చేశారు. సహాయకచర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

**మృతులకు రైల్వేశాఖ ఎక్స్‌గ్రేషియా ప్రకటన**

రైలుప్రమాదంలో మృతి చెందిన వారికి రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ దుర్ఘటనలో మృతి చెందిన కుటుంబసభ్యులకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం చెల్లించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి రూ. 2.5 లక్షలు, స్వల్పగాయాలైన వారికి రూ. 50 వేలు చొప్పున ఇస్తామని తెలిపారు. ఈ ఘటన చాలా దురదృష్టకరమని, సహాయకచర్యలు యుద్ధప్రాతిపదిక కొనసాగుతున్నట్లు రైల్వే మంత్రి వైష్ణవ్ తొలుత పేర్కొన్నారు. రైల్వే, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు పరస్పర సహకారంతో పని చేస్తున్నాయని తెలిపారు. ఘటనా స్థలికి సీనియర్ ఉన్నతాధికారులు చేరుకున్నారని పేర్కొన్నారు. మరోవైపు, ఈ ఘటనపై రైల్వే శాఖ సహాయమంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు స్పందించారు. ఈ విషాద ఘటనలో సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

**పలు రైల్వే సర్వీసులు రద్దు.. మరికొన్ని దారిమళ్లింపు**

రైలు ప్రమాదం నేపథ్యంలో ఆ మార్గంలో పలు రైల్వే సర్వీసులను రద్దు చేసినట్లు రైల్వే శాఖ సోమవారం ప్రకటించింది. అలాగే పలు రైళ్లను దారి మళ్లించినట్లు వెల్లడించింది. 19 రైళ్లను రద్దు చేశామని.. మరో 9 రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు వివరించింది. అందులో డిబ్రుఘఢ్-న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్, హౌరా-న్యూజల్పాయిగురి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఉన్నాయని తెలిపింది. అలాగే రద్దు చేసిన రైల్వే సర్వీసులను ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించింది.

# 'అర్హు'లకే రుణ మాఫీ!

>> స్కీం నుంచి తప్పిస్తే రుణమాఫీ భారం మరింత తగ్గుతుందని భావిస్తున్నారు. ఈ మినహాయింపుల తర్వాత సుమారు 40లక్షల మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా తేలుతారని వివరించారు. దీంతో రూ.25 వేల కోట్ల వరకే ప్రభుత్వంపై భారం పడనుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 36లక్షల మందికి పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం నిధులు అందుతున్నాయి. రుణమాఫీ కోసం ఈ పథకం విధివిధినాల మీద చర్చ కొనసాగుతుంది. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తేదీని పరిగణనలోకి తీసుకొని అంతకు సంవత్సరం ముందు నుంచి రుణాలనే మాఫీ చేయాలని కొందరు అధికారులు ప్రతిపాదన సిఎం రేవంత్‌రెడ్డి ముందు పెట్టారు. దీనికి సిఎం రేవంత్ విముఖత చూపినట్లు సమాచారం. రైతు రుణమాఫికి కటాఫ్ తేదీగా 2018 డిసెంబర్ 12ను నిర్ణయించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ తేదీ తర్వాత తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రుణమాఫీ అర్హులను తేల్చే విషయంలో విధి విధినాల రూపకల్పనలో మంత్రి మండలిలో సమగ్ర చర్చ తర్వాతే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. రుణమాఫీ అమలు చేసే క్రమంలో గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు విజిలెన్స్ సెల్ ఏర్పాటు చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది.

# బరిలోకి ప్రియాంక

>> కొనసాగనున్నారు. ఈ మేరకు ఎఐసిసి భేటీలో ఈ అంశంపై చర్చ జరిగింది. రాహుల్ గాంధీ వయనాడ్‌ను వదులుకుంటారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రకటించారు. దీంతో వయనాడ్‌లో జరగనున్న ఉపఎన్నికలో పోటీ చేసేందుకు ఆయన సోదరి, కాంగ్రెస్ నేత ప్రియాంకగాంధీకిఛాన్స్ దక్కింది. ప్రత్యక్ష రాజకీయాల్లో పోటీ చేయడం ఆమెకు ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ రాయ్‌బరేలీ కాంగ్రెస్ కంచుకోటగా పేరొందింది. అక్కడి ప్రజలు గాంధీ కుటుంబంపై ఎంతో అభిమానం చూపుతున్నారు. అందుకే ఆ స్థానాన్నే రాహుల్ ఎంచుకోవాలని పార్టీ నిర్ణయించింది. వయనాడ్ ప్రజలకు కూడా కాంగ్రెస్ పై ఎనలేని అభిమానం చూపుతున్నారు. వారికోసం ప్రియాంకను బరిలోకి దింపుతున్నాం అని ఖర్గే వెల్లడించారు. ఈసందర్భంగా రాహుల్‌గాంధీ భావోద్వేగానికి గురయ్యారు. 'నాపోరాటానికి వయనాడ్ ప్రజలు ఎంతో మద్దతిచ్చారు. ఆ స్థానాన్ని వదులుకోవడానికి ఎంతోమదనపడ్డా. అక్కడి ప్రజలతో నాబంధం కొనసాగుతూనే ఉంటుంది. ప్రియాంక వయనాడ్ ఉత్తమ ప్రతినిధి కాబోతోందని నమ్ముతున్నా' అనిరాహుల్ పేర్కొన్నారు. 'నేను మహిళనైనా వయనాడ్ నుంచి పోరాడగలను. రాహుల్ అక్కడలేరనే భావనను ప్రజలకు కలగనివ్వను' అని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు.

**SINGAM KUIL YELLOW MONDAY**
DrawDate on:17/06/24

DAY - SINGAM SERIES Dr No:244
1st Prize Rs.100000/- 216075
2nd Prize Rs.7000/- 77755
3rd Prize Rs.3500/-
06075 13323 18952 29897 36627
39922 50380 68248 73228 98201
4th Prize Rs.200/-
1842 3487 4793 5330 7114 7778 7918
8252 8645 9497
5th Prize Rs.100/-
0551 1131 2713 3953 4224 5757 6539
7855 9598 9830
6th Prize Rs.50/-
0087 1353 2777 4545 6255 7906 9029
0174 1514 2880 4601 6555 8122 9138
0186 1527 2964 4631 6644 8556 9238
0199 1677 3042 4697 6681 8536 9305
0542 1735 3254 5021 6684 8547 9313
0581 1826 3306 5144 6781 8592 9374
0741 1937 3367 5145 6795 8624 9428
0746 1965 3394 5411 6797 8646 9505
0875 1991 3550 5413 7022 8682 9550
0944 2333 3562 5680 7026 8709 9742
0977 2472 3588 5785 7181 8719
1071 2482 3694 5914 7414 8737
1223 2580 4138 6010 7493 8855
1326 2614 4353 6032 7579 8894
1332 2674 4483 6149 7751 9015

DAY - KUIL SERIES Dr No:244
1st Prize Rs.100000/- 514821
2nd Prize Rs.7000/- 84630
3rd Prize Rs.3500/-
23795 31474 49777 63114 65980
66750 82091 87588 97061 98258
4th Prize Rs.200/-
0839 1057 2308 3253 6694 7438 7502
7800 9020 9907
5th Prize Rs.100/-
2341 2376 3643 4526 4702 5101 6534
9526 9532 9795
6th Prize Rs.50/-
0132 1039 2589 4546 6378 7848 9482
0004 1073 2598 4549 6447 7869 9678
0108 1182 2602 4603 6466 8182 9692
0152 1312 2783 5400 6746 8296 9750
0219 1347 2962 5450 6884 8348 9778
0235 1384 3140 5532 7094 8385 9809
0398 1442 3279 5611 7120 8477 9871
0552 1497 3302 5739 7205 8556 9880
0613 1563 3376 5892 7283 8557 9916
0621 1677 3441 6067 7404 8580 9945
0624 1870 3964 6154 7640 9030
0765 1989 3985 6207 7676 9041
0874 2034 4117 6305 7703 9112
0886 2408 4502 6332 7738 9406
0894 2550 4515 6353 7772 9421

**ROSA DEAR ROYAL MONDAY**
DrawDate on:17/06/24

DAY - ROSA SERIES Dr No:244
1st Prize Rs.100000/- 443312
2nd Prize Rs.7000/- 50234
3rd Prize Rs.3500/-
03235 13185 16397 24666 42980
59462 62846 65019 86870 96452
4th Prize Rs.200/-
2100 2563 4691 5987 6325 6355 7073
7084 8151 9754
5th Prize Rs.100/-
0483 0993 2821 3748 4443 4921 5562
6123 8312 8576
6th Prize Rs.50/-
0008 2098 3539 4823 6229 7343 9153
0135 2465 3552 4859 6322 7420 9165
0370 2487 3572 5139 6358 7492 9213
0461 2595 3578 5150 6390 7620 9268
0519 2710 3666 5207 6437 7797 9397
0872 2798 3822 5293 6496 7804 9434
1047 3018 4067 5433 6639 7807 9450
1086 3046 4093 5474 6647 8122 9730
1367 3065 4314 5621 6824 8134 9897
1402 3077 4352 5740 6854 8231 9927
1406 3081 4385 5956 6927 8740
1520 3120 4455 6028 7050 8768
1697 3215 4567 6034 7071 8862
2075 3232 4589 6102 7185 8919
2091 3348 4811 6118 7333 8932

DAY - DEAR SERIES Dr No:244
1st Prize Rs.100000/- 662288
2nd Prize Rs.7000/- 69151
3rd Prize Rs.3500/-
12862 29708 32232 55673 60338
66174 67195 79514 79922 96032
4th Prize Rs.200/-
1200 1333 3824 6564 7276 7483
8673 9179 9693
5th Prize Rs.100/-
1044 1720 2855 5122 5541 5604 5765
5810 6728 9955
6th Prize Rs.50/-
0115 1397 2738 4048 5514 7123 8913
0146 1422 2741 4262 5664 7595 9045
0331 1447 2842 4359 5760 7774 9253
0410 1509 2871 4553 6120 7874 9334
0565 1648 2894 4570 6216 7917 9531
0595 1698 2904 4574 6240 8046 9569
0603 1711 2910 4604 6297 8121 9637
0636 1790 3130 4611 6473 8139 9731
0671 1844 3170 4773 6474 8188 9817
0746 2000 3263 4959 6530 8254 9929
0885 2135 3286 5050 6550 8304
0931 2185 3382 5094 6723 8357
0950 2380 3893 5207 6754 8725
1354 2399 3917 5268 6914 8793
1396 2711 4024 5311 6991 8808

**THANGAM VAIRAM LUCK MONDAY**
DrawDate on:17/06/24

DAY - THANGAM SERIES Dr No:244
1st Prize Rs.100000/- 124163
2nd Prize Rs.7000/- 18087
3rd Prize Rs.3500/-
00288 01021 25111 33919 34600
41617 43088 65351 76959 92743
4th Prize Rs.200/-
0290 3404 3815 4400 5723 5998 6521
7313 8102 9985
5th Prize Rs.100/-
0486 2998 4550 4869 5119 5956 8847
9338 9790 9997
6th Prize Rs.50/-
0170 1714 3329 4834 5877 7486 9313
0252 1723 3352 4835 5935 7488 9317
0367 1835 3366 4960 5968 7782 9386
0432 1905 3544 5121 5970 7818 9492
0645 1940 3732 5211 5989 7878 9598
0691 2375 3790 5234 6260 7893 9612
0692 2415 3809 5245 6365 7932 9653
1057 2539 3915 5301 6374 8207 9726
1124 2652 3932 5500 6523 8259 9836
1133 2721 3936 5529 6638 8326 9949
1244 2759 4043 5565 6793 8438
1321 2783 4279 5642 6897 8527
1434 2868 4430 5687 6904 9167
1574 3049 4471 5715 6950 9252
1590 3101 4673 5818 7067 9310

DAY - VAIRAM SERIES Dr No:103
1st Prize Rs.50000/- 479557
2nd Prize Rs.7000/- 38420
3rd Prize Rs.3500/-
01868 03749 45741 47359 68259
75290 77783 80305 96961 98725
4th Prize Rs.200/-
1677 5905 5921 6325 6522 7695 7928
8387 9058 9276
5th Prize Rs.100/-
0696 1388 1800 2055 2141 3254 6044
7592 8408 9853
6th Prize Rs.50/-
0076 1266 2757 3883 5076 6766 9263
0107 1321 2772 3956 5218 6781 9336
0461 1350 2788 4182 5471 6844 9396
0473 1501 2838 4277 5497 7307 9467
0519 1558 2987 4326 5563 7786 9559
0619 1933 2989 4375 5829 7836 9562
0778 1959 3003 4397 5908 7946 9680
0897 1975 3122 4398 5929 7963 9737
0928 1998 3288 4405 6088 8214 9885
0944 2156 3470 4454 6103 8406 9899
0951 2392 3568 4462 6114 8570
0986 2485 3637 4708 6285 8650
1007 2597 3663 4822 6381 8757
1166 2668 3673 4842 6465 8792
1190 2690 3718 5033 6683 9059

**NALLANERAM MANI LUCK MONDAY**
DrawDate on:17/06/24

DAY - NALLANERAM SERIES Dr No:244
1st Prize Rs.50000/- 364946
2nd Prize Rs.7000/- 98412
3rd Prize Rs.3500/-
03999 18453 21209 22612 67048
74578 77953 90419 91366 96188
4th Prize Rs.200/-
2128 3759 4723 5940 5976 8025 8230
8777 8845 9476
5th Prize Rs.100/-
0072 0199 5619 7074 7355 7497 9103
9154 9188 9280
6th Prize Rs.50/-
0008 1298 2718 3983 5248 6884 8740
0028 1398 2783 4006 5316 6969 8930
0230 1445 2835 4097 5424 6973 9165
0384 1462 2857 4119 5542 7001 9184
0483 1463 2871 4244 5718 7214 9283
0520 1541 2959 4331 5753 7241 9444
0722 1647 3199 4453 5896 7464 9571
0755 1723 3293 4695 5944 7537 9625
0782 1941 3449 4772 5999 7601 9799
0907 1984 3579 4774 6170 7630 9999
0937 2039 3723 4918 6194 8172
1040 2094 3772 5004 6255 8515
1192 2223 3850 5146 6359 8585
1227 2615 3891 5170 6470 8677
1234 2648 3961 5208 6490 8729

DAY - MANI SERIES Dr No:103
1st Prize Rs.50000/- 965143
2nd Prize Rs.7000/- 54594
3rd Prize Rs.3500/-
40634 40761 47412 54281 60472
76170 83793 84201 85366 96188
4th Prize Rs.200/-
0381 2124 2167 2257 5273 5640 8977
9046 9474 9759
5th Prize Rs.100/-
1263 1759 1809 1839 2396 2449 2769
4933 8290 8317
6th Prize Rs.50/-
0078 1774 3359 5398 6677 7880 9253
0188 1815 3406 5589 6712 7932 9296
0376 1843 3460 5620 6733 7986 9317
0763 1980 3476 5636 7180 8173 9709
0865 2091 3553 5699 7206 8235 9737
0959 2342 3718 5862 7225 8377 9808
0993 2425 3809 5887 7409 8381 9828
1119 2533 4148 6072 7425 8413 9844
1149 2794 4180 6151 7590 8430 9866
1232 2889 4456 6224 7622 8511 9978
1473 2949 4634 6385 7704 8551
1551 3054 4991 6398 7721 8673
1579 3098 5050 6473 7771 8816
1599 3169 5138 6502 7830 8882
1606 3306 5326 6642 7843 9242

**KUMARAN VISHNU SUN MONDAY**
DrawDate on:17/06/24

DAY - KUMARAN SERIES Dr No:244
1st Prize Rs.50000/- 246599
2nd Prize Rs.7000/- 37682
3rd Prize Rs.3500/-
00847 11024 42989 45375 69407
77623 78086 85467 86929 99204
4th Prize Rs.200/-
1088 2338 5401 5874 6078 6849 6858
7138 7266 8605
5th Prize Rs.100/-
0112 0676 0888 4188 4781 5671 6981
7715 8324 9987
6th Prize Rs.50/-
0090 2524 3501 5042 6924 7924 9199
0545 2542 3610 5093 6966 7928 9371
0799 2661 3639 5424 7034 7931 9384
0857 2669 3705 5482 7089 7988 9526
0883 2820 3805 5519 7090 8152 9615
0984 2847 3829 5535 7167 8230 9761
1275 2893 3935 5648 7180 8341 9768
1716 2908 4049 5768 7229 8511 9858
1799 2912 4173 5937 7406 8568 9905
1861 3009 4339 6393 7411 8714 9978
1890 3088 4380 6474 7561 8831
2281 3103 4384 6571 7593 8841
2348 3170 4640 6575 7675 8848
2414 3419 4760 6652 7733 8900
2419 3428 4806 6805 7873 9048

DAY - VISHNU SERIES Dr No:244
1st Prize Rs.50000/- 974835
2nd Prize Rs.7000/- 56576
3rd Prize Rs.3500/-
16582 34843 48070 51356 51463
61016 64263 67728 83858 89963
4th Prize Rs.200/-
0205 0442 0785 1526 1591 1712 3606
5011 8875 9541
5th Prize Rs.100/-
0177 0706 2444 3137 3297 4243 4974
6988 8343 9528
6th Prize Rs.50/-
0004 1288 2940 4413 5459 7081 8909
0052 1296 3036 4419 5507 7229 9121
0124 1444 3068 4437 5642 7370 9127
0231 1482 3198 4483 5650 7577 9319
0317 1740 3275 4647 5722 7628 9385
0354 1743 3410 4693 5772 7754 9478
0538 1783 3544 4818 5842 7829 9575
0600 1795 3546 4966 5884 7889 9732
0672 1848 3561 5070 5929 7895 9787
0736 2039 3568 5182 5986 8007 9798
0839 2187 3958 5282 6013 8077
0850 2315 3985 5317 6483 8139
1044 2573 4150 5323 6636 8188
1152 2671 4157 5351 6965 8571
1208 2829 4380 5359 7047 8848

**SWARNALAXMI LION PEARL MONDAY**
DrawDate on:17/06/24

DAY - SWARNALAXMI SERIES Dr No:244
1st Prize Rs.50000/- 258256
2nd Prize Rs.7000/- 82841
3rd Prize Rs.3500/-
14724 25457 36596 47381 47646
58711 69900 71586 82301 93424
4th Prize Rs.200/-
0114 0348 0530 2435 4541 4547 5437
7749 7867 8198
5th Prize Rs.100/-
0014 1930 3157 3788 4937 4987 6315
6388 6928 9048
6th Prize Rs.50/-
0009 1137 2320 4171 5353 6631 7945
0036 1264 2329 4288 5545 6725 8403
0051 1326 2386 4367 5641 6847 8900
0058 1342 2730 4408 5642 6848 8981
0237 1444 3076 4417 5742 6918 9186
0277 1471 3368 4464 5860 6952 9732
0289 1519 3443 4559 5974 7019 9764
0291 1535 3731 4598 6079 7332 9774
0311 1585 3761 4615 6167 7371 9817
0421 1606 3813 4711 6169 7409 9831
0453 1688 3844 4772 6175 7453
0602 1703 3886 4789 6355 7532
0608 1865 3969 4988 6455 7647
0863 1880 4046 5233 6459 7807
0944 2319 4051 5271 6515 7909

DAY - LION SERIES Dr No:103
1st Prize Rs.50000/- 768844
2nd Prize Rs.7000/- 57325
3rd Prize Rs.3500/-
13313 24724 35408 46663 68376
79430 79552 81426 92314 92465
4th Prize Rs.200/-
0175 0754 3176 3201 3244 3316 3394
5030 6175 7047
5th Prize Rs.100/-
0413 0810 2472 4674 5209 6106 6394
6659 6877 9557
6th Prize Rs.50/-
0098 1563 3252 4835 6185 7726 9333
0099 1568 3264 4892 6211 7977 9505
0443 1572 3379 5580 6242 8054 9638
0650 1664 3466 5632 6335 8056 9639
0691 1913 3564 5851 6357 8060 9666
0693 1997 3631 5864 6673 8086 9709
0905 2003 3649 5917 6855 8197 9815
0949 2222 3934 5921 6893 8216 9900
0988 2543 4040 5963 6946 8338 9965
1121 2617 4056 6052 6974 8467 9983
1203 2639 4075 6076 7146 8509
1323 2670 4249 6078 7261 8704
1331 2726 4251 6085 7272 9045
1429 3102 4327 6087 7398 9130
1518 3145 4577 6159 7492 9133

# కొత్త గవర్నర్లు?

>> మించాలని కేంద్రం భావిస్తోంది. అయితే తెలంగాణ గవర్నర్‌గా కేంద్ర మాజీ సివిల్ సప్లయిస్ ఎన్విరాన్‌మెంట్, ఫుడ్ కార్పొరేషన్ శాఖ సహాయ మంత్రి అశ్విని కుమార్ చౌబే పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త గవర్నర్ అంశం హాట్ టాపిక్‌గా మారింది. 1953 జనవరి బిహార్‌లో జన్మించిన అశ్విని కుమార్ చౌబే ఆ రాష్ట్ర రాజకీయాల్లో అనుభవజ్ఞు డైన రాజకీయ నాయకుడిగా కొనసాగుతున్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడు. గత ప్రభుత్వంలో మోడీ కేబినెట్‌లో పనిచేశారు. అయోధ్య రామ మందిరం నిర్మాణ ప్రక్రియలో కీలక అశ్విని కుమార్ కీలక పాత్ర పోషించారు. అయితే తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా వ్యూహరచన చేస్తున్న బిజెపి అందుకు అనుగుణంగా పావులు కదుపుతోంది. ఈ మేరకు ఇప్పటి నుంచే క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతంపై దృష్టి సారించి కమలం పార్టీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన పదవుల విషయంలోనూ జోరుపెంచినట్లు కనిపిస్తోంది. ఈ మేరకు ప్రస్తుతం తెలంగాణ ఇన్‌చార్జ్ గవర్నర్ స్థానంలో మోడీకి అత్యంత నమ్మకస్తుడైన అశ్విని కుమార్ చౌబే పేరును గవర్నర్‌గా పంపించారని భావిస్తున్నారనే చర్చ రాజకీయాల్లో ఆసక్తిగా మారింది. ఉమ్మడి ఎపికి చివరి ముఖ్యమంత్రిగా పని చేసిన బిజెపి నేషనల్ ఎగ్జిక్యూటీవ్ కమిటీ సభ్యుడిగా కిరణ్‌కుమార్‌రెడ్డికి సైతం గవర్నర్ పోస్ట్ వరించబోతున్నదని, ఆయన్ను కర్ణాటకలో గవర్నర్‌గా నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏడాది క్రితం బిజెపిలో చేరిన కిరణ్‌కుమార్‌రెడ్డిని బిజెపి నేషనల్ ఎగ్జిక్యూటీవ్ కమిటీ సభ్యుడిగా అధిష్ఠానం నియమించింది. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో రాజంపేట నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన కిరణ్‌కుమార్‌రెడ్డి ఓడిపోయారు.

కాగా, కిరణ్‌కుమార్‌రెడ్డిని తెలంగాణకే గవర్నర్‌గా పంపించబోతున్నారనే ప్రచారం కూడా ఉంది. సమైక్యవాదిగా ముద్రపడిన కిరణ్‌కుమార్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్రానికి గవర్నర్‌గా ఎలా నియమిస్తారనే తెలంగాణ వాదుల నుంచి ప్రశ్నలు సోషల్ మీడియాలో వ్యక్తం అవుతున్నాయి. దీంతో ఆయన్ను కర్ణాటకగవర్నర్‌గా నియమించబోతున్నట్లు తెలుస్తోంది.

# వైఎస్సార్సీకి శిద్దా గుడ్‌బై

## వ్యక్తిగత కారణాలవల్లనే అని జగన్‌కు లేఖ

**అమరావతి, జూన్ 17, ప్రభాతవార్త ప్రతినిధి:** సీనియర్ నేత, మాజీ మంత్రి, వైఎస్సార్సీ నేత శిద్దా రాఘవరావు వైఎస్సార్సీకి రాజీనామా చేశారు. ఈమేరకు పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డికి సోమవారం లేఖపంపారు. తన వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కాగా సీనియర్ రాజకీయ నాయకుడిగా పేరొందిన శిద్దా రాఘవరావు ఉమ్మడి ప్రకాశం జిల్లా దర్శి నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి ఒకింత ఆసక్తి కనబర్చినా వైఎస్సార్సీ అధిష్ఠానం అంతగా పట్టించుకోలేదు. అద్దంకి, ఒంగోలు,మార్కాపురం అసెంబ్లీ స్థానాల్లో ఏదో ఒక స్థానం నుంచి పోటీచేయాలనే ప్రతిపాదలను పార్టీ తిరస్కరించింది. దీంతో చివరిదాకా ఆయన మౌనంగా ఉండిపోయారు. ఎన్నికల అనంతరం వచ్చిన ఫలితాలతో వైఎస్సార్సీ ఘోరపరాజయం పాలైన నేపథ్యంలో శిద్దా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

# 6 వేల కోట్లు

>> సరిపోతుండగా, అనవసరంగా మరో 1000 మెగావాట్ల విద్యుత్ సరఫరాకు అడ్వాన్స్‌గా కారిడార్ బుక్ చేసింది. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ లభించే అవకాశం లేదని ఈ కారిడార్‌ను అర్ధాంతరంగా రద్దు చేసుకుంది. దీంతో పరిహారం కింది రూ.261 కోట్లు కట్టాలని పిజిసిఐఎల్ డిస్కంలకు నోటీసులు జారీ చేసింది. అవగాహన లేకుండా చేసుకున్న కారిడార్ ఒప్పందం చేసుకోవడంతో ఈ సమస్య తలెత్తింది. కాగా, ఈ విద్యుత్ కొనుగోలు ఒప్పందానికి ఇప్పటి వరకు తెలంగాణ ఈఆర్సీ ఆమోద ముద్ర వేయనేలేదు. ఈఆర్సీ ఆమోదం లేకుండానే ఛత్తీస్‌గఢ్‌కు చెల్లించిన వేల కోట్ల రుపాయాలన్నీ అడ్డదారి చెల్లింపులుగానే పరిగణించాల్సి ఉంటుందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ట్యాపింగ్‌లో ప్రైవేటు సంస్థ!

>> ఫోన్ ట్యాపింగ్‌కు కావలసిన ఉపకరణాలను ఎస్‌ఐబికి అనధికారికం గా సమకూర్చింది రవిపాల్ అని, ఇతనికి మీడియా అధినేత శ్రవణ్ రావు సహకరించాడని అప్పట్లో వార్తలు వచ్చాయి. దీనిపై అప్పట్లోనే రవిపాల్ వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేసినప్పటికీ అరెస్టు చేయలేదు. ఈ కేసులో అప్పట్లో రవిపాల్ పాత్రపై పోలీసులకు నమ్మదగ్గ ఆధారాలు లభించక పోవడం వల్లే అరెస్టు చేయలేదని ప్రచారం జరిగింది. ఆ సమయంలో కేవలం ఎస్‌ఐబి మాజీ డిఎస్‌పి ప్రణీత్ రావు మాత్రమే అరెస్టు కావడం, మిగతా ముగ్గురు నిందితులు ఇంకా అరెస్టు కాకపోవడం కూడా దీనికి కారణంగా పోలీసులుచెబుతున్నారు. దీని తరువాత నలుగురు నిందితుల అరెస్టు, వారి కస్టడీ విచారణ తదనంతర పరిణామాలు నాటి ఎస్‌ఐబి బాస్ ప్రభాకర్ రావును మొదటి నిందితుడుగా తేల్చాయి. ఆయనతో పాటు ఆరవ నిందితుడుగా శ్రవణ్ రావును పేరు వచ్చేలా చేసింది. గత మార్చి నెలలో ప్రణీత్ రావుతో పా టు అదనపు ఎస్పీలుగా వున్న భుజంగరావు, తిరుపతన్న, టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావులు వరుసగా అరెస్టుకాగా ఇదేసమయంలో ఎస్‌ఐబి కార్యాలయంలో కంప్యూటర్లు, హార్డ్‌డిస్క్‌ల ధ్వంసం, కొన్నింటిని కార్యాలయం ఆవరణలోనే కాల్చివేయడం, వీటి అవశేషాలను మూసీ నదిలో పడవేయడం వరకే పోలీసుల విచారణలో వెలుగు చూశాయి. ఇవన్నీ అప్పట్లో ఎస్‌ఐబి బాస్‌గా పనిచేసిన ప్రభాకర్ రావు ఆదేశాల మేరకు జరిగాయని, అసలు ఫోన్ ట్యాపింగ్ కూడా ప్రభాకర్‌రావు సూచనల మేరకే జరిగిందని అరెస్టయిన నిందితులు వాంగ్మూలం ఇవ్వడం సంచలనం రేపింది. దీంతో పాటు ఈ కుట్రలో నాటి సిఎం కెసిఆర్ హస్తంవుందనికూడా నిందితులు తెలిపారు. ఈ వివరాల నేపథ్యంలో అంతకు ముందే అమెరికాకు పారిపోయిన ఎస్‌ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు, మీడియా అధినేత శ్రవణ్ రావులను వెనక్కి రప్పించేందుకు పోలీసులు చట్టపరంగా చర్యలు చేబట్టారు. ఈ ప్రక్రియ చివరి దశలో వుంది. అమెరికాలో వున్న వీరి అరెస్టు కోసం రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించేందుకు ఇంటర్ పోల్ అధికారులకు సిబిఐ అధికారులు లేఖ రాశారు. ఈ లేఖకు పరిగణలోకి తీసుకున్న ఇంటర్‌పోల్ అధికారులు దీనిపై చట్టపరంగా ముందుకు సాగుతున్నారు. ఇంటర్‌పోల్ కృషి ఫలించి ప్రభాకర్ రావు, శ్రవణ్ రావుల అరెస్టుకు ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసులు జారీచేస్తే పోలీసులకు గొప్ప ఊరట లభిస్తుందని చెప్పాలి. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు వారం పది రోజులు పట్టనుందని తెలుస్తోంది, ఓవైపు ప్రభాకర్ రావు, శ్రవణ్ రావుల అరెస్టుకు పోలీసులు ప్రయత్నిస్తున్న తరుణంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులకు కీలక ఆధారాలు లభించాయి. గతంలో ఎస్‌ఐబికి ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి కన్సల్టెంట్‌గా పనిచేసిన రవిపాల్ వద్ద ఈ ఆధారాలు లభ్యం కావడం విశేషం. రవిపాల్ కొండాపూర్‌లో కన్జర్వేషన్ ఇన్నోవేషన్ ల్యాబ్ పేరిట సొంతంగా ఓ సంస్థను నిర్వహిస్తుండగా ఇందులో ఎస్‌ఐబిలో ధ్వ ంసమైన కంప్యూటర్ల తాలూకు వస్తువులు, హార్డ్ డిస్క్‌లు వున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు ఇక్కడ దాడిచేశారు. పోలీసుల దాడుల్లో ఈ ల్యాబ్‌లో మూ డు సర్వర్లు, హార్డ్ డిస్క్‌లు, ఐదు మాక్ మినీ డివైజ్‌లతో పాటు ఇంకొన్ని వస్తువులు లభించాయని తెలిసింది. ఇవన్నీ ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి ఎస్‌ఐబిలో ధ్వం సమైనవేనని సమాచారం. దీనిపై మరింత ఆధారాల కోసం వీటిని ఎఫ్‌ఎస్‌ఎల్‌కు పంపారు. కాగా ఈ కేసులో సాంకేతికంగా ముందుకు వెళ్లేందుకు నిర్ణయించిన పోలీ సులు ముందుగా ఈ ల్యాబ్‌కు డైరక్టర్‌గా వున్న రవిపాల్‌తో పాటు ఇక్కడ ఉద్యోగులుగా వున్న రాగి అనంతచారి, ఓలేటి సీతారాం శ్రీనివాస్‌ల వాంగ్మూలం తీసుకునా న్నరు. వీరి వాంగ్మూలాన్ని కోర్టు ఆదేశాల మేరకు తీసుకున్నట్లు తెలిసింది. అనంతరం ఈ వాంగ్మూలాన్ని పోలీ సులు కోర్టుకు అందజేశారు. ఈకేసులో రవిపాల్‌పాత్రపై పోలీసులకు ఆధారాలు లభించాయని సమాచారం. ఇదే సమయంలో అతని కంపెనీలో పనిచేసే కొందరు ఉద్యోగుల పాత్రపైనా సాక్ష్యాలు లభించాయని సమాచారం. వీరిని త్వరలో అరెస్టు చేసే వీలుందని తెలుస్తోంది.

# ఎపి అసెంబ్లీ

>> స్వీకారం జరుగుతుంది. స్పీకరుగా టిడిపి నుంచి అయ్యన్న పాత్రుడు.జనసేన నుంచి డిప్యూటీ స్పీకరుగా డాక్టర్ మండలి బుద్ధప్రసాద్‌ల ఎన్నిక ఖాయమంటున్నారు. ఈ విషయంలో నిన్నటి వరకు జనసేన, టిడిపి మధ్య కొంత తర్జనభర్జన జరిగిన చివరికి రెండు పార్టీలు ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.మండలిని ప్రభుత్వం డిప్యూటీ స్పీకరుతో పాటు భాషా సాంస్కృతిక వ్యవహారాలు,పాలనా భాషగా తెలుగు అమలు తదితరంశాల విషయంలో కీలకం చేస్తోందంటున్నారు. ఆ దిశలో సిఎం చంద్రబాబు మండలికి స్పష్టతను ఇచ్చినట్లు చెబుతున్నారు.

# ఐపిఎస్ అధికారుల బదలీ

>> అక్కడ వున్న రితిరాజ్‌ను ఎసిబిలో బదిలీ చేశారు. మేడ్చల్ ట్రాఫిక్ డి సిపిగా వున్న శ్రీనివాసరావును కుమురం భీం జిల్లా ఎస్‌పిగా నియమించగా అక్కడ వున్న సురేష్ కుమార్‌ను బాలానగర్ డిసిపిగా బదిలీ చేశారు. దక్షిణ మండల డిసి పిగా వున్న జానకీ ధరావత్‌ను మహబూబ్ నగర్ జిల్లా ఎస్‌పిగా నియమించగా అక్కడ వున్న హర్షవర్ధన్‌ను సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో నియమించారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో వున్న ఎస్‌పి విశ్వజిత్ కంపాటిని సిఐడిలో నియమించగా నిఘా విభాగంలో వున్న రాజేష్‌ను శంషాబాద్ డిసిపిగా బదిలీ చేశారు. శంషాబాద్ డిసిపిగా వున్న నారాయణ రెడ్డిని వికారాబాద్ జిల్లా ఎస్‌పిగా నియమించగా అక్కడ వున్న కోటిరెడ్డిని మేడ్చల్ డిసిపిగా నియమించారు. మేడ్చల్ డిసిపిగా వున్న నికితాపంత్‌ను తెలంగాణ స్పెషల్ బెటాలియన్ రెండవ విభాగం కమాండంట్‌గా బదిలీ చేయగా అక్కడ వున్న చటర్జీని డిజిపి కార్యాలయానికి బదిలీ చేశారు. తెలంగాణ యాంటి నా ర్కోటిక్ బ్యూరోలో ఎస్‌పిగా వున్న శరత్‌చంద్ర పవార్ నల్లగొండ జిల్లా ఎస్‌పిగా నియమించగా అక్కడ వున్న చందనా దీప్తిని సికింద్రాబాద్ రైల్వే ఎస్‌పిగా బదిలీ అ య్యారు. సికింద్రాబాద్ రైల్వే ఎస్‌పిగా వున్న సలీమాను వరంగల్ సెంట్రల్ జోన్ డిసిపిగా బదిలీ కాగా అక్కడ వున్న ఎంఎ బారీ డిజిపి కార్యాలయానికి బదిలీ అ య్యారు. వెయిటింగ్‌లో వున్న సంగ్రాం సింగ్‌ను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ విభాగంలో నియమించగా సాయి చైతన్యను తెలంగాణ యాంటినార్కోటిక్ బ్యూరోలో నియమించారు.

హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డిసిపిగా వున్న రష్మీ పెరుమాళ్‌ను ఉత్తర మండల డిసిపిగా నియమించగా అక్కడవున్న రోహిణి ప్రియ దర్శినిని డిచ్‌పల్లి స్పెషల్ బెటాలియన్ కమాం డంట్‌గా బదిలీ చేశారు. డిచ్‌పల్లి కమాండంట్‌గా వున్న రాంప్రకాష్‌ను డిజిపి కార్యాలయానికి బదిలీ చేశారు. నిఘా విభాగంలో వున్న రాజమహేంద్ర నాయక్‌ను జనగాం జిల్లా డిసిపిగా నియమించగా అక్కడ వున్న సీతారాంను డిజిపి కార్యాలయానికి బదిలీ చేశారు. తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరోలో వున్న భాస్కరన్‌ను మంచిర్యాల డిసిపిగా నియమించారు.

## వారం - వర్జ్యం

తేదీ : 18-06-2024, మంగళవారం,
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
జ్యేష్ఠమాసం, ఉత్తరాయనం,
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం,
ఏకాదశి ఉ.6.25,
స్వాతి మ.3.55,
వర్జ్యం రా.9.52-11.34,
దు.ఉ.8.19-9.12, 2) రా.12.07-1.00,
శుభ సమయం : ఉ.6.00-7.00,
సా.5.00-5.40
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి. కాంట్రాక్టులు దక్కుతాయి.

**వృషభం :** ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. మీలోని ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది.

**మిథునం:** ఆదాయం మించి ఖర్చులు పెరుగాయి. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**కర్కాటకం :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు.

**సింహం:** ఆస్తి, వివాదాలు పరిష్కారమవుతాయి. విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**కన్య :** నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. సన్నిహితులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**తుల :** ప్రయాణాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు తొందరపాటు వద్దు.

**వృశ్చికం:** బంధువులతో ఏర్పడిన మాట పట్టింపులు తొలగుతాయి. ఎదురైనా అవసరాలకు డబ్బు అందుతుంది.

**ధనుస్సు:** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసివస్తాయి.

**మకరం:** వృత్తి, వ్యాపారాలలో సమస్యలు చిక్కులు పెట్టినా సమర్థ వంతంగా ఎదురుకొంటారు.

**కుంభం:** శుభకార్యాల్లో పాల్గొంటారు. ఆదాయం పెరుగుతుంది. ప్రయాణాలు లాభిస్తాయి.

**మీనం :** ముఖ్యమైన వ్యవహారాలలో జాప్యం జరిగినా పూర్తిచేస్తారు. ఆరోగ్యం, వాహనలపట్ల మెలకువ అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సాటి మనిషికి సాయం చేయడం బాధ్యతగా నిర్వర్తించారు

## ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను అభినందించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 17:** సమయాభావంతో సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షకు గైర్హాజరు కాకుండా, యుపిఎస్సీ అభ్యర్థికి సహాయం చేసిన ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. వాహనాల నియంత్రణ మాత్రమే తన డ్యూటీ అనుకోకుండా, సాటి మనిషికి సాయం చేయ డం తన బాధ్యతగా నిర్వర్తించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ అంటూ ఎక్స్(ట్విట్టర్) వేదికగా కొనయాడారు. కానిస్టేబుల్ సురేశ్ సహకారంతో సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకున్న సోదరి యుపీఎస్సీ పరీక్షలో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాల నియంత్రణ విధులతోపాటు, సామాజిక సేవలు అందిస్తున్నారు. తాజాగా రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఓ అభ్యర్థి పరీక్ష రాసేందుకు సహాయంచేసి ప్రజల మన్ననలను అందు కుంటు న్నారు. సదరు యువతి సివిల్స్ పరీక్ష కేంద్రం మహావీర్ ఇంజినీరింగ్ కాలేజీలో ఉంది. ఆర్టీసి బస్సులో మైలార్‌దేవులపల్లి పల్లె చెరువు బస్‌స్టేషన్ వద్ద దిగారు. అక్కడి నుంచి పరీక్ష కేంద్రం చాలాదూరంలో ఉండటంతో సమయం మించి పోతుందని అభ్యర్థి కంగారుపడుతున్న సమయంలో, అక్కడే ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సురేశ్.. ఆమె ఆందోళనకు గమనించారు. విషయం తెలుసుకున్న వెంటనే కానిస్టేబుల్ తన ద్విచక్రవాహనంపై పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ జరిగిన సన్నివేశాలను స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. సరైన సమయంలో కానిస్టేబుల్ సురేశ్ ఉదారతను చాటుకున్నారని ప్రజలు అభినందించారు.

**ప్రశాంతంగా ముగిసిన ప్రిలిమ్స్ పరీక్ష**

రాష్ట్రంలో ఆదివారం నిర్వహించిన యుపిఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలోని హైదరాబాద్, వరంగల్ జిల్లా కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. జాతీయ స్థాయిలో ఈ ఏడాది 1.056 సివిల్ సర్వీసెస్ పోస్టులు ఉన్నాయి. హైదరాబాద్ జిల్లాలోని 99 కేంద్రాలో జరిగిన పరీక్షకు 45,153 మంది అభ్యర్థులకుగానూ పేపర్1 పరీక్షకు 25,875(57.31 శాతం) మంది, పేపర్2 పరీక్షకు 25,661(56.83 శాతం) మంది హాజరయ్యారు. వరంగల్ జిల్లాలోని 11 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 4,730 మంది అభ్యర్థులకు గానూ పేపర్1 పరీక్షకు 2,637(55.75శాతం) మంది, పేపర్2 పరీక్షకు 2,614(55.26శాతం) మంది హాజరయ్యారు.

# ఇ సెట్-2024 మొదటి విడతలో 72.6 శాతం సీట్ల కేటాయింపు

## ఇంజినీరింగ్‌లో 8,951 సీట్లు.. ఫార్మసీలో 31 సీట్ల కేటాయింపు

### 21లోపు ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కోర్సుల్లో నేరుగా ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈసెట్-2024 ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారికి మొదటి విడత సీట్ల కేటాయింపు సోమవారం చేశారు. మొదటి విడతలో ఇంజనీరింగ్, ఫార్మసీలో కలిపి 72.6 శాతం సీట్లను కేటాయించారు. ఇంజనీరింగ్‌లో 8951 మందికి, ఫార్మసీలో 31 మందికి సీట్ల కేటాయింపు చేసినట్టు అడ్మిషన్స్ కన్వీనర్, సాంకేతిక విద్య కమిషనర్ బుర్రా వెంకటేశం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఈసెట్-2024లో 22,365 మంది అర్హత సాధించారు. వారిలో 12,757 మంది మొదటి విడతలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరయ్యారు. వారిలో 12,703 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్‌లో 12,785 సీట్లు అందుబాటులో ఉండగా.. ఫార్మసీలో 1180 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఇంజనీరింగ్‌లో 8951 మందికి, ఫార్మసీలో 31 మందికి మొదటి విడతలో సీట్ల కేటాయింపు చేశారు. మొత్తగా ఇంజనీరింగ్‌లో 70 శాతం సీట్లను కేటాయించగా.. ఫార్మసీలో 2.6 శాతం సీట్లను కేటాయించారు. సీట్లు పొందిన వారు ఈ నెల 21 లోపుగా ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. కాలేజీల్లో ఫైనల్ ఫేజ్ సమయంలో జులై 22 నుంచి 24 వరకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కాలేజీల్లో చేరాల్సి ఉంటుందని తెలిపారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చినప్పటికీ 3773 మంది సీట్ల కేటాయింపు చేయలేదు. ఇడబ్ల్యూఎస్ కోటాలో 529 మందికి సీట్ల కేటాయింపు చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో యూనివర్సిటీ కాలేజీలు 14 ఉండగా వాటిలో 1814 సీట్లు అందుబాటులో ఉంటే వాటిలో 1553 సీట్లను కేటాయించారు. ప్రైవేటు యూనివర్సిటీలు 2 ఉండగా వాటిలో 198 సీట్లు ఉంటే అందులో 195 సీట్లను కేటాయించారు. 153 ప్రైవేటు కాలేజీల్లో 10,773 సీట్లు అందుబాటులో ఉంటే.. వాటిలో7203 సీట్లను కేటాయించారు. మొత్తంగా 169 ఇంజనీరింగ్ కాలేజీల్లో 12,785 సీట్లు అందుబాటులో ఉండగా.. 8951 సీట్లను కేటాయించారు. మొత్తంగా 70 శాతం సీట్లను కేటాయించారు. 121 ఫార్మసీ కాలేజీల్లో 1180 సీట్లు అందుబాటులో ఉండగా.. 31 సీట్లను కేటాయించారు. 2.6 శాతం ఫార్మసీ సీట్లను కేటాయించారు.

# వర్షం కోసం రైతుల ఎదురుచూపులు

## బిందెలతో నీళ్లు చల్లుతున్న అన్నదాతలు

## నాటిన విత్తులు కాపాడుకునేందుకు పాట్లు

### ఈ సీజనులో ఇప్పటివరకూ లోటు వర్షపాతమే

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వర్షాల కోసం రైతన్నలు నిత్యం ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. మృగశిర కార్తె పోయి పది రోజులు కావస్తున్నా వానలు పడక రైతులు తీవ్ర ఆందోళనలు చెందుతున్నారు. ఈ వానాకాలం సీజనులో ఇప్పటి వరకూ లోటు వర్షపాతమే నమోదైంది. వరంగల్, భూపాలపల్లి, రంగారెడ్డి మంచిర్యాల, హన్మకొండ, కరీంనగర్, జగిత్యాల, కామారెడ్డి, నల్లగొండ తదితర జిల్లాల్లో క్రమేపీ వర్షాభావ పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఈ నెల మొదటి వారంలో కురిసిన తొలకరి వర్షాలకు కొన్ని జిల్లాల్లో రైతులు వరి, పత్తి, మొక్కజొన్న, పెసర తదితర పంటల సాగు మొదలు పెట్టారు. తర్వాత వానలు ముఖం చాటేయడం, మరోపక్క ఎండలు మండుతుండటంతో భూములు ఎండిపోయి విత్తనాలు మొలకెత్తే పరిస్థితులు ఎదురవుతున్నాయి.

కొన్ని ప్రాంతాల్లో గత 16 రోజులుగా ఒక్క చుక్క కూడా వర్షం కురవ లేదు. దీంతో వరి నారుమళ్లు, పొలాల్లో వెదజల్లిన వరి విత్తనలకు తేమ లేక కొన్ని మొలకు రాకపోగా, వచ్చినవి ఎండిపోతున్నాయి. ఈ నెల ప్రారంభం నుండి ఇప్పటి వరకూ రాష్ట్రంలోని 14 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. పలు ప్రాంతాల్లో పొడి దుక్కిలోనే విత్తనాలు నాటగా, చిన్న వానలకు కొన్ని విత్తనాలు మొలకెత్తగా, దాదాపు 70 శాతం గింజలు భూమిలోనే పాడయ్యాయి. ఇక మొలకెత్తిన విత్తనాలు, నాటిని విత్తనాలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు స్ప్రింక్లర్లు ఉపయోగిస్తుండగా, మరికొందరు బిందెలతో నీళ్ల చల్లుతున్నారు. అదును దాటితే విత్తనాలు మొలకెత్తడం కష్టమవుతుందని రైతాంగం ఒకింత మనస్థాపానికి గురవుతోంది. వానాకాలంలో రుతుపవనాలు ముందుగానే వస్తాయనే ప్రచారం జరగడంతో పలు జిల్లాల్లో రైతులు ఇప్పటికే దుక్కిలు దున్ని, వరి, పత్తి, మొక్కజొన్న తదితర విత్తులు పెట్టారు. కొందరు రైతులు ఈ నెల మొదటి వారంలోనే పొడి దుక్కుల్లో విత్తనాలు నాటారు. ఇంకొందరు రైతులు చిన్నపాటి వర్షాలు పడగానే భూమి పూర్తిగా తడవక ముందే విత్తనాలు నాటారు. ఇందుకు రైతులు ఇప్పటికే ఎకరానికి దాదాపు 10 వేల రూపాయల వరకూ పెట్టుబడి పెట్టారు. భూపాలపల్లి తదితర జిల్లాలో రోహిణీ కార్తిలో దాదాపు 15 వేల రూపాయలు ఖర్చు చేసి పత్తి గింజలు నాటారు. గింజలు నాటి 10 రోజులు దాటినా వర్షాలు లేక పెట్టిన విత్తులు అక్కరకు రాకుండా పోయాయని రైతులు వాపోతున్నారు. రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో ఈ నెలలో ఇప్పటి వరకూ అసలు వర్షం చినుకులే పడలేదు. అంతకు ముందు కురిసిన వర్షాలకు గ్రామాల్లో పత్తిని విస్తారంగా నాటారు. అయితే వర్షాలు కురియక భూమిలో తేమ లేక పత్తి, మొక్కజొన్న తదితర విత్తనాలు భూమిలోనే ఉండిపోయాయి. మొలిచిన మొలకలు వాడుతున్నాయి. వరంగల్ తదిర జిల్లాల్లో వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో బావులు, చెరువులు, కుంటల వద్ద రైతులు వరి నారు పోశారు. అయితే వర్షాలు ముఖం చాటేయడంతో వరి నారు ఎండిపోతుండటంతో జీర్ణించుకోలేకపోతున్నారు. బిందెలతో నీళ్ల చల్లి వాటిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

# డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడిన డిస్క్ జాకీ

## పరీక్షలో మరో 12 మందికి పాజిటివ్

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** కొంత కాలంగా నార్కోటిక్స్ పోలీసులు డ్రగ్స్ సేవిస్తున్నట్లుగా అనుమానించిన డిస్క్ జాకీ డీజే సిద్ధార్థ్ అనే వ్యక్తి ఎట్టకేలకు వారికి రెడ్‌హాండెడ్‌గా దొరికిపోయాడు. మాదక ద్ర వ్యాల కట్టడికి నార్కోటిక్స్ పోలీసులు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఎక్కడికక్కడ విస్తృత తనిఖీలు చేపట్టడమే కాకుండా, డ్రగ్ డిటెక్టివ్ పరికరాలతో పలువురు అనుమానితులకు డ్రగ్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ టెస్టులలో మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లోని పబ్‌లలో డిస్క్ జాకీగా పనిచేసే సిద్ధార్థ్ అనే వ్యక్తి డ్రగ్స్‌సేవిస్తూ రెడ్‌హాండెడ్‌గా పోలీసులకు పటు ్టబడ్డాడు. ఈ నేపథ్యంలో అతని సన్నిహితులం దరినీ పిలిచిన పోలీసులు వివిధ కోణాల్లో విచారించారు.



డ్రగ్స్ తనిఖీల్లో పట్టుబడిన డిజిటల్ జాకీ సిద్ధార్థ్

గతంలో డ్రగ్ సేవిస్తున్నట్లుగా అనుమానం ఉన్న మొత్తం 16మందిపై నిఘా వేసిన పోలీసులు, వారిని పిలిపించి డ్రగ్ టెస్టులు నిర్వహించగా 12 మంది కొకైన్ వంటి డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది. వీరిలో సిద్ధార్థ్ ఒకడు. ఈ మేరకు వారిని అదుపులోకి తీసుకున్న మాదాపూర్ పోలీసులు, కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా కొన్ని నెలల క్రితం కొకైన్ సేవించి పట్టుబడ్డ యువతికి తాజాగా చేసిన డ్రగ్ పరీక్షలో, ఆమె ఎటువంటి మత్తు పదార్థం సేవించలేదని తేలడం గమనార్హం.

**పోలీసుల సూచన**

చదువుకునే విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారని, వారికి సరైన మార్గంలో పెట్టే క్రమంలో తమ వంతు కృషి చేస్తామని మాదాపూర్ పోలీసులు తెలిపారు. విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాలు రవాణా అవుతున్నట్లు అనుమానమొస్తే స్థానిక పోలీసులకు, తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో నెంబరు (8712671111) కు తక్షణమే సమాచారం అందించాలన్నారు.

# సకాలంలో స్పందించడం వల్లే తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు

## కరీంనగర్ డిపో ఆర్టీసి మహిళా సిబ్బందికి సిఎం రేవంత్ అభినందనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 17:** కరీంనగర్ బస్టాండ్‌లో పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణీకి ప్రసవం చేసి, మానవత్వం చాటుకున్న కరీంనగర్ డిపో ఆర్టీసి మహిళా సిబ్బందిని సిఎం రేవంత్‌రెడ్డి అభినందించారు.

సకాలంలో స్పందించడం వల్లే తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. విధి నిర్వహణలోనూ ఇలాగే మంచి పేరు తెచ్చుకోవాలని ఆశిస్తున్నానని తెలిపారు. ఆదివారంనాడు కరీంనగర్ బస్టాండ్‌లో పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణీకి ఆర్టీసి మహిళ సిబ్బంది,చీరలు అడ్డుగా పెట్టి ప్రవసం చేశారు. అనంతరం 108 కాల్ చేసి ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం తల్లి బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. దినపత్రికలలో వచ్చిన కథనాలను చూసి సిఎం రేవంత్‌రెడ్డి ఎక్స్(ట్విట్టర్)వేదికగా అభినందించారు.

# తెలంగాణలో ప్రజల ఆకాంక్ష నెరవేరింది

## మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి



**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** తెలం గాణాలో ప్రజాపాలన ప్రారంభమై జనరంజ కంగా పథకాలు అమలు చేస్తున్నామని తెలంగాణ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి తెలిపారు. ప్రజల ఆకాంక్ష మేరకు పాలన సాగుతోంద న్నారు. తెలంగాణా మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి సోమవారం ఉదయం తిరుమలేశుని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# పాల రైతులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలి

## ప్రభుత్వానికి రైతు సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పాడి రైతులకు పెండింగ్ పాల బిల్లులను చెల్లించాలని రైతు సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అంతేకాకుండా లీటరుకు 4 రూపాయల ఇన్సెంటివ్ బకాయిలు విడుదల చేయాలని కోరింది. ఈ మేరకు ఒక ప్రకటనలో పాడి పరిశ్రమను నమ్ముకుని రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 7.5 లక్షల మంది పాడి రైతులు రోజుకు సుమారు 4 లక్షల లీటర్ల పాలను సంబంధిత డెయిరీలకు విక్రయిస్తున్నారని తెలిపింది. వారికి ప్రతీ 15 రోజులకు ఒకసారి పాల బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేసింది. అదే విధంగా లీటర్‌కు 4 రూపాయల చొప్పున ప్రోత్సాహక బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేసింది. దీన్ని 5 రూపాయలకు పెంచుతాని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరింది. వీటితో పాటు పాడి రైతులకు గడ్డి కట్టర్ మిషన్, పాలు పిండే యంత్రం 50 శాతం సబ్సిడీపై సరఫరా చేయాలని తెలిపింది.

# పిల్లలను కాపాడి తనువు చాలించిన తండ్రి

## లోయర్ మానేరు డ్యాంమ్‌లో విషాదం

**తిమ్మాపూర్, ప్రభాతవార్త:** దైవ దర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఎల్‌యండీ రిజర్వాయర్‌ను చూసేందుకు ఆగి కాసేపు సరదాగా గడుపుదాం అనుకున్న ఆ కుటుంబంలో తీరని విషాదం నింపిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఫోటోలు దిగుతుండగా రిజర్వాయర్ నీటిలోకి జారిపడిన తన బిడ్డలను కాపాడబోయి తండ్రి మృత్యువాత పడ్డాడు. సంఘటన వివరాల్లోకి వెలితే..కొమురం భీం అసిఫాబాద్ జిల్లాలో పే అండ్ అకౌంట్స్ లో విభాగంలో పని చేస్తున్న బంగారు విజయ్ కరీంనగర్‌లోని రాంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం విజయ్ తన కుటుంబ సభ్యులతో కలిసి హుస్నాబాద్ సమీపంలోని పొట్లపల్లి స్వయంభూ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకొని వస్తున్నాడు. లో తిరుగు ప్రయాణం తిమ్మాపూర్ మండలం అల్గునూర్ సమీపంలోని లోయర్ మానేరు డ్యాంమ్ వద్దకు చేరుకున్నారు. ఎల్ఎండీ కరకట్టపై నుండి సెల్ఫీ దిగుతుండగా విజయ్ కూతురు సాయి నిత్య, కొడుకు విక్రాంత్ డ్యాంమ్ కట్ట నుండి నీటిలోకి జారిపడడంతో వారిని కాపాడాలని భావించిన విజయ్ కట్టపై నుంచి నీటిలో దూకి ఇద్దరు పిల్లలను ఒడ్డు వైపుకు నెట్టేయగా ఎల్ ఎం డీ లో చేపలు పడుతున్న జాలరి శంకర్ అరుపులు విని ఘటనా



స్థలానికి చేరుకొని చిన్నారులు ఇద్దరిని కాపాడాడు. జాలరి శంకర్ అప్రమత్తంగా వ్యవహరించకపోయినట్లయితే ఇద్దరు చిన్నారులు కూడా మృత్యువాత పడేవారు. మిన్నంటిన రోదనలు... ఎల్‌యండీలో సోమవారం జరిగిన ఈ ఘటనతో రిజర్వాయర్ ప్రాంతమంతా రోదనలతో మిన్నంటింది. తన కళ్ల ముందే పిల్లలిద్దరు నీటిలో మునిగిపోతుండగా కాపాడేందుకు వెల్లిన భర్త విజయ్ విగతజీవిగా మారిపోవడంతో భార్యప్రశాంతి కన్నీరు మున్నీరుగా విలపించి సొమ్మసిల్లి పడిపోయింది. విజయ్ మరణ వార్త తెలిసి అతని బందు వులు, స్నేహితులు డ్యాంమ్ వద్దకు చేరుకోవడంతో ఆ ప్రాంతమంతా విషాద చాయలు నేలకొన్నాయి. ప్రమాదం సమాచారం అందు కున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యానారాయణ ఎల్ యం డికిచేరుకొని విజయ్ కుటుంబసభ్యులను పరామర్శించారు.

# గొర్రెలు పంపిణీలో సిపిటి టీం నిర్వాహకులే సూత్రధారులు

## బ్రోకర్లతో కుమ్మక్కై భారీగా రీసైక్లింగ్ విధానం

### మొదటి విడతలో లబ్ధిదారులకు 17 వేల యూనిట్లు పంపిణీ

### యూనిట్‌కు 15 నుండి 20 వేల కమీషన్లు

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త :** గత ప్రభుత్వం గొల్ల కురుమ యాదవుల కొరకై గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని ఆదేశించింది. కానీ నిబంధనలకు వ్యతిరేకంగా సిపిటి టీం(సెంట్రల్ ప్రొక్యుర్‌మెంట్ టీం)లు ఏర్పాటు చేయగా, బ్రోకర్లు గొర్రెల రవాణా కాంట్రాక్టర్లు కుమ్మక్కై రీసైకిలింగ్ చేసి, అనేక అవినీతికి పాల్పడ్డట్లు పలువురు పేర్కొంటున్నారు. కాగా జగిత్యాల జిల్లాలో 18 మండలాల్లో మొదటి విడుతలో సిపిటి టీంల ఆధ్వర్యంలో 17 వేల యూనిట్ల గొర్రెల పంపిణీ చేశారు. కాగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్దిదారుని ఎంపిక చేయాలంటే గ్రామ సభ ఏర్పాటు చేసి 18 సంవత్సరాలు నిండిన వారిని సంఘంలో సభ్యత్వం ఉన్నవారిని మాత్రమే ఎంపికకు అర్హులు. ఎంపిక చేయడంలో మండల పశు వైద్యాధికారి మండల తహశీల్దార్ మండల ఎంపిడివోల సమక్షంలో గ్రామసభలు నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేస్తారు. కానీ కొందరు పశువైద్యులు 2017 సంవత్సరంలో సంబంధిత అధికారుల సంతకాలు లేకుండానే లబ్దిదారులను ఎంపిక చేసినట్లు పలు ఆరోపణలు ఉన్నాయి. కాగా ప్రభుత్వం ఒక యూనిట్‌కు ఒక లక్ష 25 వేలు కేటాయించగా అందులో లబ్దిదారులు 31250 రూపాయలు బ్యాంక్ డిడిల రూపకంగా చెల్లించాల్సి ఉంటుంది. లబ్దిదారునికి 20 ఆడగొర్రెలు ఒక మగ గొర్రె నిబంధన ప్రకారం సిపిటి టీం లీడర్లు అందజేయాల్సి ఉంటుంది. అప్పటి మండలాల్లో పనిచేస్తున్న పశువైద్య అధికారులకు గొర్రెల కొనుగోలు కార్యక్రమంలో అప్పటి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సిపిటి టీం లీడర్లుగా బాధ్యతలు అప్పగించారు. దీనిలో భాగంగా గొర్రెల కొనుగోలుకై పొదిలి ప్రకాశం, మాచర్ల, కనిగిరి, కర్నూల్, ఉదయగిరి, జగ్గా సాగర్ తదితర ప్రాంతాలకు వెళ్లి అక్కడ ఏరియా బ్రోకర్ల ద్వారా గొర్రెలు కొనుగోలు చేసినట్లు గొర్రెల యూనిట్లు లబ్దిదారులు పేర్కొంటున్నారు. ఆ ప్రాంతంలో గొర్రెల కొనుగోలు చేసిన అనంతరం అదే బ్రోకర్చే ఒక యూనిట్‌కు 80 వేలు, 86వేలు, 90 వేలు వరకు మాట్లాడుకొని వారితోనే ఆ బ్రోకర్ జగిత్యాలకు వచ్చి ఒక రోజు తర్వాత గొర్రెల చెవులు కత్తిరించి అవే గొర్రెలను మళ్లీ ఆంధ్ర ప్రాంతానికి తరలించి కొద్ది రోజుల తర్వాత వాటిని మళ్లీ రీసైకలింగ్ విధానంలో యూనిట్లను కొనుగోలు చేసి మళ్లీ పంపిణీ కార్యక్రమం చేసినట్లు పలువురు లబ్దిదారులు పేర్కొంటున్నారు. మొదటి విడుత గొర్రెల పంపిణీలో గొల్ల కురుమలకు నాణ్యతలేని గొర్రెలు ఇవ్వడంతో ఆర్తికంగా తీవ్రంగా నష్టపోయామని పలువురు లబ్దిదారులు వాపోతున్నారు. కాగా 2017,2018 సంవత్సరంలో మొదటి విడుత గొర్రెల పంపిణీలో 17 వేల యూనిట్లు గొర్రెల పంపిణీ చేశారని చెబుతున్నప్పటికీ లబ్దిదారులు డిడిలు కట్టగా కొందరి లబ్దిదారులకు యూనిట్లో సగం గొర్రెలు మాత్రమే ఇవ్వగా, మరికొందరు లబ్దిదారులకు పొట్టేలలు ఇవ్వకనే యూనిట్లను అందజేసినట్లు సంతకాలు తీసుకున్నారని కొందరి లబ్దిదారులకు బక్క గొర్రెలు యూనిట్లు ఇవ్వగా లబ్దిదారులు గొర్రెలు బాగా లేవని పేర్కొనగా కొన్ని డబ్బులు అందజేసి మరుసటి రోజు గొర్రెల యూనిట్లను తరలించుకొని వెల్లినారని లబ్దిదారులు పేర్కొంటున్నారు. జగిత్యాల జిల్లాలో సిపిటి టీం నిర్వాహకులు బ్రోకర్లు ఒక్కొక్క యూనిట్‌కు రూ.15 నుండి 20 వేల వరకు కమీషన్లు తీసుకుంటున్నట్లు లబ్దిదారులు పేర్కొంటున్నారు. సిపిటి టీం నిర్వాహకులు, బ్రోకర్ల, గొర్రెల రవాణా కాంట్రాక్టర్‌ల వీరి గత బ్యాంక్ అకౌంట్లు పరిశీలిస్తే నిజానిజాలు తేలనున్నాయని లబ్దిదారులు పేర్కొంటున్నారు.

# సంక్షేమానికి రూ.5,500 కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** సంక్షేమ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సుమారు 5,500 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. ఫీజు బకాయిల కోసం ఇప్పటికే కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యా సంవత్సరం త్వరలో ప్రారంభమైన నేపథ్యంలో బకాయిలు వసూళ్ల కాలేజీ యామాన్యాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై వత్తిడి తెస్తున్నాయి.

బకాయిలు చెల్లించక పోవడంతో పై చదువులు నిమిత్తం ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన సర్టిఫికెట్లు ఇచ్చేందుకు కాలేజీ యాజమాన్యాలు నిరాకరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పలువురు పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు.

ఇంటర్, డిగ్రీ, పీజీ తదితర చదువుల నిమిత్తం ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీఇంబర్సమ ఎంట్, ఉపకార వేతనాలను చెల్లిస్తోంది. అయితే గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయం నుండి దాదాపు నాలుగేళ్లుగా ఈ బకాయిలు పేరుకు పోయాయి.

# చిత్రదుర్గ రేణుకాస్వామి హత్యకేసులో దర్శన్, మరో 20 మంది అరెస్ట్

## పోలీసు కస్టడీలో కన్నడ హీరో అండ్ టీం



కన్నడ సినీహీరో దర్శన్, పవిత్రాగౌడ

**బెంగళూరు, జూన్ 17, ప్రభాతవార్త ప్రతినిధి:** తన సహచరురాలికి ఒక యువకుడు అశ్లీల మేసేజులు పంపుతున్నాడన్న కోపంతో కన్నడ సినీహీరో దర్శన్ తన అనుచరుల చేత చిత్రదుర్గపట్టణ నివాసి రేణుకాస్వామి అనే యువకుడిని కిడ్నాప్ చేసి బెంగళూరులో ఒక షెడ్‌లో చిత్రహింసలు పెట్టి హత్య చేసిన కేసులో సోమవారం బెంగళూరు పోలీసులు కన్నడ హాస్యనటుడు చిక్కణ్ణను అన్నపూర్ణేశ్వరీనగర్ స్టేషన్‌కు పిలిపించి విచారణ జరిపారు. వివరాల్లోకి వెళితే.. హీరో దర్శన్‌కు అనుచరురాలిగా ఉన్న ఫ్యాషన్‌డిజైనర్ పవిత్రాగౌడను చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి అనే యువకుడు మొబైల్‌ద్వారా అశ్లీల మేసేజులను పంపి వేధించాడు. ఇతడు వాస్తవంగా దర్శన్ అభిమాని కూడా. ఇటీవల కాలంలో హీరో దర్శన్ తన భార్యను దూరం చేసుకుని పవిత్రాగౌడతో చనువుగా ఉండటాన్ని జీర్ణించుకోలేని ఆ అభిమాని తన హీరో కుటుంబం ఒక యువతి వలన ఛిన్నాభిన్నం అయ్యిందని ఆగ్రహించి సదరు పవిత్రాగౌడకు అశ్లీల మేసేజులు పంపి తన కోపం తీర్చుకున్నాడు. ఈ సంగతిని పవిత్రాగౌడ హీరో దర్శన్ దృష్టికి తీసుకువెళ్లటంతో అతడు గత శుక్రవారం తన అనుచరులను చిత్రదుర్గకు పంపి యువకుడిని కిడ్నాప్ చేయించాడు. ప్రారంభంలో సదరు యువకుడిని బెంగళూరుకు పిలిపించి గట్టిగా వార్నింగ్ ఇవ్వాలని అనుకున్న తరుణంలో దర్శన్ అనుచరులు చెలరేగిపోయి రేణుకాస్వామిని బెంగళూరు పట్టణగెరెలో ఉన్న జయణ్ణ అనే వ్యక్తి ఫారంహౌస్ షెడ్లో చిత్రహింసలు పెట్టి కొట్టారు. అంతటితో ఆగకుండా రేణుకాస్వామికి కరెంట్ షాక్ కూడా ఇచ్చారు. దీంతో ఆ యువకుడు మృతి చెందాడు. మృతశరీరాన్ని అదే దర్శన్ అనుచరులు ఒక మధ్యరాత్రి కామాక్షిపాళ్య సమీపంలోని పెద్ద మురుగునీటి కాలువలో పడేసి పోయారు. ఈ సమాచారం తెలుసుకున్న కామాక్షిపాళ్య పోలీసులు గత ఆదివారం గుర్తుతెలియనిశవం పేరిట పంచనామా చేసి దర్యాప్తు చేయగా అసలు సంగతి బయటపడింది. ఆలోగా నలుగురు అగంతుకులు కామాక్షిపాళ్య స్టేషన్‌కు వచ్చి తామే రేణుకాస్వామిని హత్య చేశామని చెప్పి పోలీసుల ఎదుట లొంగిపోయారు.

పోలీసులు ఆ నలుగురిని మరింత విచారణ జరపగా సినీహీరో దర్శన్ సూచనల మేరకు చిత్రదుర్గ నుంచి రేణుకాస్వామిని కిడ్నాప్ చేసి బెంగళూరుకు తీసుకువచ్చి హత్య చేసినట్లు అంగీకరించారు. దీంతో పోలీసులు గత సోమవారం దర్శన్‌ను మైసూరు నివాసంలో అరెస్టుచేసి బెంగళూరుకు తీసుకువచ్చారు. ఈలోగా సదరు నలుగురు దుండగులు ఇచ్చిన సమాచారం మేరకు మరో 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిని ఈనెల 15న బెంగళూరు ఆర్థిక నేరాల కోర్టుకు హాజరుపరచగా వారిని ఈనెల 20వరకు పోలీసు కస్టడీకి అప్పగించారు. ప్రస్తుతం బెంగళూరులోని అన్న పూర్ణేశ్వరీ పోలీసుస్టేషన్‌లో హీరో దర్శన్ ఎ1 నింది తుడిగా అతడి సహచరురాలు పవిత్రాగౌడ ఎ2 నిందితు రాలిగా జైల్లో ఉన్నారు. సోమవారం ఈ కేసులో పోలీ సులు కన్నడ హాస్యనటుడు చిక్కణ్ణను స్టేషన్‌కు పిలిపించి విచారణ జరిపారు. ఇతడు కూడా దర్శన్ అండ్ గ్యాంగ్ రేణుకాస్వామిని హత్యచేసే ముందు ఆరోజు మధ్యాహ్నం స్థానిక రాజరాజేశ్వరీనగర్‌లోని స్టోనిబ్రూక్ బార్ రెస్టారెంట్‌లో విందు పార్టీ చేసుకోగా దాంట్లో చిక్కణ్ణ కూడా హాజరయ్యాడు. ఈ సమాచారం మేరకు పోలీసులు హాస్యనటుడు చిక్కణ్ణకు దర్శన్ అండ్ గ్యాంగ్ జరిపిన హత్య కేసులో ఏదైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హీరో దర్శన్ ఇక్కడ అగ్రనటుడుగా చలామణి అవుతున్నారు. అయితే ఈమధ్యలో ఇతడు ఒక యువకుడి హత్యకేసులో ఇరుక్కుపోయి ఇపుడు జైలు పాలయ్యాడు. కర్ణాటక ప్రభు త్వం రేణుకాస్వామి హత్య కేసు పట్ల ప్రత్యేక పోలీసు అధికారుల టీంను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తోంది.

బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ
(భారత ప్రభుత్వ ఇంధన మంత్రిత్వశాఖ ఆధీనంలోని చట్టబద్ధమైన సంస్థ)
4వ అంతస్తు, సేవా భవన్, R K పురం, న్యూఢిల్లీ-110066
వెబ్‌సైట్: www.beeindia.gov.in ఫోన్ : 011-26766700
LiFE

ఎనర్జీ మేనేజర్‌లు, మరియు ఎనర్జీ ఆడిటర్‌లకు 28వ మరియు 29వ సెప్టెంబరు, 2024న 24వ జాతీయ ధృవీకరణ పరీక్ష

బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ, ఎనర్జీ మేనేజరులు మరియు ఎనర్జీ ఆడిటర్‌లకు 24వ జాతీయ స్థాయి సర్టిఫికేషన్ పరీక్షను **28వ మరియు 29వ సెప్టెంబరు, 2024** (శనివారం మరియు ఆదివారం) నిర్వర్తిస్తోంది.

వెబ్‌సైట్‌లో సమకూర్చిన సూచనల ప్రకారం **www.aipnpc.org** నుండి నిబంధనావళిని డౌన్‌లోడెడ్ చేసుకొనవచ్చును. **www.beeindia.gov.in** వద్ద పై వెబ్‌సైట్‌కు లింక్ కూడా అందుబాటులో ఉంచడమైనది.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ యొక్క ఆరంభం : 1వ జూలై, 2024 17.00గం. వద్ద
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ యొక్క ముగింపు : 31వ జూలై, 2024 23:59 గం.వద్ద.

(సెక్రటరీ)

CBC 34106/12/0004/2425

సమస్యలను చేపట్టేవారి శక్తి సామర్థ్యాలపైనే వాటి పరిష్కారం ఆధారపడి ఉంటుంది.

-గ్లిబ్బర్

# పంచాయతీలను పాడుపెట్టొద్దు!

జాతిపిత మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించే దిశలో అడుగులు వేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని పాలక పెద్దలు ఏనాటి నుంచో చెప్తున్నా ఆచరణకు వచ్చేసరికి హామీలుగానే మిగిలిపోతున్నాయి. స్వాతంత్య్రం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటినా నేటికీ గ్రామీణ వ్యవస్థ అస్తవ్యస్తంగానే ఉంది. కనీసం రాజ్యాంగం కల్పించిన అధికారాలు కూడా స్థానిక సంస్థల ప్రతినిధులకు అప్పగించేందుకు పాలకపెద్దలకు మనసు రావడం లేదు. వాస్తవంగా గ్రామస్వరాజ్యం గురించి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఎందరో నాయకులు ఇవే మాటలు పదే పదే చెప్తూనే ఉన్నారు. వాటికి కేటాయించిన నిధులు, విధులు అప్పగిస్తామని ఎప్పటికప్పుడు వెల్లడిస్తూనే ఉన్నారు. కానీ క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ఒక వ్యూహం ప్రకారం స్థానిక సంస్థ ప్రతినిధులకు ప్రాధాన్యత తగ్గిస్తూనే వస్తున్నారు. దాదాపు సర్పంచులను అధికారంలేని ఉత్సవ విగ్రహాలుగా మార్చారు. ఒకనాడు సర్పంచులకు ఉన్న ప్రాధాన్యత నేడు కానరావడం లేదనేది వాస్తవం. ఇందుకు కారణం ఆ పార్టీ, ఈ పార్టీ అనేదానికంటే ఎవరు అధికారంలో ఉన్నా పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు తమ ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. గ్రామస్థాయిలో ఎన్నో కమిటీలు పెట్టి సర్పంచులను పక్కనబెట్టారు. వారి ప్రమేయం లేకుండానే వారికి తెలియకుండా ఎన్నో కార్యక్రమాలు గ్రామాల్లో జరిగే పరిస్థితులు తీసుకువచ్చారు. ఒకరకంగా చెప్పాలంటే సర్పంచులకు సమాంతరంగా పదవులు సృష్టించారు. ఆంధ్రప్రదేశ్‌లో అయితే వాలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి సర్పంచులను, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారు. ఇలాంటి చర్యలతో గతంలో ఉన్న ప్రాధాన్యత కూడా స్థానిక ప్రతినిధులకు లేకుండా పోయింది. గత ఎన్నికల్లో కూడా నేతలు చేసిన వాగ్దానాలతో ఏదో సాధించాలని సమాజానికి ఏదో చేయాలని ప్రధానంగా తాము పుట్టిన, పెరిగిన ఊరికి సేవలు అందించాలని నూతనోత్సాహంతో ఎందరో యువతీయువకులు ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నో వ్యయప్రయాసలకులోనై సర్పంచులు మండలాధ్యక్షులు తదితర స్థానిక పదవులకు ఎన్నికై తాముచేసిన వాగ్దానాలను తీర్చేందుకు నడుం కట్టారు. ఈ చట్టాల వలలో తాము ఏమీ చేయలేమనే విషయం చాలా కాలానికి కానీ వారికి అర్థంకాలేదు. అయినా తమ ప్రజలకు తాము చేసిన వాగ్దానాలను పూర్తి చేసేందుకు తలతాకట్టుపెట్టి అప్పోసొప్పో చేసి కొన్ని ప్రాంతాల్లో సర్పంచులు పనులు పూర్తి చేశారు. అయితే ఎంతకీ ఆ బిల్లులు రాకపోవడం, ఆఫీసుల చుట్టూ తిరిగితిరిగి ఇంకొకపక్క అప్పులు, వడ్డీలు పెరిగి, మరొకపక్క గ్రామప్రజల ముందు తలవంచుకోలేక తెలుగు రాష్ట్రాల్లో ఆత్మహత్యలకు పాల్పడిన సర్పంచులున్నారు. మరెందరో స్థానికప్రజాప్రతినిధులు పడుతున్న వేదన అంతాఇంతాకాదు. ఇలాంటి పరిస్థితుల్లో గతజనవరి 31తేదీతో వారి పదవీకాలం పూర్తయిపోయింది. ఫిబ్రవరి నుంచి మాజీలైపోయారు. మరో ఆరునెలలపాటు వారికే పొడిగించే అవకాశం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించారు. రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి మాజీలుగా మారి బిల్లులకోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఎప్పుడు వస్తాయో తెలియదు. చెప్పేవారు లేరు. వారిపరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఒకనాడు పంచాయతీరాజ్ వ్యవస్థలో సర్పంచులంటే ఎంతో గౌరవ మర్యాదలుండేవి. భారతదేశంలో స్థానిక సంస్థలకు ఎన్నో వేల సంవత్సరాల చరిత్రఉంది. చంద్రగుప్తుడికంటేముందు నుంచే గ్రామాలు, గ్రామవ్యవస్థ అమలులో ఉన్నాయి. అప్పుడు కూడా గ్రామ సభలుండేవి. గ్రామసభల నిర్ణయమే కీలకం. వాటి నిర్ణయాలకు ఆనాటి రాజరిక వ్యవస్థ ఎంతో ప్రాధాన్యతనిచ్చేది. ఇలా ప్రాచీనకాలం నుండి మన దేశంలో ఏదో ఒక రూపంలో ఈ వ్యవస్థ కొనసాగుతూనే ఉన్నది. 1882లో బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి లార్డ్‌రిప్పన్ స్థానిక సంస్థలకు ఒక ప్రతిపత్తి కల్పించారు. గాంధీ మహాత్ముడు ప్రవచించిన గ్రామస్వరాజ్యం లక్ష్యంలో స్థానిక సంస్థల పటిష్టత అన్నది ఒకముఖ్యాంశం. భారత రాజ్యాంగంలో కూడా స్థానిక సంస్థలకు అవసరమైన అధికారాలు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలుతీసుకోవాలని స్పష్టంగా సూచించారు. 1952 నుంచి ఎన్నో కమిటీలు, మరెన్నో అధ్యయనాలు, మార్పులు చేర్పులు చేశారు. కానీ సర్పంచులకు రాజ్యాంగం కల్పించిన అధికారాలు ఇవ్వడానికి మాత్రం పాలకపెద్దలకు మనసు ఒప్పడంలేదు. రానురాను పంచాయతీరాజ్ వ్యవస్థను నామమాత్రంగా చేసేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ప్రజాస్వామ్యపద్ధతిలో ఎన్నికైన సర్పంచులను సస్పెండ్ చేసే అధికారం అధికారులకు కట్టబెట్టే దురదృష్టపురోజులు దాపురించాయి. పంచాయతీ రాజ్ వ్యవస్థలో ఎన్నో మార్పులు, చేర్పులు చోటు చేసు కున్నా ప్రభుత్వాలు మారినా అధికార వికేంద్రీకరణలో మాత్రం ఆది నుంచి పాలకపెద్దలు జాగ్రత్త పడుతూనే ఉన్నారు. ప్రజాస్వామ్యవ్యవస్థకు పంచాయతీ రాజ్ పునాది వంటిది. అందులో సర్పంచులు చాలా కీలకం. రాష్ట్రానికి మరిన్ని అధికారాలు కావాలని కేంద్రం ముందు గావుకేకలు పెడుతున్న నాయకులు స్థానిక సంస్థలకు మాత్రం అధికారాలు ఇవ్వడానికి ఇష్టపడకపోవడం దురదృష్టకరం. ఇప్పటికైనా ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యం అంటూ వల్లించే నేతలు పంచాయతీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించి రాజ్యాంగం కల్పించినఅధికారాలు ఆసంస్థలకు దఖలుచేయాలి. ప్రజాస్వామ్యానికి మూలమైన స్థానిక సంస్థలను నిర్వీర్యంచేయడం ఏమాత్రం సమంజసంకాదు.

విగ్రహాన్ని దేవునిగా తలచి పూజించడం శ్రేష్టం. దేవుణ్ణి విగ్రహంగా భావించడం దోషం.



డబ్ల్యు ఎమర్సన్

శత్రువుని జయించినవాడు విజేతకాదు. శత్రుత్వాన్ని జయించినవాడే నిజమైన విజేత.



స్వామి వివేకానంద

# ఫీజుల భారాన్ని తగ్గించేదెలా?

**దేశంలోని వివిధ రాష్ట్రాలలో అధి కారంలోకి ఏ ప్రభుత్వం వచ్చినా ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల జోలికి మాత్రం ఎవరూ పోయినా దాఖలాలు లేదనే విషయం గుర్తుంచుకోవాలి. విద్యాసంస్థలకు ఎలాంటి సమస్యలు రాకుండా పాలకులను, అధికారులను తమకు అనుకూలంగా మలచుకోవడంలో కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు సక్సెస్ అవుతున్నారు. శతకోటిదరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా ఏదో ఒక విధంగా వాటి నుండి తప్పించుకుం టూ తమ వ్యాపారాన్ని ఏ అడ్డురాకుండా కొనసాగిస్తున్నా రు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాల వేధింపులను భరించలేక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరికలు గణనీయంగా పెరుగుతున్నాయని చెప్పొచ్చు.**

లకావత్ చిరంజీవి నాయక్

తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల జులం ప్రారంభమైందని చెప్పవచ్చు. పాఠశాలలు ప్రారంభం కాగానే ఫీజుల మోతతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. తమను అడిగేవారు లేరు, మేము అడిగినంత ఇవ్వాల్సిందే అంటూ లక్షల రూపాయల ఫీజులను విద్యాసంస్థల యాజమాన్యాలు పెంచుకుంటూపోతున్నాయి. ఈ యాజమాన్యాలను ఏ ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు. రకరకాల పేర్లతో రాష్ట్రంలో పుట్టుకొస్తున్న నూతన పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యజమాన్యాలు యజమానిగా, విద్యార్థి మాత్రం వినియోగదారుడు అయిపోయాడు. ఇటువంటి వాతావరణంలో నేడు విద్య అనేది అందరికీ కాకుండా కొందరికి అందిన ద్రాక్షలాగా మారుతున్నది. డబ్బున్న వారికి నట్టింటిలోకి నడిచి వచ్చే అమ్మకపు వస్తువుగా, పేదవాడు ఏ నాటికి కొనలేని ఖరీదైన వస్తువుగా విద్య మారిపోతున్నది. అ,ఆ,లు, ఎబిసిడిలు అనే అక్షరాలు నేర్చుకోవాలంటే మన తెలంగాణ రాష్ట్రంలోని అక్షరాల వేల రూపాయలు నుండి లక్షల రూపాయల వరకు చెల్లిస్తేనే పాఠశాలలో విద్య దొరుకుతుందని నమ్మకం కులుగుతుందని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలు అనుమతి లేకుండా పట్టణం, మండలాల్లో విస్తరిస్తూ ఫీజుల విషయంలో ఏకఛత్రాధిపత్యంగా వ్యవహరిస్తున్నాయి. నర్సరీ నుండి మొదలుకొని పదవ తరగతి పూర్తి కావాలంటే తల్లిదండ్రులు తలలు పట్టుకొని ఏడవాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రతి సంవత్సరం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు 20 నుండి 40 శాతం వరకు ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతి లేకుండానే వాళ్లే ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచేస్తున్నారు. విద్యార్థుల నుండి వేల రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నా విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదు. ఇరుకు, చీకటి గదుల్లో విద్యాబోధన చేస్తున్నారు. యూకెజి స్థాయి పిల్లలు కూడా పుస్తకాల మూటను మోసుకొని మూడంతస్తుల బిల్డింగ్ ఎక్కుతున్నారు. ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విశాలమైన ఆట స్థలం ఉండాలనే నిబంధనలు ఉన్నప్పటికీ ఆ నిబంధనలు ఎక్కడా కనబడడం లేదు. విద్యార్థులకు చదువులు తప్ప ఆటలు ఆడించిన దాఖలాలు అసలుకే ఉండదు. విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో పుస్తకాలు, డ్రెస్సులు, పాఠశాలలోనే అమ్మకాలు జరుగుతున్నాయి. దీనికితోడుగా విద్యాశాఖ అధికారుల అవినీతి అలసత్వం వల్ల ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆడింది ఆటపాడింది పాటగా కొనసాగుతున్నది. ఈ దోపిడీపై అన్ని వర్గాల్లోచర్చ జరుగుతున్నది. తెలంగాణ రాష్ట్రంలోని రోజురోజుకు అనుమతులు లేకుండా అనేక రకాల పేర్లతో విచ్చలవిడిగా పాఠశాలలు పెరుగుతున్నాయి. అనుమతిలేకుండా పాఠశాలలు నడిపిస్తూ తప్పుడు ర్యాంకులు, మార్కులు సృష్టించి, గత సంవత్సర కాలంలో సాధించిన మార్కులను ప్రచారం చేసుకుంటూ కరపత్రాలు, వివిధ పేపర్ ప్రకటనలు, బ్యానర్లు, గోడల మీద వాల్‌రైటింగ్ ఇతర రూపాలలో ప్రచారం నిర్వహిస్తూ అడ్మిషన్లు అక్రమంగా చేసుకుంటున్నారు. ఇదంతా జరుగుతున్నప్పటికీ అసలు ఈ రాష్ట్రంలోని సంబంధిత విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాలకులు ఉన్నారా? లేరా? అనే అనుమానంగా ఉన్నదని చర్చించుకుంటున్నారు. అనుమతిలేని పాఠశాలలను సంవత్సరాల కొద్దీ నడుపుతున్నా



ఎందుకు పట్టిపట్టనట్లు ఉండడం అర్థంకావడం లేదని అంటున్నారు. అలాగే వాటిని రాజకీయ నాయకులు విద్యాశాఖ అధికారులు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభిస్తున్నారు. భవిష్యత్తులో ఇందులో చదివినపాఠశాల విద్యార్థులకు సమస్యలు వస్తే ఎవరు బాధ్యత వహిస్తారు? వీళ్లు చేసే తప్పిదాలకు విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారనేది గమనించాలి. తక్షణమే గుర్తింపు లేని పాఠశాలలను విచారణ జరిపి యజమానులపై కేసు నమోదు చేసి నిర్లక్ష్యంగా వ్యవహరించినఅధికారులపై కేసునమోదు చేయాలి. ప్రతి సంవత్సరం విద్యాసంవత్సరం ప్రారంభంలోనే కార్పొరేట్ విద్యాసంస్థలు అనేక రకాలుగా విద్యావ్యాపారం చేస్తున్నప్పటికీ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి పూర్తిగా పట్టించుకోకుండా యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే విద్యాసంస్థలలో కౌంటర్ పెట్టి బుక్స్ అమ్మకూడదని చెప్పినప్పటికీ పాఠశాల యాజమాన్యం ఇప్పటికే సగంపైగా పుస్తకాల అమ్మకాలు జరిపారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదుచేస్తే దాటేసే ప్రయత్నం చేస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా విద్యారంగాన్ని మనదేశంలో, తెలుగు రాష్ట్రాల్లో ప్రైవేట్, కార్పొరేట్ శక్తులు శాసిస్తూ వస్తున్నాయి. గతంలో 100 రూపాయల నుండి ప్రారంభమైన ఫీజులు నేడు లక్షలకు చేరుకున్నదంటే మార్కెట్లో ఎంతగా విద్యావ్యాపారం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం దేశంలోని సుమారుగా 3.20 లక్షల ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు నడుస్తున్నాయి. అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, పరీక్ష ఫీజులు, హాస్టల్ ఫీజులు, లైబ్రరీ ఫీజులు, లేట్ ఫీజులు, ప్రాక్టికల్ ఫీజులు, స్కూల్ డ్రెస్ ఫీజులు, స్కూల్ వ్యాన్ ఫీజులు, పుస్తకాల ఫీజులంటూ రకరకాలుగా పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన తల్లిదండ్రుల నుండి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలలో ఫీజుల దోపిడీని అరికట్టడానికి ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు పేరెంట్స్ సంఘాలు ఏర్పడి ఎన్నో ఉద్యమాలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించినా ప్రైవేట్ పాఠశాలల బుద్ధి ఏ మాత్రం మారడంలేదని చెప్పొచ్చు. కొన్ని కార్పొరేట్ పాఠశాలలో కోటీశ్వరులు ఉన్నతవర్గాల పిల్లలకు మాత్రమే అడ్మిషన్ ఇస్తున్నారంటే అర్థం చేసుకోవచ్చు. ఈ పాఠశాలలో ఎక్కడా కూడా రిజర్వేషన్లు కనబడవు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఈ పాఠశాలలో చోటు అసలుకేదక్కదు. రాష్ట్రంలో విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడస్తున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అనేక రకాలుగా విద్యనువ్యాపారంగా మార్చుకొని, పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను ఫీజులతో ముంచుతున్నారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు రాజకీయవ్యక్తులకు తలొగ్గకుండా యాజమాన్యాలకు అమ్ముడుపోయే పరిస్థితి రాష్ట్రంలోని విద్యాశాఖ అధికారులపై అనుమానం ఉన్నది. ఒకప్పుడు వివిధ రాజకీయ పార్టీలకు, పారిశ్రామికవేత్తలు ఆర్థిక బలాన్ని చేకూర్చి తద్వారా తమ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకునే వాళ్లు. ఇప్పుడు ఆ పాత్రను ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పోషిస్తున్నాయి. ఎన్నికలలో రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఆర్థిక బలాన్ని చేకూరుస్తూ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాల ద్వారా విద్యాసంస్థల అవసరాలను గడుపుకుంటూ వస్తున్నాయి. అందుకనే దేశంలోని వివిధ రాష్ట్రాలలో అధికారంలోకి ఏ ప్రభుత్వం వచ్చినా ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల జోలికి మాత్రం ఎవరూ పోయినా దాఖలాలు లేదనే విషయం గుర్తుంచుకోవాలి. విద్యాసంస్థలకు ఎలాంటి సమస్యలు రాకుండా పాలకులను, అధికారులను తమకు అనుకూలంగా మలచుకోవడంలో కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు సక్సెస్ అవుతున్నారు. శతకోటిదరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా ఏదో ఒక విధంగా వాటి నుండి తప్పించుకుంటూ తమ వ్యాపారాన్ని ఏ అడ్డురాకుండా కొనసాగిస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాల వేధింపులను భరించలేక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరికలు గణనీయంగా పెరుగుతున్నాయని చెప్పొచ్చు. •

# అపరిశుభ్రతకు నిలయాలుగా ప్రభుత్వాస్పత్రులు

బుగ్గన మధుసూదన రెడ్డి

ఈ రాష్ట్ర ప్రభుత్వాల వారు ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి పట్ల ఎంతో శ్రద్ధాశక్తులు కనబరుస్తూ అక్కడి పరిసరాల పరిశుభ్రతను, మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు తగిన బడ్జెట్ ఏర్పాటు చేసి ఎన్నో చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రభుత్వ ఆస్పత్రిలోని కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యవైఖరి మూలాన అక్కడి రోగుల వార్డులు ఎలుకలకు, దోమలకు, పాములకు, విషసర్పాలకు నిలయాలుగా మారుతూ అక్కడికి వైద్యనిమిత్తమై వస్తున్న రోగులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోని వార్డులు ఒక నరకకూపంగా మారుతుండటం కడు శోచనీయం. 'వైద్యో నారాయణో హరి' అంటారు కదా. ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్సశక్తికి మించిన పని కావడంతో బీద, బిక్కి, నిరుపేదలు తప్పనిసరి పరిస్థితుల్లో వైద్యం చేయించుకునే నిమిత్తమై ప్రభుత్వ ఆస్పత్రులకు నిత్యం ఎంతో దూరప్రాంతాల నుంచి వందలాది మంది వస్తూ ఉంటారు. మరీ వారికి లక్షలాది రూపాయలు జీతాలు తీసుకుంటున్న డాక్టర్లు, వేలాది రూపాయల జీతాలు తీసుకుంటున్న దిగువ స్థాయి ఆరోగ్య సిబ్బంది వంటివారు తమ వృత్తికి తగిన న్యాయం చేస్తూ రోగుల వార్డులు పరిశుభ్రంగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకునే గురుతర బాధ్యత ముమ్మాటికీ వారి భుజస్కంధాలపై ఉంది. ఇందులో భాగంగా అక్కడి బాత్రూంలలో గాని, వార్డులలో గాని ఎక్కడైనా పెద్దపెద్ద రంధ్రాలు ఉంటే తక్షణమే వాటిని పూడ్చివేయడంతో పాటు అక్కడి బండసట్టం మరీ పాతపడిపోయి చీలికలు వచ్చివుంటే తక్షణమే వాటి మరమ్మతులపై దృష్టి పెట్టాలి. అప్పుడే అక్కడి వార్డులలో పాములు,



ఎలుకలు, దోమలు వంటివి చొరబడకుండా రోగులు తగిన రక్షణలో ఉండగలుగుతారు. ఎందుకంటే అక్కడికి వచ్చే రోగులు ఎంతో అపాయకరమైన పరిస్థితుల్లో, ఆందోళనతో ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తూ ఉంటారు. అలాంటి రోగులు వారి తరపున సహాయకారిగా ఉండేందుకు వచ్చే వారి కుటుంబసభ్యులకు తగిన సౌకర్యాలు కనీసం ఒక మోస్తారులోనైనా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ ఆస్పత్రులలోని సిబ్బందిపై ఎంతైనా ఉంది. ఏదిఏమైనా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలు అనేవి సామాన్యులకు, నిరుపేదలకు ఒక దేవాలయాల వంటివి. కాబట్టి అక్కడికి విచ్చేసే రోగుల పట్ల భగవంతుడు భక్తులకు అనుగ్రహమిచ్చినట్లు, అక్కడి డాక్టర్లు, మిగతా ఆరోగ్య సిబ్బంది వారి పట్ల ఎంతో ప్రేమానురాగాలతో, అప్యాయతతో నడుచుకొని, వారు చేరిన వార్డులలో ఎలాంటి అపరిశుభ్రత వాతావరణం లేకుండా యుద్ధ ప్రాతిపదికన తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఏమైనా 'ఆరోగ్యమే మహాభాగ్యం' అంటారే అలా అనారోగ్యం పాలైన తమ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకునేందుకు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలకు వచ్చే నిరుపేద రోగులపట్ల కాస్త కనికరం చూసి అక్కడి పరిసరాలలో దుమ్ము, ధూళి పేరుకుపోకుండా, విష పురుగులు, తేళ్లు వంటివి సంచరించకుండా అత్యంత అప్రమత్తతతో వ్యవహరించాల్సిన తక్షణ కర్తవ్యం, బాధ్యత ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందిపై ఎంతైనా ఉంది. నిరుపేద రోగులకు ప్రభుత్వ ఆస్పత్రులు అనేవి తమ ప్రాణాలు నిలబెట్టే ఒక రక్షణ కవచంలా ఉండాలి. కానీ భయభ్రాంతులు కలిగించేలా చెత్తాచెదారంతో అపరిశుభ్రతకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా ఎలాంటి పరిస్థితుల్లో మారకూడదు. •

# ప్రజావాక్కు



## టీచర్ పోస్టులను భర్తీ చేయాలి

ప్రమోషన్స్ ద్వారా ఏర్పడే ఖాళీలు డిఎస్సీలో జతచేయాలి. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన టీచర్ల బదలీలు ప్రమోషన్స్ ప్రక్రియ ద్వారా ఏర్పడే తొమ్మిదివేల ఉపాధ్యాయ ఖాళీలు ప్రస్తుతం ఉన్నడిఎస్సీ నోటిఫికేషన్స్‌లో జతచేసి లక్షలాది మంది నిరుద్యోగులకు న్యాయం చేయాలి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మెగా డిఎస్సీ ద్వారా 25 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. ఎన్నికల్లో పెద్దఎత్తున డిఎస్సీ అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చారు. గత ప్రభుత్వం జారీ చేసిన 5089 టీచర్ పోస్టులకు కొత్త ప్రభుత్వం మరో ఆరువేల టీచర్ పోస్టులు మాత్రమే జత చేసి 11062 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. గతఎనిమిది సంవత్సరాలుగా టీచర్ పోస్టులు భర్తీ కాలేదు. హేతుబద్ధీకరణ అంటూ టీచర్ పోస్టులను కుదించకుండా మొత్తం ఖాళీలు ప్రస్తుత డిఎస్సీలోనే కలిపి అందరికి న్యాయం చేయాలి.

-రావుల రామ్మోహన్‌రెడ్డి, హైదరాబాద్

## కూరగాయల ధరలు తగ్గించాలి

రాష్ట్రంలో కూరగాయాల ధరలకు రెక్కలొచ్చాయి. ఎండాకాలం ముగిసినా కూడా ధరలు పెరుగుతున్నాయే తప్ప తగ్గడంలేదు. దీనివల్ల పేదమధ్యతరగతి ప్రజలకు ఎంతో భారం అవుతుంది. ఒకపక్క నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వలన జనంజేబులకు చిల్లిపడింది. ఇక కూరగాయల ధరలు కూడా పెరగడం వలన జనంతీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏమికొనాలో ఏమితినాలో అనిజంకుతున్నారు. కావునా ప్రభుత్వం వెంటనే ఈ విషయంపై తీవ్రంగా స్పందించాలి. ధరల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలి.

-శ్రిష్టిశేషగిరి, సికింద్రాబాద్

## స్మార్ట్‌ఫోన్లదే రాజ్యం

అన్ని పనులు సాధ్యమైనంతవరకు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. ఇందుకు స్మార్ట్‌ఫోన్ కారణమని చెప్పుకోవచ్చు. ప్రస్తుత పేద, ధనిక, అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల ప్రజలు స్మార్ట్‌ఫోన్‌ను విరివిగా వినియోగిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ వల్ల గడియారాలు, టార్చిలైట్లు, రేడియో, పోస్ట్‌కార్డు వినియోగం, స్టూడియోలో ఫొటో తీయించుకోవడం వంటివితగ్గిపోయాయి. ఆర్థిక లావాదేవీలు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. స్మార్ట్‌ఫోన్ మనిషి జీవితాన్నే శాసిస్తుంది.

-సి.ఎన్.మూర్తి, అంబాజీపేట

## మౌలిక సదుపాయాలు కల్పించాలి

**కూటమిగా** ఏర్పడిన తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. పంచాయతీరాజ్ శాఖ తీసుకున్న పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఆ శాఖను ప్రక్షాళన చేయాలి. గ్రామాల్లో సామాజిక పెన్షన్ల పంపిణీ చేయడానికి వాలంటీర్లు అవసరం లేనేలేదు. వాటిని గ్రామాల్లోపనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల ద్వారా పంపిణీ చేయవచ్చు. ఇంకాకాదనుకుంటే పంచాయతీ ప్రెసిడెంట్లు పంచాయతీ వార్డుమెంబర్లు ద్వారా పంపిణీ చేయవచ్చు. పంచాయతీ ప్రెసిడెంట్‌లకు వార్డు మెంబర్లకు తగినట్టుగా పనిచేసే విధంగా విలేజ్ వార్డ్ వెల్ఫేర్ సెక్రెటరీల ద్వారా ఈ పనులను చేయించవచ్చు. సంపాదన సృష్టించడానికి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వనరు అయినవ్యవసాయ రంగాన్నినిర్లక్ష్యం చేయకూడదు. రవాణా సౌకర్యాలకు వీలుగా రోడ్లపై దృష్టి సారించాలి.

-వీరగంట భాస్కర్‌రావు, బొబ్బిలి

## నిజాలు తెలియాలి

**మాజీ ముఖ్యమంత్రి** జగన్మోహన్ రెడ్డి మీదగతంలో కోడికత్తి, గులకరాయితో హత్యాప్రయత్నాలు జరిగినట్లుగా కేసులు నమోదు అయ్యాయి. అయితే ఆ కేసుల్లో ఎటువంటి పురోగతి లేకపోగా అమాయకులను ఇరికించి వేధింపులకు గురి చేస్తున్నారన్న విమర్శలు వచ్చాయి. మరోవైపు కేవలం ప్రజల నుంచి సానుభూతి, తద్వారా రాజకీయ లబ్ధిపొందాలన్న దుష్ట ఆలోచనల పర్యవసానమే ఈ కట్టుకథలుగా ప్రజలు భావిస్తున్నారు. అలాగే పోలీసులు కూడా రాజకీయ ఒత్తిళ్లతో వాస్తవాలను వెలికి తీయలేని పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి చేత న్యాయ విచారణ జరిపించి వాస్తవాలు రాబట్టాలి.

-ఆర్కే, ముస్తాబాద, కృష్ణాజిల్లా

## ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పించాలి

**పాఠశాలలు** పునర్ ప్రారంభం కావడంతో పిల్లలు బడి బాటపట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు వసతులు ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా ఆడపిల్లలు గ్రామీణ పాఠశాలలో టాయిలెట్స్ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణ ప్రాంతాలలో పరిమితంగాఉండటంతో క్యూలైన్లో నిల్చుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో లైట్స్, తాగునీరు, బెంచీలు, ఫ్యాన్‌లు వంటి మౌలిక సదుపాయాలను కల్పించి, స్కూల్ ఆవరణపు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్‌జిల్లా

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలర e-mail: editpage@vaartha.com

# అభివృద్ధిసరే.. మరి పేదరికం, నిరుద్యోగం మాటేమిటి?



మేకిరి దామోదర్

మన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్నివర్గాల ప్రజలు సామాజిక, ఆర్థిక, రాజకీయరంగాల్లో సమాన స్థాయిలో అభివృద్ధి సాధించబడాలి. అలా కాకపోతే అది ప్రజాస్వామ్యం అనబడదు. అలా వ్యక్తి సంక్షేమమే ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మని భావిస్తారు. పాలకుల పాలనా విధానాలు, ప్రణాళికలు క్షేత్రస్థాయిలో వాటి అమలుపై ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉంటేనే అభివృద్ధి, స్వేచ్ఛ, సమానతలు కాపాడబడతాయి. రాజకీయ నాయకుల తప్పుడు విధానాల ఫలితంగా అభంశుభం తెలియని లక్షల, కోట్లమంది ఆ ఫలితాన్ని అనుభవించాల్సి వస్తుంది. మొన్నటి ఎన్నికల ఫలితాల్లో పాఠాలు, గుణపాఠాలు పాలక, ప్రతిపక్షాలకు కోకొల్లలు ఉన్నాయి. అభివృద్ధి అంటే? ప్రజల ఖాతాల్లో డబ్బులు వేయడంకాదు. పాలన అంటే అప్పులు చేసి ప్రజలకు అంటగట్టడం, పంచిపెట్టడం పేరుతో పాలకులు వెనకేసుకోవడం అంతకన్నా కాదు. పవర్ అంటే అహంకారం కానేకాదు. బాధ్యతతో కూడిన సేవ అనేది విస్మరించరాదు. ప్రజాస్వామ్యంలో వ్యక్తిపూజ, నిరంకుశత్వ అవకాశవాద ఓటు బ్యాంకు రాజకీయాలకు కాలం చెల్లిందనే రీతిలో ఓటు కర్రతో కాల్చివాతపెట్టారు. ప్రజల ముందు ఈవిద్వేష రాజకీయ వేషాలు నడవవు. నేడు ప్రతిపక్షాల బాధ్యత పెరిగింది. ఇకనైనా నూతనప్రభుత్వానికి కనువిప్పు కావాలి. నేడు కొలువుదీరిన ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికలప్రచారంలో ఇచ్చిన హామీలను తు.చ తప్పకుండా అభివృద్ధి అజెండాకు ప్రాధాన్యమిస్తేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. భారతప్రజాస్వామ్యం ఇంకెంత మాత్రం ఏకపక్షం కాకూడదని బలంగా కోరుకున్న ఓటర్ల విజ్ఞతకు తాజా ఫలితాలు అద్దంపడుతున్నాయి. నేడు ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం సంకీర్ణధర్మాన్ని పాటిస్తూ ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరించాలి. ప్రజల ఆకాంక్షలకి పట్టంకడుతూ, నెరవేర్చే దిశగా ముందుకు సాగాలి. అంతే కాదు సమాఖ్యస్ఫూర్తికి పెద్దపీట వేస్తూ రాష్ట్రాలను కలుపుకొని వెళితేనే మనుగడ సాగిస్తామనేది కాదనలేని వాస్తవం. సంకీర్ణ రాజనీతి ప్రదర్శిస్తేనే దేశానికి క్షేమదాయకం అవుతుంది. మన భారతదేశం వేగంగా అభివృద్ధిచెందుతున్న అతిపెద్ద ఆర్థికవ్యవస్థల్లో ఉంది అంటున్నాం. అభివృద్ధి రేటు ఏడు శాతం అంటున్నాం. వృద్ధి అంతవేగంగా ఉంటే? నిరుద్యోగం ఎందుకు ఉందన్నది ఓ చిక్కుముడి. కారణం పాలకుల్లో చిత్తశుద్ధి లేకపోవడం. ముఖ్యంగా ఉద్యోగ అవకాశాలు కల్పించే అభివృద్ధి తక్షణం అవసరం. దానిపై ప్రభుత్వాలు నేడు దృష్టిసారించాల్సి ఉంది. రాజకీయంగా నిలదొక్కుకోవడానికో, భవిష్యత్తులో మళ్లీ అధికారం చేపట్టడానికోఓటు బ్యాంకు రాజకీయాలకో నగదు బదలీ పథకాలు అమలు చేస్తున్నారు. దీనిమూలంగా అతి ప్రధానమైన ప్రజల ఆరోగ్యం, విద్య, వైద్యం మీద దృష్టి పెట్టాల్సినంత శ్రద్ధ,



నిధులు ఖర్చు చేయడం లేదు. వాటిపైన దృష్టి కూడా పాలకులకు లేనేలేదు. పేద ప్రజల పేదరిక స్వభావాన్ని దృష్టిలో పెట్టుకొని స్వల్పకాలిక, దీర్ఘకాలిక విధానాలతో ప్రాధాన్యాన్ని గుర్తించి వ్యవహరించాల్సి ఉంది. కానీ ఈరోజు గడిచిపోతే చాలు అనుకునేవిధంగా వ్యవహరిస్తే ఎలా? మరి విద్య, వైద్యం, ఆరోగ్యం ఎప్పటికీ ఆ వర్గాల వారికి తగినంతగా అందలేవు. స్వాతంత్య్రం వచ్చి 75ఏళ్ల అమృతోత్సవాలు జరుపుకున్నప్పటికీ టెక్నాలజీ బాగా పెరిగినా, దేశ సంపద మాత్రం కొద్దిమంది వద్ద కేంద్రీకృతం అవ్వడంతో అభివృద్ధిలో అసమానతలు, నిరుద్యోగం, పేదరికం మాత్రం ఇప్పటికీ అలానే ఉన్నాయి. దీనికితోడు రాజకీయ పార్టీల్లో, అధికారుల్లో అంకితభావం నిజాయితీతగ్గి స్వార్థం పెరిగిపోయి ప్రజాప్రయోజనాలు విస్మరిస్తున్నారు. ప్రపంచంలోనే యువ జనాభా ఎక్కువ గల మనదేశంలో ముఖ్యంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే అభివృద్ధే మనకు అవసరం. దానిపై దృష్టిని సారించాలి. అప్పుడే అభివృద్ధి జరుగుతుంది. జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. పెరుగుతున్న అసమానతలు తగ్గించాలి. క్షేత్రస్థాయిలో ఆదాయ వనరులను ఎలా పెంచాలి? లబ్ధిదారులకు ఎలా అందించాలనేది నేటి పాలకులు గమనించి పాటించాల్సి ఉంది. ఈ సమస్య మూలాలను గుర్తించి పరిష్కరించాల్సిఉంది. అమెరికా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశం అని చెప్పుకునే ముందు ఆ పాలకుల, సమాజం వినూత్న విధానాలను, ఫలితాలను అధ్యయనం చేసి, విద్య, వైద్యంలో పరిశోధనలు, ఉన్నత చదువులపై ప్రత్యేక దృష్టితో ఉద్యోగ అవకాశాలు పెంపొందించాలి. మనదేశ రాజ్యాంగంలో పొందుపరుచుకున్న విధంగా మనది రాష్ట్రాల సమాహారం. ఆ సమాఖ్య స్ఫూర్తిని కాపాడాలి. మనదేశంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య భిన్న అభిప్రాయాలు ద్వంద్వ విధానాలు కనిపిస్తున్నాయి. పన్నుల వాటా బదిలీ అయినా, పెట్టుబడులపైనా నిష్పాక్షికంగా వ్యవహరిస్తే దేశానికి మంచిది. దేశమంతా ముందుకు వెళ్తుంటే ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం తాము అభివృద్ధి చెందాలని ఆదుర్ద కూడా అర్థం చేసుకోవడం లేదు. రాష్ట్రాలు అభివృద్ధిలో పోటీపడితే దేశానికి కూడా మంచిదే కదా! కేంద్రం గుత్తాధిపత్యంతో, ఏకఛత్రాధిపత్యంతో వ్యవహరించరాదు. అలా వ్యవహరిస్తూ స్వయం ప్రతిపత్తి గలవ్యవస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తుందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. రాష్ట్రానికోతీరు, ప్రాంతానికో తీరు, కేంద్రప్రభుత్వం పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ ప్రాధాన్యత ఎక్కువ నిధులు, ఎక్కువ సౌకర్యాలు కల్పిస్తున్నారు. పెట్టుబడులు, మౌలిక వసతులు అక్కడికే వెళుతున్నాయి. ప్రైవేట్ పెట్టుబడులు కూడా అక్కడికే పంపిస్తున్నారనే అభిప్రాయం నుంచి నేటి సంకీర్ణ ప్రభుత్వం బయట పడాలి. రాష్ట్రాల అభివృద్ధి దేశానికి మంచిదనే భావనకు రావాలి. సంకీర్ణ ధర్మాన్ని విస్మరించరాదు. రాజకీయ పార్టీలైనా అధికార, ప్రతిపక్షాలైనా వాటి అంతిమ లక్ష్యం ప్రజాప్రయోజనాలే అనే అంశాన్ని విస్మరించరాదు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన, విద్య, వైద్యరంగాల పరిపుష్టికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలి. విద్వేషం, కుల, మత, ప్రాంత, లింగ వివక్ష, విభేదాలు లేని విధంగా సమ్మిళిత అభివృద్ధికి పాటుపడుతూ పౌర స్వేచ్ఛను పరిరక్షించాలి. ఈ తీర్పునుండి పాలక ప్రతిపక్షాలను అధికారానికి బెత్తెడు దూరంలో ఉంచిన ప్రజల చైతన్యం గుణపాఠం నేర్పుతుంది. పాలకులంటే ప్రభువులు కాదు. పాలితులు ఐదేళ్ల ప్రజల ఆకాంక్ష మేరకు పాలన సాగించాలి. •

# అమెరికాను మించిన అణువేగం చైనా సొంతం



**వాషింగ్టన్, జూన్ 17:** అణువిద్యుత్ అభివృద్ధిలో చైనా మెరుపు వేగంతో దూసుకుపోతోందని అమెరికాకు చెందిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సంస్థ సోమవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. చైనా వేగానికి అమెరికా కనీసం 15 యేళ్లు వెనకబడిపోయిందని వెల్లడించింది. ప్రస్తుతం చైనా వద్ద 27 అణు విద్యుత్తు రియాక్టర్ల నిర్మాణం వివిధ దశల్లో ఉందని పేర్కొంది. ఒక్కో దానిని పూర్తి చేయడానికి బీజింగ్‌కు సగటున ఏడేళ్ల సమయం పడుతోందని తెలిపింది. ఫలితంగా చైనా ఆర్థిక వ్యవస్థ, ఈ రంగంలో సృజనాత్మక శక్తి పెరుగుదలకు ఇవి చాలా ఉపయోగపడతాయి.

చైనాలోని ప్రభుత్వరంగ ఫైనాన్సింగ్ సంస్థలు కూడా అణువిద్యుత్తు రంగానికి కేవలం 1.4 శాతం వడ్డీకే రుణాలు ఇస్తున్నాయి. పశ్చిమదేశాలు ఇచ్చే అప్పులతో పోలిస్తే ఇవి చాలా చౌక. దీనికితోడు వివిధ ప్రభుత్వ సంస్థలు కూడా వీటికి అండగా నిలుస్తున్నాయి. దీంతో స్థానికంగా అణువిద్యుత్తు రంగంలో ఇప్పుడు డ్రాగన్ ప్రబల శక్తిగా ఎదిగింది. ఇప్పటికే బీజింగ్ పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ కార్ల విషయంలో అగ్రగామిగా నిలిచినట్టే. అణు విద్యుత్‌లో కూడా వేగంగా దూసుకెళుతోంది. షిడో బేలో నిర్మించిన నాలుగో తరానికి చెందిన హైటెంపరేచర్ గ్యాస్ కూల్డ్ రియాక్టర్ గతేడాది ఆన్‌లైన్‌లోకి వచ్చింది. దీనిపై ది చైనా న్యూక్లియర్ ఎనర్జీ అసోసియేషన్ స్పందిస్తూ.. వీటిల్లో వినియోగించే 2,200 పరికరాలను పూర్తిగా దేశీయంగానే అభివృద్ధి చేసినట్లు పేర్కొంది.

ప్రస్తుతం అమెరికా వద్దే అత్యధికంగా అణు రియాక్టర్లు ఉన్నాయి. కానీ, జోబైడెన్ సర్కారు పర్యావరణ మార్పులను ఎదుర్కొనేందుకు వీలుగా ఉద్గారాలు, శుద్ధ ఇంధనంపై దృష్టి పెట్టింది. అమెరికాలోని జార్జియా రాష్ట్రంలో 2023-24 సంవత్సరాల్లో రెండు భారీ న్యూక్లియర్ ప్లాంట్లు ఆన్‌లైన్ అయ్యాయి. కానీ, వీటి నిర్మాణ సమయం, ఖర్చు అనుకున్న దానికంటే ఎక్కువగా ఉన్నాయి. దీంతోపాటు అమెరికా ఇంకా కొత్తగా అత్యాధునిక అణు రియాక్టర్ల నిర్మాణాలు చేపట్టలేదు. ఓ యూనివర్సిటీలో నిర్మించాలనుకొన్న ల్యాబ్ ప్రాజెక్టును మూసేసింది. కాకపోతే అమెరికా ఈ రంగంపై పూర్తిస్థాయిలో దృష్టిపెడితే మాత్రం వేగంగానే చైనా కంటే ఎక్కువ అభివృద్ధి సాధించగలదని ఈ నివేదిక రాసిన స్టీఫెన్ ఎజెల్ వెల్లడించారు. మరోవైపు ఈ నివేదికపై అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎనర్జీ ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు.

# ఫిలిప్పీన్స్ నౌకను ఢీకొన్న చైనా కోస్ట్‌గార్డ్ ఓడ




**మనీల, జూన్ 17:** చైనా కోస్టు గార్డ్ చట్టంలోని ఓ వివాదాస్పద నిబంధన అమల్లోకి వచ్చిన రెండ్రోజుల్లోనే దక్షిణ చైనా సముద్రంలో ఉద్రిక్తలు భగ్గుమన్నాయి. దక్షిణ చైనా సముద్రంలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. చైనాకు చెందిన కోస్ట్‌గార్డ్ నౌక ఫిలిప్పీన్స్‌కు చెందిన ఓ సరకు రవాణా ఓడను ఢీకొంది. సోమవారం ఉదయం స్ప్రార్టీ ద్వీపాల వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. దీనికి బాధ్యత ఫిలిప్పీన్స్ నౌకదే అంటూ బీజింగ్ ఆరోపించింది. 'ఫిలిప్పీన్స్ సరకు రవాణా నౌకను ఎన్నిసార్లు హెచ్చరించినా వినలేదు. అది మా ఓడ వైపు దూసుకొచ్చి ఢీకొంది. దీంతో చట్టప్రకారం మా నౌక దానిపై నియంత్రణ సాధించింది. ఫిలిప్పీన్స్ ఓడ మా రెన్ రీఫ్ వైపు అక్రమంగా వెళుతోంది' అని ఆరోపించింది. మరోవైపు ఫిలిప్పీన్స్ మాత్రం ఈ వ్యవహారంలో చైనా నావికుల అమానవీయంగా ప్రవర్తించారని ఆరోపించింది. ఇక దేశాధ్యక్షుడు ఎఫ్. మార్కోస్ మాట్లాడుతూ చైనా అమల్లోకి తెచ్చిన సరికొత్త కోస్టుగార్డ్ చట్టం భయం కరమైందని అభివర్ణించారు. ఇవి పొరుగుదేశాలకు ఆందోళన కలిగిస్తున్నారు. సెకండ్ థామస్ షోల్ వద్ద ఉన్న తమ గస్తీ బృందానికి ఫిలిప్పీన్స్ నౌక నిత్యావసరాలు సరఫరా చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకొంది.ఓ వైపు దక్షిణ చైనా సముద్రంపై పొరుగుదేశాలతో వివాదాలు నడుస్తున్న సమయంలో చైనా కోస్టుగార్డు చట్టంలో సరికొత్త నిబంధనను అమల్లోకి తెచ్చింది. దీనిప్రకారం తన జల సరిహద్దులను అతిక్రమించిన విదేశీలను బీజింగ్ బలగాలు 30నుంచి 60రోజుల పాటు నిర్బధించే అవకాశాన్ని కల్పించింది. ఈ నేపథ్యంలో దక్షిణ, తూర్పు చైనా సముద్రాలు తనవేనని బీజింగ్ వాదిస్తోంది.

ఇప్పుడు వాటిల్లోకి వచ్చే సమీప దేశాల సిబ్బందిని బంధించేందుకుచైనా కోస్టుగార్డ్‌కు స్వేచ్ఛనిచ్చినట్లైయింది. తాజాగా ఈ చట్టం అమల్లోకి రాగానే ఫిలిప్పీన్స్ నౌకను ఢీ కొట్టడం గమనార్హం. ఇప్పటికే ఈ సముద్రంలో గస్తీ కాస్తున్న చైనా నౌలు తరచూ ఇతర ఓడలపై జలఫిరంగలును ప్రయోగించడం వంటి ఘటనలకు పాల్పడుతున్నాయి. పలుమార్లు ఫిలిప్పీన్స్ షిప్‌లు వీటికి బాధితులుగా మిగిలాయి.

# సిఐడి ముందు హాజరైన యెడియూరప్ప

## బాలికలపై లైంగిక వేధింపుల ఆరోపణలు



ఆయన సీఐడీ ఎదుట హాజరయ్యారు.

**బెంగళూరు, జూన్ 17:** ఫోక్సో కేసు విచారణ నిమిత్తం కర్ణాటక మాజీ సీఎం యడియూరప్ప సోమవారం సీఐడీ అధికారుల ఎదుట హాజరయ్యారు.మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత బీఎస్ యడియూరప్ప ఓ బాలిక లైంగిక వేదింపులకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలు తీవ్ర కలకం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కేసు విచారణకు హాజరయ్యే సమయంలో ముందుస్తు నోటీసు లేకుండా ఆయనను అదుపులోకి తీసుకోవద్దని స్పష్టం చేసింది.అదే సమయంలో విచారణకు గైర్హాజరు కాకూడదని యడియూరప్పకు నోటీసులిచ్చింది. ఈ క్రమంలోనే నేడు ఆయన సీఐడీ ఎదుట హాజరయ్యారు.

17 ఏళ్ల బాలికపై యడియూర్ప లైంగిక దాడికి పాల్పడినట్లు లోక్‌సభ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఆరోపణ వచ్చిన సంగతి తెలిసిందే. మోసం కేసులో సాయం చేయాలంటూ బాధితురాలు,ఆమె తల్లి ఫిబ్రవరి 2న యడియూరప్పను కలిశారు. ఈ సమయంలో తన కుమార్తెను బీజేపీ నేత బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి బలవంతగా లైంగికదాడికి పాల్పడ్డారంటూ బాధితురాలి తల్లి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనపై పోక్సో కేసు నమోదైంది. ఈ కేసుపై సీఐడీ దర్యాప్తు చేపట్టింది. ఆరోపణలు చేసిన బాధితురాలి తల్లి ఇటీవల ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో ప్రాణాలు కోల్పోయారు. అయితే అంతకంటే ముందే బాధితురాలి తల్లివాంగ్మూలాలను సీఐడీ రికార్డు చేసినట్లు అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసిన తర్వాత యడియూర్ప వాయస్ శాంపిళ్లనుకూడా అధికారులు సేకరించగా..కాగా ఈ ఆరోపణలను మాజీ సీఎం ఖండించారు. దీనిపై న్యాయపోరాటం చేస్తానని తెలిపారు.



## కన్హాన్ వంతెనపై ఆటో, బస్సు ఢీ ఇద్దరు జవాన్ల మృతి

**ముంబై, జూన్ 17:** మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆటో, బస్సు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు జవానులు మృతి చెందారు. ఆర్మీకి చెందిన ఆరుగురితోపాటు మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఆటోనుజ్జునుజ్జయింది. నాగ్‌పూర్‌లోని కన్హాన్ వంతెనపై ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో గాయపడిన ఆరుగురు సైనికులతో పాటు ఆటో డ్రైవర్‌కు చికిత్స కొనసాగుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రమాదం సమయంలో ఆటోలో డ్రైవర్ సహా తొమ్మిది మంది ఉన్నారు. ఈ సైనిక సిబ్బంది కమతిలోని గార్డ్ రెజిమెంట్ సెంటర్‌కు చెందిన వారు. ఈ ప్రమాదంపై న్యూ కమతి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్.. నలుగురు మావోయిస్టుల మృతి

**రాంచి, జూన్17:** జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. సోమవారం ఉదయం సింగ్‌భూమ్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. టోంటో, గోయిల్‌కేరా ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలను టార్గెట్ చేస్తూ పోలీసులు చేపట్టిన ఆపరేషన్‌లో నలుగురు మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీసు ఉన్నతాధికారి అమోల్ వి హోమ్‌కర్ తెలిపారు. అందులో ఒక మహిళా మావోయిస్టు ఉంది. మరో ఇద్దరు మావోయిస్టులను అరెస్ట్ చేశారు. ఘటనా స్థలం నుంచి రైఫిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు.ఇక రెండు రోజుల క్రితం చత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 8 మంది మావోయిస్టులు ఒక స్పెషల్ టాస్క్‌ఫోర్స్ జవాల్ మృతి చెందారు.



## అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం..ఇద్దరు మృతి

**వాషింగ్టన్, జూన్ 17:**అమెరికాలో బానిసత్వం ముగింపును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వేడుకలో వివాదం చెలరేగింది. ఈ క్రమంలో ఓ ఆగంతుకుడు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మరణించగా మరో 14 మంది గాయాల పాలయ్యారు. టెక్సాక్‌లో ఓల్డ్ సెటిలర్స్ పార్ట్ లో ఏర్పాటు చేసిన వేడుకలో ఈ ఘటన వెలుగు చూసింది. రెండు గ్రూపుల మధ్య గొడవలో ఓ అగంతుకుడు తుపాకీతో కాల్పులకు తెగబడ్డాడని పోలీసులు తెలిపారు. గాయపడ్డవారిని ఆసుపత్రికి తరలిస్తుండగా ఇద్దరు మరణించారని పేర్కొన్నారు. గాయపడ్డ వారికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. మృతులు ఇదనదరు గొడవపడ్డ విషయాన్ని పేర్కొన్నారు. కాల్పులకు తెగబడ్డ వ్యక్తి నల్లజాతీయుడని పేర్కొన్నారు. నిందితుడి వివరాలు తెలిపిన వారికి 5వేల రివార్డును కూడా ప్రకటించారు. బానిసత్వం ముగింపును ప్రతిఏటా జూన్ టీన్త్ పేరిట అమెరికాలో వేడుక నిర్వహిస్తారు.

# స్టేజిపై స్తంభించిన బైడెన్..

## సాయం చేసి పక్కకు తీసుకు వెళ్లిన ఒబామా.. ఎన్నికల వేళ ఆసక్తికరంగా అధ్యక్షుడి ప్రవర్తన



**వాషింగ్టన్, జూన్ 17:**అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రవర్తన ఆసక్తికరంగా మారింది. గత కొంత కాలంగా మతిమరుపు, తడబాట్లతో హెడ్ లైన్స్‌లోకెక్కిన యూఎస్ అధ్యక్షుడు, ఇప్పుడు తన విచిత్ర ప్రవర్తనతో మరోసారి వార్తల్లో నిలిచారు. తాజాగా ఓ స్టేజ్‌పై విగ్రహంలా నిల్చుండిపోయారు. ఇది గమనించిన మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా బైడెన్ చెయ్యి పట్టుకుని అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు. లాస్‌ఏంజెల్స్‌లో జరిగిన ఫండ్ రైజింగ్ క్యాంపెయిన్‌లో ఈ ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. పీకాక్ థియేటర్‌లో అర్ధరాత్రి జిమ్మి కిమ్మెల్‌తో 45 నిమిషాల పాటు సరదాగా ఇంటర్వ్యూ జరిగింది. అనంతరం స్టేజ్‌పై ఉన్న బైడెన్, ఒబామా అక్కడున్న వారికి అభివాదం చేస్తూ కనిపించారు. ఆ సమయంలో బైడెన్ దాదాపు 10 సెకన్లపాటు నిశ్చలంగా నిల్చుండిపోయారు. ఆయనలో ఎలాంటి చలనం లేకపోవడాన్ని గమనించిన బరాక్ ఒబామా బైడెన్ చెయ్యి పట్టుకుని అక్కడి నుంచి నడిపించుకుని తీసుకెళ్లిపోయారు. ఈ దృశ్యాలు అక్కడున్న కెమెరాకు చిక్కాయి. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల వేళ బైడెన్ ప్రవర్తన ఆసక్తికరంగా మారింది. కాగా, ఇటీవలె బైడెన్ ప్రవర్తనకు సంబంధించిన అనేక వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలి సిందే. గత వారం ఇటలీలో జరిగిన జీ7 సమావేశాల్లో పాల్గొనేందుకు వెళ్లిన బైడెన్ అక్కడ గమ్మత్తుగా ప్రవర్తించారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీని ఓ స్టేజ్‌పై కలిసేందుకు వెళ్లిన ఆయన ఆ నేతను హగ్ చేసుకున్న తర్వాత చేతిని ఎత్తి సెల్యూట్ చేశారు. ఆ తర్వాత నెమ్మదిగా స్టేజ్ మీద నుంచి వెళ్లిపోయారు. కన్ఫ్యూజన్‌లో ఉన్న బైడెన్ ఇటలీ ప్రధానికి సెల్యూట్ ఎందుకు చేశారో అర్థం కాకుండా ఉంది. ఇక మరోవీడియోలో బైడెన్ ఎంత గందరగోళానికి గురవుతున్నారో స్పష్టమైంది. జీ7 సమావేశాలకు హాజరైన నేతలు అంతా ఒక దగ్గర ఉండగా, ఆ గుంపు నుంచి బైడెన్ ఒక్కడే మరో వైపు వెళ్లిపోయారు. కొన్ని ఫీట్ల దూరం వెళ్లిన తర్వాత ఆయన ఎవరూ లేని దిశకు థమ్స్ అప్ చూపించారు. మనుషులు లేని దిక్కుకు వెళ్లి బైడెన్ ఎందుకు అలా చేశారో ఎవరికీ తెలియడం లేదు. కానీ ఆ సమయంలో ఇటలీ ప్రధాని మెలానీ త్వరగా తేరుకుని బైడెన్ వద్దకు వెళ్లి ఆయన్ను గ్రూప్ నేతలకు దగ్గరకు తీసుకువచ్చారు. ఆ తర్వాత ఆ గ్రూప్ ఫొటోలకు ఫోజు ఇచ్చారు. జో బైడెన్ ఆరోగ్యంపై రకరకాల విమర్శలు వస్తున్నాయి. ఇటీవల శ్వేతసౌధంలో మ్యూజికల్ పర్ఫార్మెన్స్ జరుగుతున్న సమయంలో బైడెన్ ఎటూ కదలకుండా చలనం లేని రీతిలో నిలుచుండిపోయారు. దీన్ని రిపబ్లికన్లు తప్పుపట్టారు. ఆ సమయంలో ఆయన పక్కనే ఉన్న ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, ఆమె భర్త డ్యాన్స్ చేస్తూ కనిపించారు. బైడెన్ మాత్రం తదేకంగా చూస్తూ ఉండిపోయారు. అధ్యక్షుడి నడక కూడా కాస్త మారినట్లుగా వీడియోల్లో స్పష్టమవుతోంది. దీంతో ఆయన ఆరోగ్యంపై రకరకాలుగా ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. వయసు సంబంధిత సమస్యలతో బైడెన్ బాధపడుతున్నట్లుగా కూడా తెలుస్తోంది. వయసురీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల బైడెన్‌లో జ్ఞాపకశక్తి లోపాలను గుర్తించినట్లు గతంలో ఓ నివేదిక విడుదలైన విషయం తెలిసిందే. అధ్యక్షుడి జ్ఞాపకశక్తి చాలా మసకగా మబ్బుగా ఉందని నివేదిక పేర్కొంది. జీవితంలో కీలక సంఘటలను కూడా ఆయన గుర్తుకు తెచ్చుకోలేకపోయారని తెలిపింది. కుమారుడు బ్యూబైడెన్ ఎప్పుడు చనిపోయారనే విషయం కూడా అధ్యక్షుడికి గుర్తుకు రాలేదని పేర్కొంది. అయితే ఈ నివేదికను అధ్యక్షుడు తీవ్రంగా ఖండించారు.

# గాలిలో దీపంలా రైలు ప్రయాణాలు

## నిన్నటి వరకు మానవ తప్పిదాలు, నేడు సిగ్నలింగ్ వైఫల్యం

## గత జూన్‌లో ఒడిశాలో ఘోర ప్రమాదం

## తాజాగా డార్జిలింగ్‌లో అదే తరహా రైలు ప్రమాదం



**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో సోమవారం నాడు జరిగిన రైలు దుర్ఘటన రైల్వేలో భద్రతను మరోసారి ప్రశ్నార్థకం చే సింది. గత ఏడాది ఇదే జూన్ నెలలో ఒడిషాలోని బలాసోర్ జిల్లా బహనాగ్ వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో 400 మందికి పైగా ప్రయాణీకులు మృత్యువాత పడిన ఘటన ఇంకా మరువక ముందే నేడు తూర్పు రైల్వే పరిధిలో కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్ రైలును వెనుక నుంచి వచ్చిన గూడ్స్ రైలు ఢీకొన్న ఘటనలో 15 మంది మరణించగా వంద మంది వరకు గాయపడడం గమనార్హం. రెండు ఘటనలకు రైల్వేలో వున్న ఆటోమెటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ విఫలం కావడం కారణమని విచారణాధికారులు చెబుతున్నారు. బహనాగ దుర్ఘటనతో పోలిస్తే డార్జిలింగ్ ప్రమాదం తీవ్రత తక్కువే అయినా ఘటనా స్థలంలో రైలు బోగీలు గాలిలో వేలాడుతున్న తీరుమాత్ర ం భిన్నంగా వుంది.

రైలు ప్రయాణం గాలిలో దీపంలా మారిందని బహనాగ్ దుర్ఘటన మరోసారి తేల్చింది. ఇటీవల కాలంలో రైల్వే శాఖలో భద్రతకు పెద్దపీట వేయడంతో పాటు అనేక చర్యలు చేబట్టిన తరువాత ప్రమాదాల సంఖ్య తగ్గిందని గణాంకాలు చెబుతున్నా అనేక సందర్భాలలో మానవ తప్పిదాల వల్ల దుర్ఘటనలు జరగడం తెలిసిందే. ఐదేళ్ల క్రితం కాచిగూడ స్టేషన్‌లో ఎంఎంటిఎస్ రైలు ఎదురుగా వస్తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును ఢీకొనడం, అంతకు ముందు తెలుగు రాష్ట్రాల్లో జరిగిన పలు ప్రమాదా లు ఇదేరీతిన జరగడం గమనార్హం. రైల్వేలో ప్రమాదాలు తగ్గినట్లు అధికారులు అధికారులు చెబుతున్నా గత ఏడాది ఒడిషాలోని బహనాగలో జరిగిన దుర్ఘటన రైల్వేలో భద్రత అంతా డొల్లగా వుందని తేటతెల్లం చేసింది. బహనాగ్ దుర్ఘటనకు సిగ్నలింగ్ వ్యవస్థలో లోపం వుందని తేలగా ఇదే సమయంలో ఇక్కడి సిబ్బంది నిర్లక్ష్యం కూ డా వుందని తేలడం గమనార్హం. అప్పటి ఘటనలో 400 మందికి పైగా ప్రయాణీకులు మరణించగా వెయ్యి మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో అనేక మందిని ఇ ప్పటికీ గుర్తించలేక పోవడం పెద్ద వెలితిగా చెప్పాలి. బహనాగ దుర్ఘటన తరువాత కూడా దేశ వ్యాప్తంగా అనేక రైలు ప్రమాదాలు జరిగాయి. తెలుగు రాష్ట్రాలోనూ కొ న్ని వెలుగు చూశాయి. ఈ ఘటనల్లో పదుల సంఖ్యలో ప్రయాణీకులు మరణించగా వందల సంఖ్యలో గాయపడ్డారు. వీటికి సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలు కారణంగా చెబుతున్నారు. రైల్వేలో ఇటీవల కాలంలో సిగ్నలింగ్ వ్యవస్థ అంతా ఆటోమేటిక్‌గా మారింది. గతంలో మాన్యువల్‌గా వున్నదానిని ఆటోమేటిక్‌గా మార్చి సమయ పాలనను పెంచారు. అంతవరకు బాగానే వున్నా ఆటోమేటిక్‌గా మారిన సిగ్నలింగ్ వ్యవస్థను నిపుణులైన వారు నిత్యం పర్యవేక్షించాల్సిన అవసరం వుండగా చాలాచోట్ల కాంట్రాక్ట్ పద్దతిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకుంటున్నారని విమర్శలు వున్నాయి. ఈ విషయమై ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు. లక్ష ల సంఖ్యలో ప్రయాణీకుల ప్రాణాలతో కూడిన విషయంలో రైల్వే శాఖ నాణ్యమైన నిపుణులకు బదులు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించడం సరైంది కాదని వారంటున్నారు. రైల్వేలో పదవీ విరమణ చేసిన నిపుణుల స్థానంలో కొత్తవారిని నియమించుకునే బదులు కాంట్రాక్ట్ పద్దతిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమిం చడం కొంతకాలంగా కొనసాగుతుండడం కూడా ప్రమాదాలు పెరిగేందుకు ఆస్కారం కలిగిస్తోందని ఉద్యోగ సంఘాలు విమర్శించసాగాయి. రైల్వేలో సిగ్నలింగ్ వ్యవస్థ ఆటోమేటిక్‌గా మార్చడం మంచిదే అయినా ఇదే సమయంలో ఈ వ్యవస్థ నిపుణులైన అధికారుల పర్యవేక్షణలో నిరంతరం వుండాల్సిన అవసరం కూడా వుందని ఉద్యోగ సంఘాల నేతలం టున్నారు. సిగ్నలింగ్ వ్యవస్థ అంటే రైళ్లు ముందుకు వెళ్లేందుకు, ఆగేందుకు మాత్రమే కాదని, రైళ్లన్నీ సవ్యంగా రాకపోకలు సాగించేందుకు అనే విషయాన్ని అధికారులు మరచిపోకూడదని వారు చెబుతున్నారు. సిగ్నలింగ్ వ్యవస్థను నిపుణులైన వారు పర్యవేక్షించుకుంటే ఏం జరుగుతుందో? బహనాగ్ దుర్ఘటన తేటతెల్లం చేసిందని, దీని తరువాత కూడా అధికారులు కళ్లు తెరవక పోవడంతో ఎపిలో ఒకటి, తాజాగా డార్జిలింగ్‌లో ఇంకో ప్రమాదం జరిగిందని వారంటున్నారు. సిగ్నలింగ్ వ్యవస్థ ఆటోమేటిక్‌గా మారిపోయిన తరువాత అనేకచోట్ల లోపాలు తలెత్తినా దీనిపై ఎవరూ నోరుమెదడం లేదని వారంటున్నారు.

### వానాకాలం ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ఇదిలావుండగా రైల్వే శాఖకు వానా కాలం గడ్డు కాలంగా చెప్పాలి. ఈ సమయంలో వానల వల్ల కాలువలు, చెరువులుపొంగి రైలు పట్టాల మీదుగా వరదనీరు ప్రవహించి అనేకచోట్ల పట్టాల కింద మట్టి, కంకర కొట్టుకుపోవడం జరుగుతుంటుంది. ఇటువంటి సమయంలో అప్రమత్తంగా వుండాల్సిన అవసరం వుంటుంది. 2003లో ఉమ్మడి నల్లగొండజిల్లా వలిగొండ వద్ద డెల్టా ప్యాసింజర్ రైలు వరదల కారణంగా పట్టాలు తప్పడంతో వంద మందికిపైగా ప్రయాణీకులు మరణించారు. ఈ నేపథ్యంలో డార్జిలింగ్ దుర్ఘటన తరువాత రాబోయే వానాకాలంలో ప్రమాదాల నివారణకు రైల్వేశాఖ ఎటువంటి చర్యలు తీసుకుంటుందో? చూడాల్సి ఉంది.

# డ్రగ్స్ సేవించిన ఇద్దరి అరెస్టు

## పునరావాసంతో కోలుకున్న డ్రగ్స్ బానిసగా మారిన మహిళ

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్న తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో (టిఎస్ నాబ్) జంట నగరాలతో పాటు శివార్లలో వరుసగా పబ్‌లకు వె ళుతున్న వారిపై నిఘా వుంచి అందులో 16 మంది అనుమానితులకు అదుపులోకి తీసుకుని వారికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి పాజిటివ్ రిపోర్టు వచ్చింది. వీరిలో ఒక యువకుడు పలు పబ్‌లలో డిజెగా వ్యవహరిస్తున్న సిద్దార్థ్ కాగా మరో యువకుడు అతని స్నేహితుడుగా తేలింది. జంట నగరాలలో పబ్‌లలో మాదకద్రవ్యాల వినియోగంపై కఠిన నిఘా వుండడం తెలిసిందే. ఈ విషయంలో ఆయా ప్రాంతాల పోలీసులతో పాటు టి.నాబ్ అధికారులు, సిటీ పో లీసు విభాగం పరిధిలోని నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగం సిబ్బంది తరచూ దాడులు నిర్వహిస్తుండడం విదితమే. ఈ క్రమంలో టిఎస్.నాబ్ అధికారులు తరచూ పబ్‌లకు వెళుతున్న 16 మంది యువతీ యువకులను అదుపులోకి తీసుకుని వారికి డ్రగ్స్ పరీక్ష నిర్వహించారు. ఇందులో ఇద్దరు రెగ్యులర్‌గా డ్రగ్స్ సేవిస్తున న్నట్లు తేలింది. వీరిలో డిజెగా వుంటున్న సిద్దార్థ్ ఎండిఎంఎ డ్రగ్స్‌ను చాలా కాలంగా తీసుకున్నట్లు తేలింది. ఇతని స్నేహితుడు కూడా ఎండిఎంఎ డ్రగ్స్ వాడుతున్నట్లు తేలింది. వీరిని మాదాపూర్ పోలీసులకు అప్పగించారు. కాగా మరో ఘటనలో ఇంతకు ముందు డ్రగ్స్‌కు బానిసగా మారిన ఓ మహిళ పోలీసుల కౌన్సిలింగ్ పునరావాసం కారణంగా పూర్తిగా కోలుకుంది. ఇదివరకు ఆమెకు పలు మార్లు పరీక్ష చేయగా పాజిటివ్‌గా వచ్చింది. వైద్యుల సమక్షంలో జరిగిన పునరావాసంతో ఆమె డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా వుండడంతో తాజాగా నిర్వహించిన పరీక్షలో నెగెటీవ్‌గా వచ్చింది. దీనిపై స్పందించిన టిఎస్ నాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా యువత మాదకద్ర వ్యాలకు దూరంగా వుండాలని కోరారు. మాదకద్రవ్యాలకు బానిసగా మారిన మహిళవైద్యుల పునరా వాసంతో పూర్తిగా కోలుకుని సాధారణ జీవితం గడుపుతుండడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

**పాఠశాలలు, కాలేజీలలో విద్యార్థుల బ్యాగులు తప్పనిసరిగా తనిఖీ చేయాలి...యాంటి డ్రగ్స్ కమిటీలు చురుకుగా వ్యవహరించాలి: టిఎస్ నాబ్ డైరక్టర్ సందీప్ శాండిల్యా ఆదేశం**




రాష్ట్రంలో వేసవి సెలవుల తరువాత విద్యా సంస్థలు తిరిగి ప్రారంభం అయినందున పాఠశాలలు, కాలేజిలకు వెళుతున్న విద్యార్థుల బ్యాగులను నిర్వాహకులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని టిఎస్ నాబ్ డైరక్టర్ సందీప్ శాండిల్యా ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి మొహమాటం వుండకూడదని ఆయన తెలిపారు. ఈ మేరకు సోమవారం నాడు ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేస్తూ పాఠశాలలు, కాలేజిలలో కొంతకాలంగా డ్రగ్స్ మహమ్మారి వెర్రితలలు వేస్తుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తురీత్యా ఇది ఎంతమాత్రం మంచిది కాదని ఆయన వెల్లడించారు. పాఠశాలలు, కాలేజిలను డ్రగ్స్ స్మగ్లర్లు టార్గెట్ చేయడంపై కఠినంగా వుండాలని ఆయన కోరారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ సరఫరాదారులను ఏరిపారేయాలని, ఇదే సమయంలో విద్యార్థులు వీటికి బానిసలుగా మారకుండా చూడాలని ఆయన కోరారు. చాలా మంది విద్యార్థులు డ్రగ్స్‌తో పాటు ఈ సిగరెట్లు, మద్యానికి బానిసలుగా మారారని, వారి బ్యాగులను తరచూ తనిఖీ చేయడం ద్వారా వి ద్యార్థులను వాటికి దూరం చేయవచ్చని, అవసరం అయితే పునరావాసం ఇవ్వాలని ఆయన కోరారు. ఇక విద్యా సంస్థల్లో యాంటి డ్రగ్స్ కమిటీలు మరింత చురుకుగా వ్యవహరించాలని సందీప్ శాండిల్యా కోరారు. విద్యా సంస్థల్లో మాదకద్రవ్యాలకట్టడి మరింత పక్కాగా వుండేందుకు నిర్వాహకులు విశ్రాంత పోలీసు అధికారులను ఇందుకోసం నియమించుకుని, వారి సేవలను వాడుకోవాలని ఆయన కోరారు. ఈ విషయంలో టిఎస్ నాబ్ ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందించేందుకు సిద్దంగా వుందని ఆయన తెలిపారు.

# జమ్ముకాశ్మీర్ ఎన్నికల బిజెపి ఇన్‌చార్జ్‌గా కిషన్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్17:** త్వరలో ఎన్నికలు జరగనున్న జమ్ముకశ్మీర్, హరియాణా,మహారాష్ట్ర,జార్కండ్‌లకు బిజెపి ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఇన్‌చార్జీలతో పాటు కో ఇన్‌చార్జీలను బిజెపి కేంద్ర ఎన్నికల కమిటీ నియమిచింది. దీనిలో భాగంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి జమ్ముకశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించింది. అలాగే హరియాణకు ఇన్‌చార్జ్‌గా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్,కో ఇన్‌చార్జ్‌గా బిప్లవ్ కుమార్ దేవ (ఎంపీ,మాజీ ముఖ్యమంత్రి)ను నియమించింది. మహారాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జ్‌గా కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్, కో ఇన్‌చార్జ్‌గా అశ్విని వైష్ణవ్(కేంద్రమంత్రి)లను నియమించారు. జర్కాండ్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, కో ఇన్‌చార్జ్‌గా అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వాశర్మలను నియమిస్తూ బిజెపి అధిష్ఠానం ప్రకటించింది.

# అజిత్ ధోవల్‌తో అమెరికా ఎన్‌ఎస్‌ఎ భేటీ



**న్యూఢిల్లీ, జూన్ 17:** జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్‌తో అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలివన్ సోమవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. పరస్పర ప్రయోజనాలతో ముడిపడిన ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై భారత్, అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం గురించి ఇరువురు చర్చించారు. ఇరు దేశాలకు చెందిన వివిధ విభాగాల ప్రతినిధి బృందాలతోనూ ఎన్‌ఎస్‌ఎలు చర్చించనున్నారు. ఇక సిఐఐ ఆధ్వర్యంలో మంగళవారం జరిగే ఇండియా, యూఎస్ ఐసిఇటీ రౌండ్ టేబుల్ భేటీలోనూ వీరు పాల్గొన నున్నారు. ఈ సమావేశానికి పరిశ్రమ ప్రముఖులు, వ్యాపార దిగ్గజాలు, సిఇఒలు హాజరు కానున్నారు.

# రాష్ట్రంలో పేట్రేగిపోతున్న నకిలీ వైద్యులు

**వచ్చీరాని వైద్యంతో ప్రజల ప్రాణాలు హరీ**

**తాజాగా, ఆర్ఎంపి వైద్యంతో సంగారెడ్డి జిల్లాలో ఒకరు మృతి**

**రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పుట్టగొడుగుల్లా ప్రైవేట్ క్లినిక్‌లు**

**నామమాత్రంగా డిఎంహెచ్ఒల తనిఖీలు**

**రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కౌన్సిల్ తనిఖీలు, క్లినిక్‌లపై చర్యలు**

**ఇప్పటి వరకు 110 కేసులు, దాడులు కొనసాగిస్తాం: డా.మహేశ్**

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త :** తెలంగాణలో నకిలీ వైద్యులు పేట్రేగి పోతున్నారు.. ఎలాంటి విద్యార్హత లేకున్నా ఎంబీబీఎస్ వైద్యుల స్థాయిలో క్లినిక్ లను ఏర్పాటు చేసి వచ్చీ రాని వైద్యంతో రోగుల ప్రాణాల మీదికి తెస్తున్నారు. పేద ప్రజల అవసరాలను అవకాశంగా తీసుకుని నిలువు దోపిడీ చేస్తూ అందినంత దోచుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రథమ చికిత్స కేంద్రాల ముసుగులో ఇబ్బడి ముబ్బడిగా యాంటీబయోటిక్స్, షెడ్యూల్ హెచ్ డ్రగ్స్, నార్కోటిక్స్‌ను రాస్తూ ప్రజల ప్రాణాల మీదికి తెస్తున్నారు. కొందరు నకిలీ వైద్యులు నూతనంగా ఏర్పాటు చేస్తున్న హాస్పిటళ్లలోని వైద్యులతో ఒప్పందం చేసుకుని కమీషన్లు తీసుకుంటూ వారికి సదరు వైద్యుల వద్దకు పంపిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అయితే, జిల్లా స్థాయిలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ ప్రైవేట్ వైద్యులపై చర్యలు తీసుకోవాల్సిన డీఎంహెచ్‌వోలు నామమాత్రంగా తనిఖీలు చేస్తుండటంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ శివారు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో ప్రైవేట్ వైద్యులు పుట్టగొడుగుల్లా క్లినిక్‌లను ఏర్పాటు చేసినప్పటికీ ఎలాంటి నియంత్రణా లేకుండా పోవడంతో నకిలీ వైద్యులు షరా మామూలుగా వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ముఖ్యంగా మేడ్చల్ జిల్లాలో కనీస విద్యార్హతలు లేని పీఎంపీలు, ఆర్ఎంపీలు విచ్చలవిడిగా క్లినిక్‌లను ఏర్పాటు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం. ఈ జిల్లా వైద్యశాఖాధికారి కార్యాలయంలో పని చేస్తున్న ఓ ఉద్యోగి ప్రైవేట్ క్లినిక్‌ల అసోసియేషన్ ద్వారా నెలనెలా ఎవరికి అందాల్సిన మామూళ్లను వారికి అందజేస్తుండటంతో నకిలీ వైద్యుల వైద్య వ్యాపారం మూడు పూవులు ఆరు కాయలుగా సాగుతున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో నకిలీ వైద్యుల వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి నడుం బిగించింది. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వైద్యం పేరుతో మోసం చేస్తున్న నకిలీ వైద్యులపై కొరడా ఝుళిపించింది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఎన్ఎంసి చట్ట ప్రకారం నకిలీ వైద్యులపై వందలాదిత కేసులు నమోదు చేసింది. నకిలీ వైద్యులతో పాటు నకిలీ వైద్యులను ప్రోత్సహిస్తున్న హాస్పిటల్స్, కంపెనీలకు నోటీసులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రైవేట్ హాస్పిటల్స్, నర్సింగ్ హోంలు, మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్‌పై దాడులు చేసి ఎలాంటి అర్హతలు లేని నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేసి వారిపై చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన తనిఖీలలో దాదాపు 110 కేసులు నమోదు చేశామనీ, ఏ ప్రాంతంలోనైనా నకిలీ వైద్యులు ఉన్నా లేదా హాస్పిటల్స్‌లో నకిలీ వైద్యం జరగుతున్నట్లు గుర్తించినా తెలంగాణ రాష్ట్ర వైద్య మండలిలో ఫిర్యాదు చేయాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డా.మహేశ్ కుమార్ వెల్లడించారు. ఎలాంటి అర్హతలు లేకుండా వైద్యం చేసినా లేదా వైద్య పరీక్షలు నిర్వహించిన ఎవరిపైనైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామనీ పోలీస్ స్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో పాటు నకిలీ వైద్యుల వివరాలను డీఆర్ఎకు పంపి క్లినిక్‌లను సీజ్ చేయిస్తామన్నారు. అలాగే, నకిలీ వైద్యులపై టీజీఎంసి చట్టం ప్రకారం 6 నెలల జైలు శిక్ష, కేంద్ర చట్టం ప్రకారం ఈ సందర్భంగా ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు 5 లక్షల వరకు జరిమానా విధించబడుతుందని డా.మహేశ్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

# రైతులకు నేడే పిఎం కిసాన్ పెట్టుబడి సాయం

**తెలంగాణలో 39 లక్షల మందికి వర్తింపు**

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం కిద రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు సిద్ధమవుతోంది. ఈ నెల 18వ తేదీన కేంద్ర ప్రభుత్వం 17వ విడత పీఎం కిసాన్ నిధులను విడుదల చేయనుంది. దేశ వ్యాప్తంగా 9.26 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో దాదాపు 20 వేల కోట్ల రూపాయలను జమ చేయనుంది. తెలంగాణలో దాదాపు 39 లక్షల మంది రైతులకు సుమారు 780 కోట్ల రూపాయలకు పైగా జమ కానున్నాయి. ఇందుకు గాను ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఈ సొమ్మును విడుదల చేయనున్నారు. కాగా ఈ పథకం కింద ఏటా 6 వేల రూపాయలను మూడు విడతల్లో విడుదల చేస్తోంది. ఒక్కో విడతకు 2 వేల రూపాయల చొప్పున రైతుల ఖాతాలకు జమ చేస్తోంది.

# ఇద్దరు పిల్లలను సంపులో పడవేసి తల్లి ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం

**పిల్లల పరిస్థితి విషమం.. గాంధీ ఆసుపత్రికి తరలింపు**



గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మానస, ఇన్‌సెట్- సహస్ర, అనన్య

**గజ్వేల్, జూన్ 17, ప్రభాతవార్త:** కుటుంబ కలహాల కారణంగా ఓ తల్లి తన ఇద్దరు పిల్లలను ఇంటి సమీపంలోని నీటిసంపులో పడవేసి ఇంట్లోకి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. గజ్వేల్ మండలం జాలిగామకు చెందిన పీర్లపల్లి రాజుకు వడ్డేపల్లికి చెందిన మానసతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కూతుర్లు సహస్ర(3), అనన్య (11 నెలలు) ఉన్నారు. కుటుంబ కలహాల వల్ల విసిగిపోయిన మానస సోమవారం మధ్యాహ్నం ఇద్దరు పిల్లలను నీటి సంపులో పడవేసి ఇంట్లోకి వెళ్లి తాను ఉరివేసుకునేందుకు ప్రయత్నించింది. విషయం తెలుసుకున్న స్థానికులు చిన్నారులను నీటి సంపులో నుండి బయటకు తీసి గజ్వేల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పిల్లల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలి

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సిపిఐ నేత చాడ వెంకట్‌రెడ్డి లేఖ**

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పలుచోట్ల ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఆయన సోమవారం లేఖ రాశారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కుంట్లూరు రెవిన్యూపరిధిలోని సర్వే నంబర్ 215 నుంచి 224లో సుమారు 100 ఎకరాలు 40 సంవత్సరాల నుంచి ఖాళీగాఉన్న భూదాన భూమిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సంవత్సరం 6 నెలల నుంచి సుమారు 20వేల మంది ఇండ్లులేని నిరుపేదలు 8వేల గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని తెలిపారు. వర్షానికి, ఎండకు లెక్కచేయకుండా పిల్లా పాపలతో అక్కడే జీవిస్తున్నారని తెలిపారు. ప్రైవేటు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో రెవిన్యూ అధికారులు, పోలీసులు కుమ్మక్కై గుడిసెలను ఖాళీ చేయించే ప్రయత్నాలు చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. ప్రైవేటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ భూమిపై తప్పుడు రికార్డులు సృష్టించి ప్రైవేటు భూమిగా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. కానీ రికార్డుల్లో ఈ భూమి మొత్తం భూదాన భూమిగా ఉందని చాడ పేర్కొన్నారు. ఈ నెల 13న అర్ధరాత్రి పేదల గుడిసెలను తొలగించే ప్రయత్నాలు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు కొనసాగిస్తూనే ఉన్నారని .. కావున గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు పట్టాలు ఇప్పించి, వారికి మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చేవెళ్ల పట్టణంలోని సర్వే నంబర్ 75లో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిలో దాదాపు 500 మంది ఏడాదిన్నర నుంచి గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారని తెలిపారు. అట్టి గుడిసెలకి కూడా పట్టాలు ఇప్పించి, మౌలిక వసతులు కల్పించాలని రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి రాసిన లేఖలో చాడ వెంకట్ రెడ్డి కోరారు.

# భవిష్యత్తులో తెలంగాణలో వచ్చేది బిజెపి ప్రభుత్వమే!

**పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు**



సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** తెలంగాణలో వచ్చేది బిజెపి ప్రభుత్వమేనని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా 88 సీట్లు గెలిచేలా కృషి చేస్తామన్నారు. కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం మూడవసారి కొలువుదీరిన సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి రెండు కేంద్ర మంత్రి పదవులు ఇవ్వడం సంతోషకరం అన్నారు. కేంద్రమంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన తరువాత కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు రాష్ట్రానికి ఈనెల 19న మొదటిసారి విచ్చేస్తున్నారు అన్నారు.

కేంద్రమంత్రులుగా బాధ్యతలు స్వీకరణ అనంతరం తొలిసారిగా రాష్ట్రానికి విచ్చేస్తునన కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బిజెపి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికేందుకు సిద్ధమౌతున్నామన్నారు. బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి బిజెపి వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సెల్యూల్ తెలంగాణ పేరుతో నిర్వహించుకుంటున్న ఈ ర్యాలీలో రాష్ట్రం నుంచి గెలిచిన 8 మంది ఎంపిలు, రాజ్యసభ సభ్యులు డా.లక్ష్మణ్‌లు ర్యాలీలో పాల్గొంటున్నారన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో వేదిక ఏర్పాటు చేసి తెలంగాణ ప్రజలకు దన్యవాదాలు తెలిపారు. సభ అనంతరం భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదం తీసుకుంటారు. రాష్ట్రంలో ఏడు మోర్చా కమిటీల ఆధ్వర్యంలో కేంద్ర మంత్రులకు స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మరోసారి రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞత సభ ద్వారా ధన్యవాదాలు తెలియజేసే కార్యక్రమం ఉంటుందన్నారు. భవిష్యత్తుల తెలంగాణ రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు.

# నీట్ అవకతవకలపై న్యాయవిచారణ జరిపించాలి

**20న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని**

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** నీట్ ప్రవేశపరీక్ష జరిగిన అవకతవకల మీద న్యాయ విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు(సీపీఐఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నష్టపోయిన విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ నాయ కత్వంలో బీజేపీ, ఎన్‌డీఏ పాలనలో ఉన్నత చదువుల కోసం నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షల్లో అవకతవకలు, లీకేజీలు సర్వసాధారణంగా మారిందన్నారు. విద్యార్థుల జీవితాలు గందరగోళం అవుతున్నాయని.. బీహార్, గుజరాత్‌లలో ప్రశ్నాపత్రాలు లీకు చేశారనీ పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని ఆందోళన వ్యక్తమవుతుందన్నారు. నీట్-2024 యూజీ పరీక్షలు రాసిన 24 లక్షల కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయని తమ్మినేని తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి అత్యధిక సంఖ్యలో విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షలు రాశారని తెలిపిన తమ్మినేని.. న్యాయ విచారణకు ఆదేశించాలని, విద్యార్థుల కుటుంబాలకి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేయాలని సీపీఎం నిర్ణయించినట్టు తెలిపారు. జనగామ జిల్లా బచ్చన్నపేట గుడిసెం కేంద్రాన్ని రెండురోజులుగా పోలీసులు చట్టుముట్టారని, గుడిసెలు ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. ఈ చర్యలను సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, టీ సాగర్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలోని 19 జిల్లాల్లో 69 పోరాట కేంద్రాల నాయకుల సమావేశం సోమవారం హైదరాబాద్‌లో సాగర్ అధ్యక్షతన జరగగా.. ప్రభుత్వ భూముల్లో పేదలు నిర్మించుకున్న గుడిసెలు తొలగించడం తమ ప్రభుత్వ అభిమతం కాదని ఇటీవల సీఎంను కలిసిన సందర్భంగా చెప్పారని వీరయ్య గుర్తు చేశారు. అయినప్పటికీ స్థానిక అధికారులు రియల్ ఎస్టేట్ బ్రోకర్లతో కుమ్మక్కై గుడిసెవాసుల మీద దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. గుడిసె వాసుల మీద దాడులను తక్షణమే ఆపేయాలని, అక్రమ కేసులను ఎత్తేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తెలంగాణలో వెడ్డింగ్ డెస్టినేషన్స్‌గా పర్యాటక ప్రాంతాలు

**పెట్టుబడులను ఆకర్శించేందుకు కార్యాచరణ**

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త :** తెలంగాణ నలుమూలల ఉన్న పర్యాటక ప్రాంతాలు వెడ్డింగ్ డెస్టినేషన్స్‌గా మారనున్నాయి. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్శించేందుకు పర్యాటక శాఖ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నది. ఇందులో భాగంగా శ్రీశైలం వయా సోమశిల నాగార్జున సాగర్ వరకు ఉన్న 160 కి.మీ.ల మేర నల్లమల అడవుల గుండా ప్రవహిస్తున్న కృష్ణానదీ తీరాన ఉన్న దట్టమైన అడవులు, వన్యప్రాణులు, జలపాతాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చెందనున్నాయి. అలాగే, సీఎం రేవంత్ రెడ్డి లండన్ థేమ్స్ నది తరహాలో రూ.70 వేల కోట్లతో మూసీ సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు ప్రకటించారు. దీంతో ఈ ప్రాంతమంతా పర్యాటక ప్రాంతంగా ముస్తాబు కానుంది. రాష్ట్రం నలుమూలలా చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రాంతాలు, వాసరత్వ కట్టడాలు, సహజ జల వనరులు, నల్లమల అడవులు, కొండలు, కోనలు, కోటలు ఇలా ప్రకృతి రమణీయతను ఆస్వాదించే ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి.

ఈ ప్రాంతాలను పర్యాటక, ఆతిథ్య రంగాలుగా అభివృద్ధి చేసేందుకు పెట్టుబడులు పెట్టాలని ఇటీవల రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇప్పటికే టెంపుల్ టూరిజం అభివృద్ధికి రాష్ట్ర పర్యాటక శాఖ శ్రీకారం చుట్టింది. దీనికి తోడు ప్రకృతి రమణీయ ప్రాంతాలు, కొండలు పర్యాటకులను ఆకర్శించే విధంగా మరింత అందంగా తయారు కానున్నాయి. ఇందుకు అనుగుణంగా పర్యాటక, ఆతిధ్య రంగాల అభివృద్ధికి పర్యాటక శాఖ విధివిధానాలను రూపొందించనుంది. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలను సమ్మిళిత, సుస్థిరమైన, స్థితిస్థాపక రీతిలో అభివృద్ధి చెందేలా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టనున్నారు.

# మెదక్‌లో గుండెపోటుతో అల్లుడు, అత్త మృతి

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 17, ప్రభాతవార్త:** మెదక్ జిల్లా చేగుంట మండలం మక్కరాజుపేటలో గుండెపోటుతో ఇద్దరు మృతి చెందారు.గంటల వ్యవధిలోనే అత్త, అల్లుడి మృతితో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నరసింహులు (58) ఆదివారం రాత్రి గుండెపోటుతో చనిపోయారు. అల్లుడి మరణం తట్టుకోలేకరోదిస్తున్న అత్త నర్సమ్మసైతం సోమవా రం ఉదయం గుండెపోటుకు గురై మృతి చెందారు.

# సింగరేణికి జాతీయ అవార్డు

**అత్యుత్తమ ఐటి సేవల కంపెనీగా గుర్తింపు**

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** సింగరేణి కాలరీస్‌కు ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి అవార్డు లభించింది. ఉద్యోగుల సమాచారానికి, సేవలకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని విస్తృతంగా వాడుతున్నందుకు గుర్తింపుగా ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్ కేటగిరీలో సింగరేణి ఐటీ విభాగానికి అత్యుత్తమ ఐటీ సేవల కంపెనీగా అవార్డుకు ఎంపికైంది. ఆదివారం రాత్రి జైపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి సమావేశంలో ఈ అవార్డును సింగరేణి సంస్థకు ప్రదానం చేశారు. తదుపరి సోమవారం జిఎం జి దేవేందర్ నేతృత్వంలోని ఐటీ బృందం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సిఎండి ఎన్ బలరామ్‌కు ఈ పురస్కారాన్ని అంద చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ సాఫ్ట్‌వేర్ అమలు జరిపి దేశంలోనే మొట్ట మొదటి బొగ్గు కంపెనీగా సింగరేణి ఇప్పటికే గుర్తింపు తెచ్చుకుందన్నారు.

తాజాగా ఉద్యోగుల సమాచారాన్ని డిజిటలైజ్ చేస్తున్నందుకు సింగరేణి ఐటీ విభాగంలో మరొక అవార్డు లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనతి కాలంలోనే సింగరేణి సంస్థను పేపర్ లెస్ కంపెనీగా రూపుదిద్దాలని సూచించారు.

# నేడు పిజి ఇ-సెట్-2024 ఫలితాలు

**పరీక్షలకు 90 శాతం హాజరు**

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఇంజినీరింగ్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పీజీ ఇ-సెట్-2024 పరీక్షల ఫలితాలను నేడు(మంగళవారం) విడుదల చేయనున్నారు. పీజీ ఈ సెట్ పరీక్షలు ఈ నెల 10 నుంచి 13 వరకు జరిగాయి. పరీక్షల ఫలితాలను కేవలం 5 రోజుల్లోనే విడుదల చేయనున్నారు.

నేడు సాయంత్రం 4 గంటలకు జేఎన్‌టీయూ క్యాంపస్‌లో యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ వీసీ, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఫలితాలను విడుదల చేయనున్నట్టు పీజీ ఈ సెట్-2024 కన్వీనర్ ప్రొఫెసర్ అరుణ కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను హైదరాబాద్ తోపాటు వరంగల్‌లోనూ నిర్వహించారు. నాలుగు రోజులపాటు జరిగిన పరీక్షలకు 90.82 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. పీజీ ఈసెట్-2024 నోటిఫికేషన్‌ను మార్చి 12న జారీ చేయగా.. పరీక్షలను ఈ నెల 10 నుంచి 13 వరకు నిర్వహించారు. మొత్తం 19 కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలను చేపట్టనున్నారు. పరీక్షలను హైదరాబాద్, వరంగల్‌న రీజినల్ కేంద్రాల్లో నిర్వహించారు. పరీక్షలకు హైదరా బాద్ రీజియన్‌లో 18,300 దరఖాస్తు చేసుకోగా వారిలో 16,538 హాజర య్యారు. వరంగల్ రీజియన్‌లో 4,412 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 4,088 మంది పరీక్షలకు హాజరయ్యారు. మొత్తంగా 22,712 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 20,626 మంది హాజరయ్యారు. పరీక్షలకి 90.82 శాతం మంది హాజరయ్యారు. పరీక్షలు ఆన్‌లైన్‌లో కొనసాగాయి.

# అక్రమాలపుట్టగా మారిన నీట్ పరీక్షను రద్దు చేయాలి

**విద్యార్థి యువజన సంఘాల డిమాండ్**

**నేడు లిబర్టీ నుంచి 'స్టూడెంట్ మార్చ్'**



స్టూడెంట్ మార్చ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎస్ఎఫ్ఐ నేత మూర్తి, విజెఎస్ అరుణ్, పిడిఎస్‌యు మహేష్ తదితరులు

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** వైద్యవిద్య ప్రవేశాల కోసం జాతీయ నిర్వహించిన నీట్‌పరీక్ష అక్రమాల పుట్టగా మారిన నేపథ్యంలో తక్షణమే పరీక్షను రద్దుచేసి తిరిగి నిర్వహించాలని విద్యార్థి యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ, ఎన్ఎస్‌యుఐ నేత బల్మూరి వెంకట్ , ఎస్ఎఫ్ఐ, ఏఐవైఎఫ్, విజెఎస్, పిడిఎస్‌యు నాయకులు మహేష్, ధర్మేంద్ర యాదవ్, అరుణ్‌లు నీట్‌లో జరిగిన అక్రమాలపై తీవ్రస్థాయిలో మండి పడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ అక్రమాలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రధాని నరేంద్రమోదీ దేశప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలడి డిమాండ్ చేశారు. నీట్‌పరీక్షను నిర్వహించే సంస్థను రద్దు చేసి ..ఆపరీక్ష రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించుకునేలా అవకాశం కల్పించాలన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై ఈనెల 18న హిమాయత్‌నగర్ లిబర్టీ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు స్టూడెంట్ మార్చ్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే కేంద్రమంత్రులైన కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌ల నివాసాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

# రాష్ట్రంలో అధ్వానంగా మారిన శాంతిభద్రతలు

**కేబినెట్‌ను విస్తరించి మంత్రిని నియమించే పరిస్థితి లేదు**

**సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు**

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎనిమిది నెలలుగా లాండ్ అండ్ ఆర్డర్ పూర్తిగా దిగజారిందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మండిపడ్డారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ఇంటి తగాదాల వల్ల రాష్ట్రానికి హోంమంత్రి, విద్యాశాఖ మంత్రిని నియమించడం లేదన్నారు. కేబినెట్ విస్తరణ చేపట్టి మంత్రిని నియమించే పరిస్థితి లేదన్నారు. హోంమంత్రిని నియమిస్తే జరుగుతున్న ఘటనలపై కనీస చర్యలు అయినా తీసుకునేవారు అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల కోసం ఢిల్లీకి డబ్బులు పంపించే పనిలో ఉన్నారన్నారు. మంత్రులు వాళ్ల సంపాదనలో వాళ్లున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతిరోజు ఏదో ఒక చోట మర్డర్లు, అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. వీటిపై కనీసం రివ్యూ చేసే సమయం కూడా సిఎం రేవంత్‌రెడ్డికి లేదన్నారు. పెద్దపల్లి జిల్లాలోని సుల్తాన్‌బాద్‌లో కూడా గంజాయి దొరుకుతుంది, ఈ పరిస్థితి రాష్ట్రంలో ఎందుకు వచ్చిందన్నారు. రాష్ట్రంలో ఉపాధి దొరికే పరిస్థితి లేకపోవడంలో వలసలు వెళ్తున్నాయన్నారు. బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మంత్రులను పంపి చేతులు దులుపుకునే కార్యక్రమం చేశారన్నారు.

రెండు నెలల క్రితం పెద్దపల్లి జిల్లా సుల్తానా బాద్‌లో దారుణ ఘటన జరిగింది. జూన్ 13న ఆరేళ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడి హత్య చేశారన్నారు. సభ్య సమాజానికి తలవంపులు తెచ్చేలా ఈ ఘటన ఉందన్నారు. అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తి గంజాయి మత్తులో ఉన్నాడని తెలుస్తోందని, సిసి టీవిలో అమ్మాయిని ఎత్తుకెళ్లిన వీడియో రికార్డు అయిందన్నారు. రాష్ట్రంలో ఎన్నో సంఘటనలు జరుగుతున్నాయని, నిందితులకి కఠిన శిక్ష వేసి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.20లక్షల పరిహారం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లో పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లకు జీతాలు కూడా లేవు అన్నారు. పంచాయతీ రాజ్, రోడ్స్ అండ్ బిల్డింగ్ శాఖలో కూడా బిల్లులు చెల్లించడం లేదన్నారు. మున్సిపాలిటీలకు నిధులు లేవన్నారు. నాలాల సమస్యలు వస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించలేదని రాష్ట్ర ప్రభుత్వం చెంపలేసుకుని తప్పును ఒప్పుకోవాన్నారు. భవిష్యత్తులో ఎలాంటి సంఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# హామీ మేరకు 25వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

## కెసిఆర్ బొమ్మ ఉందని సిఎంఆర్ఎఫ్ చెక్కులు ఇవ్వట్లే

## గ్రూప్1లో 1:100 చొప్పున మెయిన్స్ అవకాశం ఇవ్వాలి

### మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 17:** కాంగ్రెస్ ప్రభుత్వంలో యువత ఆందోళన చెందుతున్నారని, కాంగ్రెస్ నేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట,ఇప్పుడు ఒక మాట చెబుతున్నారని మాజీ మంత్రి సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బిఆర్ఎస్ కార్యాలయానికి గ్రూప్స్ అభ్యర్థులు వచ్చి వినతి పత్రం ఇచ్చారని, గ్రూప్1 మెయిన్స్‌కు 1:100 చొప్పున మెయిన్స్ ఎగ్జామ్‌కు అవకాశం ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నట్లు చెప్పారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఇస్తామన్నారు. ఎప్పుడు ఇస్తారు అని ప్రశ్నించారు. మెగా డిఎస్సీ కింద 25వేల ఉద్యోగాలు ఇస్తామని 11వేలతో సరిపెట్టారు, హామీ మేరకు 25వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వచ్చి ఆరు నెలలైనా ఆరు గ్యారంటీలు అమలు చేయలేదని, పింఛన్ ఎప్పుడిస్తారని అవ్వతాతలు అడుగుతున్నారని చెప్పారు. రెండు నెలల నుంచి ఆసరా పింఛన్ రావడం లేదని, ఏపీ సిఎం మొదటి సంతకంతో పింఛన్ రూ.4వేలకు పెంచారని, ఇక్కడ రేవంత్ ప్రభుత్వ ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పాలన్నారు.




సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

వస్తే 1:100 విధానం అమలు చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారని, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కూడా అసెంబ్లీ సాక్షిగా చెప్పారని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉనన్నప్పుడు కాంగ్రెస్ నేతలు గ్రూప్స్ పోస్టులు పెంచాలని అడిగారని, ఇప్పుడు పోస్టులు పెంచాలని అభ్యర్థులు కోరితే స్పందించట్లేదన్నారు. గ్రూప్స్‌లో పరీక్షలకు మధ్య వ్యవధి ఉండాలని అభ్యర్థులు కోరుతున్నారని, ఈ విషయంపై ప్రభుత్వాన్ని నిలదీయాలని మా వద్దకు వచ్చి కోరారని చెప్పారు. జాబ్ క్యాలెండర్ ఉద్యోగులకు ప్రతి నెల 1న జీతాలు ఇస్తే ఆశా వర్కర్లు ఎందుకు వైద్య విధాన పరిషత్‌కు వస్తారని ప్రశ్నించారు. ఎన్‌హెచ్‌ఎం కింద 17వేల మంది పనిచేస్తున్నారని, వారికి వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఎంఆర్ఎఫ్ చెక్కులపై కెసిఆర్ బొమ్మ ఉందని ఇవ్వట్లేదని, 1.5లక్షల మంది చెక్కుల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. 60వేల మంది జీతాల కోసం వేచి చూస్తున్నారని, తమ ప్రభుత్వ హయాంలో వారికి జీతాలు ఆపలేదన్నారు.

# పోలవరాన్ని నాశనం చేశారు




సోమవారం పోలవరం ప్రాజెక్టును సందర్శించి పరిశీలిస్తున్న ఎపి సిఎం చంద్రబాబు నాయుడు. చిత్రంలో మంత్రులు, అధికారులు

- దారికి రావాలంటే మరో 4 సీజన్లు కావాలి..
- కాఫర్‌డ్యాం, డయాఫ్రంవాల్ ధ్వంసం
- గైట్‌బండ్ కుంగిపోయింది
- గతంలో 30 సార్లు వచ్చి ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లా
- జగన్ రాష్ట్రానికి ఓ శాపం
- నిర్వాసితుల పరిహారం బాగా పెరిగింది
- పోలవరం ప్రాజెక్టులో మీడియాతో ఎపి సిఎం చంద్రబాబు

**ప్రభాతవార్త / ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా**

పోలవరం ప్రాజెక్టును ఎంత వేగంగా పూర్తి చేయాలని ఆశించామో అంతగా వెనక్కిపోయిందని ఇప్పుడున్న పరిస్థితిని పూర్తిగా అధ్యయనం చేసి నిధులు ఇస్తే అన్నీ అనుకున్నట్లు జరిగితే మరో నాలుగు సీజన్లు పడుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పోలవరం ప్రాజెక్టును సోమవారం సందర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టులోని సమస్యలను చూసి ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యానని, ఓ విధంగా తాను భావోద్వేగానికి గురవుతున్నానని కూడా చెప్పారు. కాఫర్ డ్యాం, డయాఫ్రమ్ వాల్, గైట్ బండ్ సమస్యలు ప్రాజెక్టును పూర్తిగా వెనక్కి నెట్టేసాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాఫర్ డ్యాం పనులు చివరి దశలో ఏజెన్సీని మార్చవద్దని ఎంత మొత్తుకున్నా వినలేదని,ఆ నష్టం ఇప్పుడు తీవ్రమైంది అన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన కేవలం అయిదు రోజుల్లోనే పోలవరం నిర్మిస్తున్న సంస్థను నిలిపివేసి రివర్స్ టెండరింగ్ పేరుతో మార్చారని ఆయన వివరించారు. లాస్ట్ గ్యాప్‌ను పూర్తి చేసి ఉంటే ఈ దుస్థితి ఉండేది కాదన్నారు పోలవరం ప్రాజెక్టును ఇప్పటికి తాను 30సార్లు సందర్శించానని 100సార్లు పైగా సమీక్షించానని చెప్పారు. 2019-2020లో వచ్చిన భారీ వరదల కారణంగా డయాఫ్రమ్ వాల్ నాలుగు చోట్ల 35శాతం డ్యామేజీ అయిందన్నారు. ఈ మరమ్మతులకు 427 కోట్లు ఖర్చు అవుతుందని, అదే తిరిగి నిర్మిస్తే 990 కోట్లు ఖర్చు అవుతుందని స్పష్టం చేశారు. కాఫర్ డ్యాం పైన కింద కలిపి 550 కోట్లతో కట్టారని వరదల కారణంగా వచ్చిన సుడిగుండాల వల్ల 250 మీటర్ల డ్యామ్‌కు గాను 150మీటర్లు కొట్టుకుపోయిందని తెలిపారు. ముఖ్యంగా గైట్ బండ్ గరిష్టంగా కృంగిపోయిందన్నారు. ఈ దుస్థితిలో మళ్లీ చేపట్టి ఒక స్థాయికి తీసుకురావాలంటే మరో నాలుగు సీజన్లు పడుతుందని ఇంజనీర్లు చెబుతున్నారని అన్నారు. ఒక వ్యక్తి రాష్ట్రానికి ఎలా శాపంగా మారతారో పోలవరం పరిస్థితిని ఉదాహరణగా చెప్పవచ్చు అన్నారు. 2020 నాటికి పూర్తి కావాల్సిన ప్రాజెక్ట్ జగన్ మూర్ఖత్వం కారణంగా ఈ పరిస్థితికి వచ్చిందన్నారు. మీడియా, ప్రజలు దీనిపై చర్చించాలని సిఎం కోరారు. చివరి నిమిషంలో కాంట్రాక్టును మార్చే జగన్ ఈ స్థితికి తెచ్చారన్నారు. వారి మూర్ఖత్వం, అహంకార ధోరణి వల్ల పోలవరాన్ని పూర్తిగా సమస్యల సుడిగుండంగా చేశారని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. రింగుబండ్ వేసి పనులు ఏ విధంగా పూర్తిచేయాలి అనేదాన్ని అధ్యయనం చేస్తామన్నారు. కేంద్రంలో కూడా జలవనరులకు సంబంధించి అప్పటి నుంచి నలుగురు మంత్రులు మారారని ఇప్పుడున్న మంత్రికి ప్రాజెక్టు పూర్వాపరాలు వివరించాల్సిన అవసరం ఉందని అన్నారు. 2014 నుంచి తమ ప్రభుత్వంలో ఏటా బడ్జెట్లో 13,683 కోట్లు కేటాయించగా గత ప్రభుత్వం దాన్ని పూర్తిగా తగ్గించి వేసిందన్నారు. ప్రాజెక్టులో ఇప్పుడు ఎన్నో చిక్కుముడులు ఉన్నాయని వాటిని ఒక్కొక్కటి పరిష్కరించాలన్నారు. పోలవరాన్ని పూర్తిచేసి 194 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోగలిగితే రాయలసీమకు సైతం గోదావరి నీళ్లు ఇవ్వవచ్చని సిఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ ప్రాజెక్టు చైనాలో ప్రాజెక్టు కన్నా పెద్దదని 48 గేట్లు కలిగి రాష్ట్రంలో ఎన్నో జిల్లాలకు నీటి అవసరాలు తీర్చగలదన్నారు. ప్రాజెక్టు పరిస్థితిపై అఖిలపక్ష కమిటీలు వేయడం వల్ల ప్రయోజనం ఉండదని సమస్యను ప్రజలు చర్చించాలని కోరారు. హెలికాప్టర్‌లో పోలవరం చేరుకున్న చంద్రబాబునాయుడు ముందుగా ఏరియల్ వ్యూ నిర్వహించారు. ప్రాజెక్ట్ పనితీరును, పరిస్థితిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలవరం ప్రాజెక్ట్ హిల్‌వే నుంచి స్పిల్‌వేను పరిశీలించారు. అధికారులతో సమీక్షించి వివరాలు తెలుసుకున్నారు. స్పిల్‌వే, కాపర్ డ్యాం, డయాఫ్రమ్ వాల్ పనుల పురోగతిపై జలవనరుల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత వారితో కలిసి బస్సులో ప్రాజెక్ట్ పరిసరాలను పరిశీలించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించారు, పోలవరం కుడికాలువను ఎక్కడ వరకు పొడిగించవచ్చన్న అంశంపై అధికారులతో సమీక్షించారు. దీనితో పాటు నీటిని గరిష్టంగా ఉపయోగించుకునే అంశంపై కూడా సమీక్ష నిర్వహించారు. వైకుంఠపురం వరకు కుడికాలు వను పొడించే అంశంపై పూర్తి స్థాయి నివేదికను తనకు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రాజెక్ట్‌కు సంబంధించిన కాంట్రాక్ట్ ఏజన్సీలతో కూడా చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. కాగా పోలవరం పనుల వేగాన్ని పెంచాలని అధికారులకు చంద్రబాబు ఆదేశించారు. గత ఐదేళ్లుగా పనులు జరగకపోవడం, కాపర్ డ్యామ్ దెబ్బతినడం పోలవరానికి శాపంగా మారాయని ఆయన విచారం వ్యక్తం చేశారు. కొన్ని కట్టడాలు పూర్తిగా దెబ్బతినడంతో వాటిని మరమత్తులు చేయడం కంటే తిరిగి నిర్మించడం మంచిదని ఇంజనీర్లు చంద్రబాబునాయుడికి వివరించారు. తొలుత మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. పోలవరం ఎమ్మెల్యే బాలరాజు పలువురు ఎమ్మె ల్యేలు అధికారులు పాల్గొన్నారు.

## టిజి, ఎపి ఉద్యోగుల పరస్పర బదలీపై

# కొత్త నిర్ణయాలేమీ తీసుకోలేదు

### ఎపి నుంచి ఉద్యోగులు తెలంగాణకు వస్తున్నట్లు ప్రచారాన్ని నమ్మొద్దు

### రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై రేవంత్‌రెడ్డి ఆరా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 17:** తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల పరస్పర బదిలీకి సంబంధించి తమ ప్రభుత్వం కొత్త నిర్ణయాలేమీ తీసుకోలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రం ఏర్పడిన ఏడాది రెండేండ్లలోనే ఉద్యోగుల పంపిణీ ప్రక్రియ దాదాపుగా కొలిక్కి వచ్చిందని, ఇప్పుడు కొత్తగా ఏపీ నుంచి ఉద్యోగులు తెలంగాణకు వస్తున్నట్లు జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన ఉద్యోగ సంఘాలకు అప్రమత్తం చేశారు. ఇంతకాలం ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ జూన్ 2వ తేదీ నుంచి తెలంగాణకు ప్రత్యేక రాజధానిగా ఏర్పడిందని, ఈ సందర్భంగా ఏపికి కేటాయించిన ఆఫీసులు,భవనాలతో పాటు విభాగాల వారీగా విభజన చట్టంలోని అన్ని అంశాలపై ప్రత్యేక నివేదిక ఇవ్వాలని ఆర్థిక శాఖకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అయితే పెండింగ్‌లో ఉన్న అంశాలపై తదుపరి చర్చలు,సమావేశాలేవీ జరగలేదన్నారు. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలైంది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేండ్లు పూర్తి కావటంతో విభజన చట్టంలోని అంశాలతో పాటు రెండు రాష్ట్రాల మధ్య ఇప్పటికే అపరిష్కృతంగా ఉన్న అంశాలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం ఆరా తీసింది. ఉద్యోగుల విభజన సమయంలో ఆప్షన్లు,పోస్టుల లభ్యత ఆధారంగా తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులు కొందరు ఏపీకి,ఏపీ స్థానికత ఉన్న ఉద్యోగులు కొందరు తెలంగాణకు పంపిణీ అయ్యారు. వైద్య అవసరాలు,భార్యభర్తలు ఉద్యోగాల్లో ఉండటం, పిల్లల చదువులు,సొంత ఇల్లు ఉన్నాయనే కారణాలతో కొందరు ఉద్యోగులు ఈ పంపిణీ జరిగిన తీరుతో ఇబ్బందులు పడ్డారు. మానవీయ కోణంలో తమ బాధను అర్థం చేసుకోవాలని పలుమార్లు ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. అదే సమయంలో ఏపీకి వెళ్లేందుకు మాకు అవకాశం ఇవ్వాలని కోరుతూ తెలంగాణకు పంపిణీ అయిన 1369 మంది ఉద్యోగులు తమతంట తాముగా సమ్మతి తెలిపారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 1369 మంది శాశ్వతంగా ఏపికి వెళ్లేందుకు సమ్మతిస్తూ తమను ఏపీకి పంపించాలని అభ్యర్థనను అందించారు. 2021 సెప్టెంబర్‌లో తెలంగాణ ప్రభుత్వం ఆ ఉద్యోగుల వివరాలను సేకరించింది. వీరి అభ్యర్థన మేరకు ఏపీకి పంపించేందుకు మాకెలాంటి అభ్యంతరం లేదని నో అబ్జక్షన్ తెలియజేస్తూ 2021 సెప్టెంబర్‌లో తెలంగాణ ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. ఇదే తరహాలో ఏపీ ప్రభుత్వం కూడా అక్కడి నుంచి తెలంగాణకు వచ్చేందుకు సిద్ధపడిన ఉద్యోగుల వివరాలు సేకరించింది. అక్కడి నుంచి 1808 మంది ఉద్యోగులు తెలంగాణకు రావడానికి ఆప్షన్లు ఇచ్చారు. శాశ్వతంగా తెలంగాణకు వెళ్లేందుకు సమ్మతి తెలిపే ఉద్యోగుల జాబితాను తయారు చేసింది. 2022 సెప్టెంబర్ 23వ తేదీన అప్పటి ఏపీ సిఎస్ సమీర్ వర్మ అప్పుడు తెలంగాణ సిఎస్‌గా ఉన్న సోమేశ్ కుమార్‌కు ఇదే విషయంపై లేఖ రాశారు. ఉద్యోగుల అభ్యర్థనలను మానవీయ కోణంలో పరిశీలించాలని కోరారు. రెండు రాష్ట్రాల్లో అప్పటికే ఆప్షన్లు ఇచ్చిన ఉద్యోగులు పరస్పర బదిలీకి ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ ఉద్యోగుల బదిలీ వ్యవహారం ఎనిమిదేండ్లుగా నానుతున్న వ్యవహారం. విభజన చట్టంలోని అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య సమావేశాలు జరిగినప్పుడల్లా ఈ అంశంపై పలుమార్లు చర్చలు జరిగాయి. కానీ ఇప్పటి వరకు ఉద్యోగుల పరస్పర బదిలీకి సంబంధించి రెండు ప్రభుత్వాలు కూడా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## రాజ్యసభలో బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా కెఆర్ సురేశ్‌రెడ్డి నియామకం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 17:** బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతగా రాజ్యసభలో ఫ్లోర్ లీడర్‌గా సీనియర్ నేత కెఆర్ సురేశ్‌రెడ్డిని ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు నియ మించారు. ఇప్పటి వరకు పార్లమెంటరీ పార్టీ, రాజ్యసభ పక్ష నేతగా ఉన్న కె.కేశవరావు స్థానంలో సురేశ్‌రెడ్డిని నియమించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓటమి, తదనంతర పరిణామాల నేపథ్యంలో కేకే కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఆయన స్థానంలో సురేశ్‌రెడ్డిని పార్టీ పక్ష నేతగా నియమిస్తామని గతంలోనే కెసిఆర్ ప్రకటించారు. అందుకు అనుగుణంగా కెఆర్ సురేశ్‌రెడ్డి నియామకానికి సంబంధించి రాజ్యసభ సెక్రటరీ జనరల్,లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు లేఖ రాశారు. లేఖ ప్రతులను సురేశ్‌రెడ్డికి కెసిఆర్ అందించారు.

## అన్వర్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ ఇంటికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### బక్రీద్ శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 17:** అన్వర్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ నవాబ్ ముజాహిద్ ఆలం ఖాన్ నివాసానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెళ్లారు. బక్రీద్ సందర్భంగా కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ మంత్రి కె.జానారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ,ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు రోహిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంకా రాని డిఎస్సీ షెడ్యూలు

>>చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలా చేస్తే డిఎస్సీకి సిద్ధమయ్యే నిరుద్యోగులు టెన్షన్ లేకుండా తమ పరీక్షలకి సిద్ధమవుతారని చెబుతున్నారు. పరీక్షలను జులై 17 నుంచి నిర్వహిస్తామని ప్రకటించి.. పరీక్షలకి నెల రోజుల సమయం ఉన్న నేపథ్యంలో .. కనీసం ఇప్పుడైనా రోజువారీ పరీక్షల షెడ్యూల్‌ను జారీ చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగిసి కూడా పది రోజులు దాటిపోయిందని.. ఇప్పుడు షెడ్యూల్ జారీ చేయడానికి కోడ్ కూడా అడ్డంకిగా లేదని అంటున్నారు. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో డిఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. అనంతరం మార్చిలో పరీక్షల తేదిలను ప్రకటించి.. దరఖాస్తు గడువును ఈ నెల 20 వరకు పొడిగించారు. అలాగే డిఎస్సీలో అర్హత మార్కులను కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీలకి 5 శాతం తగ్గిస్తూ సవరణ ఉత్తర్వులను కూడా ఇప్పటికే జారీ చేశారు. కాబట్టి వెంటనే డిఎస్సీ-2024 పరీక్షల రోజువారీ షెడ్యూల్‌ను జారీ చేయాలని నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత 2017లో 9700లకిపైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీని అప్పటి తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ద్వారా పరీక్షను నిర్వహించిన భర్తీ ప్రక్రియను నిర్వహించారు. ఇప్పుడు రెండోసారి 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు.

**11,062 పోస్టులకు మెగా డిఎస్సీనోటిఫికేషన్**

రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ(డీఎస్సీ) నోటిఫికేషన్ నంబర్ 24/ఆర్‌సీ-1/టీఆర్‌టీ/డీఎస్‌సీ/2024ని జారీ చేశారు. పరీక్షను కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(సీబీఆర్‌టీ) విధానంలో నిర్వహించనున్నారు.

పరీక్షను పాత 10 ఉమ్మడి జిల్లా కేంద్రాలైన హైదరాబాద్, నల్గొండ, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, కరీంనగర్‌తోపాటు సంగారెడ్డి కేంద్రాల్లో పరీక్షను నిర్వహించనున్నారు. 11,062 పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్ 2629 పోస్టులు ఉండగా.. 6508 సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) పోస్టులు, లాంగ్వేజన పండిట్ పోస్టులు 727, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ) 182 పోస్టులు ఉన్నాయి.

స్పెషల్ ఎడ్యుకేటర్స్‌కి సంబంధించి స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 220 ఉండగా.. ఎస్‌టీజీ పోస్టులు 796 ఉన్నాయి. మొత్తం 11,062 పోస్టులకు నోటిఫికేషన్‌ను జారీ చేశారు.

## 20న పిఠాపురానికి ఎపి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

**విజయవాడ, జూన్ 17, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి హోదాలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈ నెల 20న తన అసెంబ్లీ సిగ్మెంట్ పిఠాపురం వెళ్ళనున్నారు.ఈ నెల 19న ఆయన సచివాలయంలో తన పదవి బాధ్యతలను స్వీకరించనున్నారు.ఇందుకోసం ఆయనకు సచివాలయంలో 212 చాంబర్(గదిని) కేటాయించారు.జనసేన పార్టీకి చెందిన ఇతర మంత్రులకు కూడా కీలక శాఖలుదక్కాయి. మంత్రి నాదెండ్ల మనోహర్‌కు పౌరసరఫరాల శాఖ, వినియోగదారుల వ్యవహారాలు అప్పగించారు. అలాగే మంత్రి కందుల దుర్గేష్‌కు పర్యాటకు, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖలు అప్పగించారు సీఎం చంద్రబాబు నాయుడు. వీరందరికి వరుసగా పవన్ కల్యాణ్‌కు కేటాయించిన చాంబర్‌లు పక్కనే గదులు కేటాయించారు.ఇక జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పదేళ్ళ పోరాటానికి ఫలితం లభించింది. గత పదేళ్లుగా రాజకీయాల్లో ఉన్న ఆయన ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ప్రజల తరపున పోరాటం చేసారు. 2019లో రెండు అసెంబ్లీ స్థానాలనుంచి పోటీ చేసి ఓటమి పొందారు. అనేక విమర్శలు ఎదురైనా ముందుకు అడుగులవేసారు.పట్టువదలని విక్రమార్కుడిలా రెండవ పర్యాయం పిఠాపురం అసెంబ్లీ సిగ్మెంట్ ఒక్కచోట నుంచి ఎన్నికల్లో పోటీ చేశారు.. రెండవ సారి తిరుగులేని మెజార్టీతో పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పవర్ స్టార్ విజయం సాధించాడు.

# బాత్‌టబ్‌కు రూ.45 లక్షల ఖర్చు!

### రుషికొండపై జగన్ దంపతుల 'మాయా మహల్'

### ప్రజల సొమ్ముతో నివసించటానికి రూ.500 కోట్లతో నిర్మాణం

### అప్పటి మంత్రి రోజాకు ఆ బంగ్లా ఎందుకుకట్టారో కూడా తెలియదా!

### రాష్ట్రపతి, ప్రధానమంత్రి కోసమని కొత్త నాటకం

**అమరావతి, జూన్ 17, ప్రభాతవార్త ప్రతినిధి:** అధికార మాయలో ఉన్న జగన్‌రెడ్డి తనకే అధికారం శాశ్వతం అనుకున్నారని, రాష్ట్రంలో ఇల్లు లేక పేదలు అల్లాడుతున్నా... తాను, తన భార్య అప్పు డప్పుడు నివసించటానికి ప్రజలు సొమ్ము రూ.500కోట్లు వెచ్చింది రుషికొండకు గుండుకొట్టి మాయామహల్‌ను నిర్మించుకున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య పేర్కొన్నారు. జగన్‌రెడ్డి పెదవులపై మాత్రమే పేదల మాట.. అని మనసులో సిరుల మూట అని అన్నారు. నడిచేది ధనవంతుల బాట అని ఈ మాయా మహల్‌ను చూస్తే స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు. సోమవారం ఇక్కడి పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. భారతదేశంలోనే కాదు.. ప్రపంచంలో ఏ నాయకుడు తన నివాసానికి ప్రజాధానం వెచ్చించలేదన్నారు. ఇంత భవనం నిర్మించలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 77 సంవత్సరాల్లోభారతపార్లమెంట్ నిర్మాణానికి రూ.700 కోట్లు ఖర్చు అయ్యిందన్నారు. అప్పటి పర్యాటక శాఖమంత్రి రోజాకి ఎందుకు ఆ బంగళా కడుతున్నారో కూడా తెలియదన్నారు. అధికారం పోతుందని తెలిసి తూతూ మంత్రంగా ప్రారంభం చేసి ఫెన్సింగ్ వేశారని వర్ల రామయ్య అన్నారు.



మీడియా సమావేశంలో ఎపి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

**రూ.500 కోట్లతో 25 వేల మంది పేదలకు ఇళ్లు నిర్మించవచ్చు:** రూ.500 కోట్లతో 25 వేలమంది పేదలకు ఇళ్లు నిర్మించవచ్చని అన్నారు. తాను తన భార్య అపుడపుడు ఉండటానికి జగన్‌రెడ్డి మామా మహల్‌ను కట్టుకోవటం సిగ్గుచేటని వర్లరామయ్య వ్యాఖ్యానించారు. జగన్‌రెడ్డి ఏ రకంగా చూసినా పేదల మనిషి కాదన్నారు. మదించిన ధనవంతుడు అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ఇది గమనించారని, అందుకే జగన్‌రెడ్డికి 11 సీట్లకు ఇచ్చారన్నారు. జగన్‌రెడ్డి పేదవాడి పక్షం కాదన్నారు. ధనవంతుడి పక్షమన్నారు. సరైన వాత పెట్టారన్నారు. జగన్‌రెడ్డి భార్య,భర్తల ఆశా సౌధం రుషికొండపై కట్టిన మాయా మహల్‌లోని ఒక్క బాత్‌టబ్‌కు రూ.45 లక్షలు ఖర్చుపెట్టారని అన్నారు. ఆ టబ్ ఎవరికైనా ఇస్తే మంచి ఇల్లు కట్టుకోవచ్చని అన్నా రు. ఈజిప్ట మార్బుల్స్‌తో మాయా మహల్ కడతారా? అని ప్రశ్నించారు. 7 స్టార్ హోటల్స్ కూడా లేని కారిడార్, జగన్‌రెడ్డి మాయామహల్ లో ఉందన్నారు. అంటే జగన్‌రెడ్డి ఏవిధంగా ప్రజల సొమ్మును దుర్వినియోగం చేశారో అర్థం చేసుకోవచ్చని అన్నారు. రాష్ట్రపతి, ప్రధాని కోసం అని కొత్త నాటకం, నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారని వర్ల రామయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. వాళ్లు కూడా ఈ భవనం చూసి ఆశ్చర్యపోతారని, జగన్‌రెడ్డి దుర్వినియోగాన్ని గమనిస్తారని అన్నారు. విదేశాల్లో కూడా ఇలాంటి భవనాలు అరుదుగా ఉంటాయని, జగన్‌రెడ్డి పేదలకు దూరంగా ఉండే వ్యక్తి అని అన్నారు. ఇదంతా చూస్తే జగన్ రెడ్డి రాజకీయాలకు పనికిరాడని అర్థమైందన్నారు. జగన్‌రెడ్డి భార్యభర్తల ఆశలను రాష్ట్రంలోని పేదలు ఆడియాశలు చేశారని,. పేదలను కించపరిచిన ఏపార్టీ అధికారంలోకి రాదని వర్ల రామయ్య పేర్కొన్నారు.

# త్వరలో కొత్త రెవెన్యూ చట్టం

>> చిలుకు మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని ధరణి కమిటీ గుర్తించింది. ఈ సమస్యలపై ధరణి కమిటీ క్షేత్రస్థాయి అధ్యయనంతో సాధ్యమైన 1 లక్ష దరఖాస్తులు పరిష్కారమయ్యాయి. రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే నాటికి ఇంకా పరిష్కరించాల్సినవి 1 లక్షా 50 వేల సమస్యలు ఉండగా, ప్రస్తుతం కొత్తగా మరో లక్షా 50 వేల దరఖాస్తులు ప్రభుత్వానికి అందినట్లు సమాచారం. ధరణి సమస్యల పరిష్కార మార్గాలు, లోపాల సవరణకు సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిత్తల్ కన్వీనర్‌గా మాజీ ఎమ్మెల్యే సీనియర్ కాంగ్రెస్ నేత కోదండరెడ్డి, భూ చట్టాల నిపుణుడు సుదీల్ కుమార్‌తో ప్రత్యేక కమిటీని నియమించింది.ఈ కమిటీ రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో ఇప్పటికే పలుమార్లు సమావేశమై ప్రభుత్వానికి ప్రాథమిక నివేదికను అందజేసింది. ధరణి సమస్యల పరిష్కారానికి చాలా వరకు చట్ట సవరణతో ముడిపడి ఉన్నందున కొత్త చట్టం ఒక్కటే పరిష్కారమని ఆ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

ధరణితో పోల్చితే అత్యంత పారదర్శకంగా కొత్త రెవెన్యూ చట్టం ఉండాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భూ చట్టాల నిపుణులతో పాటు రెవెన్యూ శాఖలోని కీలక అధికారులతో ఇటీవల పలుమార్లు చర్చించినట్లు తెలిసింది. ధరణిలో లోపాల సవరణకు జిల్లా కలెక్టర్లదే ఫైనల్ కావడం, రోజువారీ రివ్యూలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో బిజీగా ఉండటం వంటి కారణాలతో ఆన్‌లైన్‌లో వచ్చే దరఖాస్తుల పరిష్కారం సాధ్యం కావడం లేదు. దీంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైంది. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలు అన్నింటికి కొత్త చట్టం ఒక్కటే పరిష్కారమని ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది.

**కొత్త చట్టంతోనే సమస్యలు పరిష్కారం : కోదండరెడ్డి**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత లోపభూయిష్టంగా రూపొందించిన ధరణి కారణంగా ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీనియర్ కాంగ్రెస్ నేత, ధరణి కమిటీ సభ్యుడు ఎం.కోదండరెడ్డి పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారంపై ధరణి కమిటిగా క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు కొన్ని క్లిష్టమైన సమస్యలను అసెంబ్లీలో చట్ట సవరణ చేయకుండా పరిష్కరించే అవకాశం లేదని గుర్తించామనీ. భవిష్యత్తులోనూ ప్రజలకు ఎలాంటి భూ సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే పకడ్బందీగా చట్టం తెస్తే తప్ప ఆర్ఓఆర్ సమస్యలు పరిష్కారం కాదని స్పష్టం చేశారు. ఈ సమస్యలన్నింటిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో కొత్త రెవెన్యూ చట్టం ఉంటే బాగుంటుందన్న ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చామనీ, దీనినే ప్రభుత్వానికి నివేదిక రూపంలో సమర్పించామని కోదండరెడ్డి వెల్లడించారు.

# 'చౌకీదార్'గా దియా ఫేమ్ పృథ్వీ అంబర్

దియా ఫేమ్ పృథ్వీ అంబర్, రథావర దర్శకుడు చంద్రశేఖర్ బండియప్ప కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న న్యూ మూవీకి 'చౌకీదార్' అనే టైటిల్ పెట్టారు. పృథ్వీ ఇప్పుడు చౌకీదార్‌గా నటిస్తున్నారు. చౌకీదార్ అనే టైటిల్‌ను ఎర్ర అక్షరాలతో యూనిట్ రిలీజ్ చేసింది. రోరింగ్ స్టార్ శ్రీమురళి, చంద్రశేఖర్ బండియప్ప 6వ అటెంప్ట్‌కి సపోర్ట్ చేస్తూ, టీమ్ మొత్తానికి అభినందనలు తెలుపుతూ 'చౌకీదార్' టైటిల్‌ను అనౌన్స్ చేశారు. 'చౌకీదార్' మల్టీ లింగ్వల్ మూవీ. కన్నడతోపాటు పలు ఇతర భాషల్లో రూపొందుతోంది. 'చౌకీదార్' అనే టైటిల్‌ను బట్టి ఇది మాస్ మూవీ అని



అనుకోకండి. నిజానికి ఇది ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. చంద్రశేఖర్ బండియప్ప తన ప్రతి సినిమాలోనూ సరికొత్త కథతో అలరిస్తారు. 'అనే పాటకి'లో కామెడీ, 'రథావర'లో కల్ట్ థీమ్స్, 'తారకాసుర'లో యూనిక్ కథాంశం, 'రెడ్ కాలర్'లో క్రైమ్ థ్రిల్లర్, 'కౌస్తి'లో కోస్టల్ డ్రామా. పృథ్వీ, చంద్రశేఖర్ బండియప్ప సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని విద్యాశేఖర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కల్లహళ్లి చంద్రశేఖర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సచిన్‌బ్రసూర్ సంగీతం అందిస్తుండగా, వి.నాగేంద్రప్రసాద్, ప్రమోద్ మరవంటే లిరిక్స్ అందిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మిగిలిన నటీనటులు, సాంకేతిక సిబ్బందిని మేకర్స్ త్వరలో అనౌన్స్ చేస్తారు. 'అనే పాటకి'తో శాండిల్‌వుడ్‌లోకి అడుగుపెట్టిన చంద్రశేఖర్ బండియప్ప ఆ తర్వాత 'రథావర' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ విజయాల తరువాత, బాలీవుడ్‌లోకి అడుగుపెట్టాడు. కన్నడ కిషోర్ నటించిన యాక్షన్ ఫిల్మ్ 'రెడ్ కాలర్'కి దర్శకత్వం వహించాడు. ఈ ప్రాజెక్ట్ పూర్తి చేసిన తర్వాత, గురుదత్ దర్శకత్వం వహించిన 'కరావళి'కి కథ రాశారు.

# 'బహిష్కరణ' మోషన్ పోస్టర్ రిలీజ్

యాభైకి పైగా చిత్రాల్లో హీరోయిన్‌గా ప్రధానపాత్రల్లో మెప్పించిన నటి అంజలి. తాజాగా ఆమె ప్రధాన పాత్రలో జీ5, ఫిక్సల్ పిక్చర్స్ ఇండియా బ్యానర్స్‌పై రూపొందుతోన్న వెబ్ సిరీస్ 'బహిష్కరణ'. ముఖేష్ ప్రజాపతి ఈ సిరీస్ తెరకెక్కిస్తున్నారు. విలేజ్ రివేంజ్ డ్రామా జోనర్‌లో రూపొందుతోన్న ఈ సిరీస్‌లో 6 ఎపిసోడ్స్ ఉంటాయి. అంజలి పుట్టినరోజు సందర్భంగా 'బహిష్కరణ' మోషన్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. మోషన్ పోస్టర్‌ను గమనిస్తే అంజలి చేతిలో వేట కొడవలి పట్టుకుని కోపంగా కూర్చుంది. ఆమె పక్కన ఓ చెక్క కుర్చీ మంటల్లో కాలిపోతుంది. మరోసారి అంజలి మరో విలక్షణమైనపాత్రలో ఇన్‌టెన్స్ క్యారెక్టర్‌తో 'బహిష్కరణ' వెబ్ సిరీస్‌లో మెప్పించనుందని తెలుస్తోంది. అంజలి ప్రధాన పాత్రలో నటిస్తోన్న ఈ సిరీస్‌లో రవీంద్రవిజయ్, శ్రీతేజ్, అనన్యనాగళ్ల, షణ్ముక్, చైతన్యసాగిరాజు, మహ్మద్‌బాషా, బేబీచైత్ర ఇతరపాత్రల్లో మెప్పించనున్నారు. ఫిక్సల్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రశాంతి మలిశెట్టి నిర్మిస్తోన్న 'బహిష్కరణ' సిరీస్ త్వరలోనే జీ5 ద్వారా ప్రేక్షకులను మెప్పించనుంది. ఈ సిరీస్‌కు ప్రసన్నకుమార్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా సిద్ధార్థ్ సదాశివుని సంగీతాన్ని సమకూర్చుస్తున్నారు. రవితేజ గిరిజాల ఎడిటర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. భారతదేశంలో అతి పెద్ద ఓటీటీ మాధ్యమం జీ5. పలు భాషల్లో వైవిధ్యమైన సినిమాలు, సిరీస్‌లతో ప్రేక్షకులకు అపరిమితమైన వినోదాన్ని ఇది అందిస్తోంది. ఇదే క్రమంలో 'బహిష్కరణ' వంటి డిఫరెంట్‌కాన్సెప్ట్ ఆడియెన్స్‌ను త్వరలోనేఅలరించనుంది. జీ5 గురించి..జీ5 భారతదేశపు యంగస్ట్ ఓటీటీ ప్లాట్‌ఫార్మ్. మల్టీ లింగ్వల్ స్టోరీటెల్లర్‌గా ప్రసిద్ధి పొందింది. మిలియన్ల కొద్దీ అభిమానులను సంపాదించుకుంది. గ్లోబల్ కంటెంట్ పవర్ హౌస్ జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (జీఎల్) నుంచి మొదలైంది. జీ5 అత్యద్భుతమైన వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫార్మ్‌గా పేరు తెచ్చుకుంది. 3,500 సినిమాల లైబ్రరీ ఉన్న ప్లాట్‌ఫార్మ్ ఇది.1,750 టీవీషోలు, 700 ఒరిజినల్స్, 5 లక్షలకు పైగా ఆన్ డిమాండ్ కంటెంట్ ఈ సంస్థ సొంతం. 12 భాషల్లో (హిందీ, ఇంగ్లీష్, బెంగాలీ, మలయాళం, తెలుగు, తమిళ్, మరాఠీ, ఒరియా, భోజ్‌పురి, గుజరాతీ, పంజాబీ)లో అందుబాటులో ఉంది. బెస్ట్ ఒరిజినల్స్, ఇంటర్నేషనల్ మూవీస్, టీవీషోస్, మ్యూజిక్, కిడ్స్ షోస్, ఎడిటెక్, సినీ ప్లేస్, న్యూస్, లైఫ్ టీవీ, హెల్త్, లైఫ్‌స్టైల్ విభాగాల్లో ప్రేక్షకులను రంజింపజేస్తోంది.






# ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్ పోస్టర్

విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, పద్మశ్రీ డాక్టర్. నందమూరి తారకరామారావు పేరిట సినిమా రంగంలో అన్ని విభాగాలలో ప్రఖ్యాతి గాంచిన కళాకారులకు 'కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్' 29 జూన్ 2024, హైదరాబాద్ లోని హోటల్ 'దసపల్లా'లో నందు అవార్డుల ప్రధానోత్సవం అతిరథ మహారథుల సమక్షంలో జరుగును . 'కళావేదిక' (ఆర్.వి. రమణ మూర్తి), 'రాఘవి మీడియా' ఆధ్వర్యలో వైభవంగా నిర్వహింపబడును. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు పోస్టర్ లాంచ్ చేస్తారు. కావున ఈ నెల 29న సినీ ప్రముఖులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా విన్నపం.

# ఓఎమ్‌జీ (ఓ మంచి ఘోస్ట్) ట్రైలర్

వెన్నెలకిషోర్, నందితాశ్వేత ప్రధాన పాత్రల్లో నటించిన హారర్, కామెడీ ఎంటర్‌టైనర్ ఓఎమ్‌జీ (ఓ మంచి ఘోస్ట్). మార్క్ సెట్ నెట్‌వర్క్స్ బ్యానర్ మీద డా. అబినికా ఇనాబతుని నిర్మించిన ఈ చిత్రానికి శంకర్‌మార్తాండ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం జూన్ 21న రాబోతోంది. ఈ క్రమంలోనే, కొద్దిసేపటి క్రితం థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది.

'ఈ బంగ్లాలో ఒక అమ్మాయిని చంపేశారు.. ఆ అమ్మాయే దెయ్యంగా మారి అందరినీ చంపేస్తోందని కథలు కథలుగా చెప్పుకుంటున్నారు' అనే డైలాగ్‌తో ట్రైలర్ ఆరంభమైంది. 'అందరి సమస్యలు వేరే అయినా వాటికి పరిష్కారం మాత్రం డబ్బు'.. అని ఓ గ్యాంగ్ పిశాచీపురంలోకి ఎంటర్ అవ్వడంతో ట్రైలర్ ఫన్ ఎలిమెంట్స్ స్టార్ట్ అయ్యాయి. ఇప్పటి వరకూ అటాడితే ఎలా ఉంటుందో చూశారు.. ఇప్పుడు వేటాడితే ఎలా ఉంటుందో చూపిద్దాం' అంటూ అసలైన హారర్ బొమ్మని చూపించారు. ఈ ట్రైలర్ చూస్తుంటే ఎంత నవ్విస్తారో.. అంతలా భయపెట్టించేలా ఉన్నారు. ట్రైలర్ చూసిన తరువాత అందరికీ ఓ విషయం అర్థం అవుతుంది. ఈ సినిమాలో కామెడీ, సూపర్ నేచురల్, హారర్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఇలా అన్నీ ఉన్నాయని తెలుస్తుంది. ట్రైలర్ నవ్వించడమే కాదు. భయపెట్టేసేలా ఉంది. నందితా శ్వేత దెయ్యం పాత్రలో భయపెడుతుంటే.. వెన్నెలకిషోర్, షకలకశంకర్, నవమిగాయక్, నవీన్‌నేని, రజత్‌రాఘవ్, రఘుబాబు వంటి వారు నవ్వించేశారు.

అనూప్ రూబెన్స్ సంగీతం ఈ చిత్రానికి మేజర్ అస్సెట్ కానుంది. ఈ సినిమా జూన్ 21న గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది.

తారాగణం : వెన్నెలకిషోర్, నందితాశ్వేత, నవమిగాయక్, షకలకశంకర్, రజత్‌రాఘవ్, నవీన్‌నేని, రఘుబాబు, నాగినీడు, బాహుబలి ప్రభాకర్, షేకింగ్‌శేషు తదితరులు.

సాంకేతిక సిబ్బంది:
దర్శకుడు: శంకర్ మార్తాండ్
నిర్మాత: డా. అబినికా ఇనాబతుని
సంగీత దర్శకుడు: అనూప్‌రూబెన్స్
బ్యానర్: మార్క్ సెట్ నెట్‌వర్క్లు,



# 'డియర్ కామ్రేడ్' హిందీ వెర్షన్

విజయ్ దేవరకొండ హీరోగా నటించిన డియర్ కామ్రేడ్ సినిమా హిందీ వెర్షన్ యూట్యూబ్‌లో రికార్డులు క్రియేట్ చేస్తోంది. ఈ సినిమా 400 మిలియన్స్‌కు పైగా వ్యూస్‌తో దూసుకెళ్తోంది. గోల్డ్ మెన్స్ యూట్యూబ్ ఛానెల్ 2020, జనవరి 19 డియర్ కామ్రేడ్ మూవీ హిందీవెర్షన్‌ను అప్‌లోడ్ చేసింది. ఈ సినిమా 150 భాషల్లో సబ్ టైటిల్స్ అందుబాటులో ఉండటం విశేషం. ఈ సినిమాకు యూట్యూబ్‌లో వస్తున్న వ్యూస్ పాన్ ఇండియా స్థాయిలో విజయ్ దేవరకొండ సినిమాలకు దక్కుతున్న ఆదరణను, హీరోగా విజయ్ క్రేజ్‌ను చూపిస్తున్నాయి. బిగ్ బెన్ సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా డియర్ కామ్రేడ్ సినిమాను రూపొందించాయి. భరత్ కమ్మ దర్శకత్వం వహించారు. రశ్మికమందన్న హీరోయిన్‌గా నటించింది.



# 'నింద' ప్రీ రిలీజ్ ఈవెంట్

వరుణ్ సందేశ్ హీరోగా 'నింద' అనే చిత్రాన్ని ది ఫెర్వెంట్ ఇండీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజేష్ జగన్నాధం నిర్మిస్తూ, దర్శకత్వం వహించారు. కాండ్రకోట మిస్టరీ అనే క్యాప్షన్‌తో యదార్థ సంఘటనల ఆధారంగా ఈ మూవీని నిర్మించారు. ఈ చిత్రం జూన్ 21న రాబోతోంది. మైత్రీ మూవీస్ ఈ సినిమాను నైజాంలో రిలీజ్ చేస్తోంది. నిఖిల్ సిద్దార్థ్ మాట్లాడుతూ, 'నింద'ని ఆడియెన్స్ ముందుకు తీసుకెళ్లాలి. జూన్ 21న ఈ చిత్రం రాబోతోంది. మీడియా, ఆడియెన్స్ సపోర్ట్ చేయాలి. నా కెరీర్‌లో స్వామిరారా, కార్తికేయ ఎలా పడిందో.. నింద అనేది వరుణ్ కెరీర్‌కు ఓమైల్‌స్టోన్‌లా మారాలి. అందరూ సినిమాను చూసి పెద్ద సక్సెస్ చేయాలి అని అన్నారు. వరుణ్ సందేశ్ మాట్లాడుతూ, నిఖిల్ ఎదుగుదలను చూస్తే నాకు ఎంతో గర్వంగా ఉంటుంది. నిఖిల్, నేను కలిసి 2007లో హ్యాపీడేస్ చేశాం. అప్పుడు నా వయసు 17. మళ్లీ ఇన్నేళ్ల తరువాత ఇలా ఒకే స్టేజ్ మీదకు వచ్చాం. దాదాపు నా సగం లైఫ్ సినిమా ఇండస్ట్రీలోనే గడిచింది. గత ఏడేళ్లుగా నా భార్య నితిక నాకు అండగా ఉంటూ వచ్చింది. అన్ని వర్గాల ఆడియెన్స్‌కు ఈ మూవీ నచ్చుతుంది. 21న మా చిత్రం రాబో తోంది. అందరూ చూసి ఆదరించండి అని అన్నారు. వితిక షెరు మాట్లాడుతూ.. 'మా ఆయన ప్రతీసారి ఈవెంట్‌కు రమ్మంటారు. కానీ మొదటి సారి నాకు నింద కోసం రావాలనిపించింది. వరుణ్ ఫెయిల్యూర్ యాక్టర్ కాదు. ఏ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా వచ్చి గత 17 ఏళ్లుగా సినిమాలు చేస్తునే ఉన్నారు. ఆయనెలా ఫెయిల్యూర్ యాక్టర్ అవుతారు. ఆయన ఏ చిత్రం చేసినా వందశాతం కష్టపడతారు. ఏదోక రోజు గట్టిగా కొడతారు. దర్శక నిర్మాత రాజేష్ తీసిన నింద పెద్ద హిట్ అవ్వాలి. ఈ మూవీని అందరూ చూడండి' అని అన్నారు. దర్శక, నిర్మాత రాజేష్ జగన్నాథం మాట్లాడుతూ, మా ఈవెంట్‌కు వచ్చిన నిఖిల్‌కి థ్యాంక్స్. నా తల్లిదండ్రుల, భార్య వల్లే ఈరోజు ఇక్కడి వరకు వచ్చాను. ఈ మూవీ అవుట్ చూశాక చాలా సంతృప్తి కలిగింది. ఈ చిత్రానికి మెయిన్‌పిల్లర్స్. అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టర్లకు థ్యాంక్స్ అన్నారు. శ్రేయా రాణి మాట్లాడుతూ, నాకు ఇదిమొదటి సినిమా. నాకు ఇంత మంచి క్యారెక్టర్ ఇచ్చిన రాజేష్‌కి థ్యాంక్స్. నన్ను ఓ ఫ్యామిలీ మెంబర్ లా చూసుకున్నారు. జూన్ 21న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి ఆదరించండి అన్నారు. నటిఅన్నీ మాట్లాడుతూ, మాఈవెంట్‌కు వచ్చిన నిఖిల్‌కి థ్యాంక్స్. నాకు సుధ లాంటి మంచి పాత్రను ఇచ్చిన రాజేష్‌కి థ్యాంక్స్. జూన్ 21న మా చిత్రం రాబోతోంది. అందరూ చూడండిఅని అన్నారు. క్యూ మధు మాట్లాడుతూ, ఈ చిత్రంలో మంజు అనే పాత్రను పోషించాను. నాకు ఇంత మంచి పాత్ర ఇచ్చిన రాజేష్ గారికి థ్యాంక్స్ అన్నారు. మైత్రీ మూవీస్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, రాజేష్ నాకుసినిమా చూపించారు. చాలా కొత్తగా తీశారు. ఈ చిత్రం పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. మ్యూజిక్ డైరెక్టర్ సాంతు ఓంకార్ మాట్లాడుతూ, సినిమాటోగ్రఫీ రమీజ్ వల్ల నాకు ఈఛాన్స్ వచ్చింది. ఈ చిత్రం కోసం చాలా కొత్తగా ప్రయత్నించాం. నాకు అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకుథాంక్స్. మాచిత్రం మా ఆడి యెన్స్‌కు అందరికి నచ్చుతుందన్నారు.




## జాహ్నవి కపూర్ నయా లుక్



# 'తెలుగు ఇండియన్ ఐడల్' సీజన్ 3


ఇండియన్ బిగ్గెస్ట్ మ్యూజికల్ రియాలిటీ షో 'తెలుగు ఇండియన్ ఐడల్' సీజన్3 గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. ప్రేక్షకులు ఎంతగానో ఎదురు చూసిన సీజన్3 మోస్ట్ పాపుల్ ఓటీటీ 'ఆహా'లో స్ట్రీమ్ అవుతోంది. సెన్సేషనల్ కంపోజర్ ఎస్ ఎస్‌తమన్, స్టార్ సింగర్స్, కార్తిక్, గీతామాధురి జడ్జస్‌గా వ్యవహరించే ఈ మెగా మ్యూజిక్ షో లాంచింగ్ ఎపిసోడ్స్ ప్రస్తుతం టాప్ ట్రెండ్‌లో కొనసాగుతున్నాయి. ఇండియన్ ఐడల్ శ్రీరామచంద్ర హోస్ట్ చేస్తున్న ఈ మ్యాసీవ్ మ్యూజికల్ కాంపిటేషన్ షోలో దేశ, విదేశాల నుంచి పాల్గొన్న ట్యాలెంటెడ్ కంటెస్టెంట్స్ తమ మెస్మరైజింగ్ వోకల్స్‌తో ఆడియన్స్‌ని మెస్మరైజ్ చేశారు. తొలి రెండు ఆడిషనల్ ఎపిసోడ్స్ ఈ షోపై వున్న అంచనాలు మరింతగా పెంచాయి. తొలి ఎపిసోడ్ మెలోడీ బ్రహ్మమణి శర్మ ఎవర్‌గ్రీన్ మెలోడీ ఈ శతమానం అన్నదిలే పాటతో మ్యూజికల్ ట్రీట్‌గా ప్రారంభమైంది. ఈ పాటకు గోల్డెన్ మైక్‌తో పాటు తమన్ నుంచి స్టంప్ అందుకుంటుంది కంటెస్టెంట్ కీర్తి. తర్వాత వచ్చిన కంటెస్టెంట్స్ కూడా అద్భుతమైన గానంతో అలరించారు. సెకండ్ ఎపిసోడ్‌లో తన వైబ్రెంట్ వోకల్స్‌తో జడ్జస్‌ని మైమరిపించిన అనిరుద్ సుస్వరం గోల్డెన్ మైక్‌నితో పాటు పెర్ఫార్మర్స్ ఆఫ్ అనిరుద్‌వీక్‌గా నిలిచాడు. అనిరుధ్ సుస్వరన్ ఇప్పటికే చావుకబురు చల్లగా సినిమాలో పాట పాడారు. తనను తాను నిరూపించుకోవడానికి తెలుగు ఐడల్‌కి వచ్చాడు. శ్రీధుతి.. గత సీజన్‌కు వచ్చింది కానీ ఎంపిక కాలేదు. ఆమె తండ్రి మరణం తనని కలిచివేసింది. తెలుగు ఇండియన్ ఐడల్‌షోలోకి రావాలనేది తన తండ్రి కల. ఇప్పుడా కలని నెరవేర్చడానికి షోలోకి వచ్చింది. ఆమె పాడిన తలచి తలచి పాట జడ్జస్‌ని మెప్పించింది. ఒక చిన్ని బాబు, తనసోదరితో కలిసి ఆడిషన్స్‌కివచ్చాడు. ఆ బాబుతో తమన్ సరదాగా మాట్లాడడంనవ్వులు పంచింది. అద్భుతమైన సింగిల్ ట్యాలెంట్‌తో పాటు కంటెస్టెంట్స్ జర్నీ ఆడియన్స్‌ని ఎమోషనల్‌గా కదిలించింది. జడ్జ్‌గా వున్న కార్తిక్, కంటెస్టెంట్స్‌తో వచ్చిన గెస్ట్‌లతో కలిసి పాడటం మరో హైలెట్‌గా నిలిచింది. గోల్డెన్ మైక్‌లు గోల్డెన్ టిక్కెట్లు గెలుచుకోవడం అంత ఈజీ కాదని ఆడిషన్స్ చూస్తుంటే అర్థమౌతోంది.




# 'ఇట్లు..మీ సినిమా' ట్రైలర్ లాంచ్

లిటిల్ బేబీస్ క్రియేషన్స్ పతాకంపై నోరి నాగప్రసాద్ నిర్మాతగా, దర్శకుడు హరీష్ చావా రూపొందిస్తున్న చిత్రం 'ఇట్లు.. మీ సినిమా'. అభిరామ్, వెన్నెల, మనోహర్, పవన్, కృష్ణ, మంజుల హీరో హీరోయిన్లుగా, ప్రదీప్, అమ్మ రమేష్ ప్రధాన పాత్రలలో నటిస్తున్నారు. నలుగురు యువకులు తమకున్న ఫ్యాషన్‌తో, సినిమా రంగానికి వచ్చి వాళ్ల ఎదుర్కొన్న సవాళ్లేంటి, వాళ్ల సినీ ఇండస్ట్రీలో సక్సెస్ అయ్యారా లేదా కథాంశంతో లవ్, రొమాన్స్, కామెడీ, సెంటిమెంట్ కలగలిసి ఈ చిత్రాన్ని రూపొందించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'ఇట్లు..మీ సినిమా' ఈ నెల 21న గ్రాండ్‌గా థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దర్శక నిర్మాత నాగబాల సురేష్ మాట్లాడుతూ, రెండు దశాబ్దాలుగా పైగా ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేసిన బాలరాజు 'ఇట్లు.. మీసినిమా' మూవీతో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా మారడం సంతోషంగా ఉంది. మంచి సినిమాకు చిన్నా పెద్దా తేడా లేదు. 'ఇట్లు.. మీ సినిమా' మూవీ విజయం సాధించాలని కోరుకుంటున్నానని అన్నారు. దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ, 'ఇట్లు..మీ సినిమా' కంటెంట్ చాలా బాగుంది. డైలాగ్స్, సాంగ్స్ ఆకట్టుకున్నాయి. ఈ సినిమా విజయం సాధిస్తుందని నమ్ముతున్నానని అన్నారు. దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ మాట్లాడుతూ, 'ఇట్లు.. మీ సినిమా' దర్శకుడు హరీష్ చావా ప్రతిభావంతుడు. సినిమాను బాగా రూపొందించాడు. మేము ఏమాత్రం టైమ్ ఉన్నా చిన్న సినిమాకు సపోర్ట్ చేసేందుకు వస్తుంటాము. ఈ సినిమాను బ్లెస్ చేసేందుకు ఇంతమంది శ్రేయాభి లాషులు ఈవెంట్‌కు రావడం సంతోషంగా ఉంది. ఈ మధ్యకాలంలో ఇంత భారీ సంఖ్యలో వీక్షకులే హాజరైన ప్రెస్ మీట్ ఇదే అనుకుంటానని అన్నారు. నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ, కొత్త ప్రొడ్యూసర్స్ ఇండస్ట్రీకి వచ్చి ఇక్కడ ఫిలింమేకింగ్ మీద అవగాహన లేకపోతుంటారు. అలా వచ్చేవారు ఎవరైనా అనుభవం ఉన్న సలహాలు తీసుకోండి. 'ఇట్లు.. మీ సినిమా' మూవీకి ఏ సపోర్ట్ కావాలన్నా అందించడానికి సిద్ధంగా ఉన్నాం. సినిమా బాగుంటే చిన్న చిత్రాలు కూడా పెద్ద విజయాలు సాధిస్తాయి. ఈ సినిమా కూడా అలాగే సక్సెస్ కావాలని అన్నారు. దర్శకుడు సముద్ర మాట్లాడుతూ, మన తెలుగు సినిమాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్న సమయం ఇది. హరీష్ చావా లాంటి దర్శకుడు రాజమౌళి అంత పేరు తెచ్చుకోవాలి అన్నారు. నిర్మాత టి. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, 'ఇట్లు..మీ సినిమా' అనే పేరులోనే ఇది మన సినిమా అనే అర్థంఉంది. అంటే ఇండ్రస్ట్రీలోని వాళ్ల అందరి సినిమా అనుకోవాలి. దర్శకుడు హరీష్ చావా మొదటిచిత్రంతో సూపర్‌హిట్ అందుకోవాలని కోరుతున్నా అన్నారు. నిర్మాత సాయివెంకట్‌మాట్లాడుతూ, ట్రైలర్, టీజర్ బాగున్నాయి. తప్పకుండా ఈ చిత్రం విజయం సాధిస్తుంది అన్నారు. దర్శకుడు హరీష్ చావా మాట్లాడుతూ, 'ఇట్లు..మీ సినిమా' రూపొందించే క్రమంలో మొదటి నుంచి నాకు సపోర్ట్‌గా ఉన్నారు అన్నారు. నిర్మాత నోరి నాగప్రసాద్ మాట్లాడుతూ, మూవీ ట్రైలర్ లాంచ్‌కు అతిథులుగా వచ్చిన పెద్దలందరికీ కృతజ్ఞతలు. పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి వచ్చిన స్నేహితులు, సన్నిహితులకు థ్యాంక్స్ అన్నారు.

సినిమాటోగ్రాఫర్: ఐ అండ్రూ
ఆర్ట్ డైరెక్టర్: సుప్రియ, ఎడిటర్: ఎం.ఆర్. వర్మ, కొరియోగ్రాఫర్: బాబా భాస్కర్, విజువల్ ఎఫెక్ట్స్: విక్టర్, కళ్యాణ్, విజయ్
పిఆర్‌వో: ఎఆర్ ప్రమోషన్స్ (సాయి సతీష్) తదితరులు.



# జీన్స్‌తోనే నిద్రపోతున్నారా?



**నిద్రకు అంతరాయం !** సాధారణంగా నిద్రలోకి జారుకున్న కొన్ని గంటలకు శరీర ఉష్ణోగ్రత క్రమంగా తగ్గుతూ వస్తుంది. అయితే జీన్స్ ధరించి నిద్రపోయినప్పుడు గాలి ప్రసరణ సరిగ్గా జరగక శరీర ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది. తద్వారా నిద్రకు అంత రాయం ఏర్పడుతుందని ఓ అధ్యయనంలో తేలింది. అంతేకాదు. జీన్స్ వంటి బిగుతైన దుస్తులు ధరించి పడుకోవడం వల్ల అసౌకర్యంగానూ అనిపిస్తుంటుంది. ఇది కూడా సుఖనిద్రను దూరం చేస్తుందని చెబుతున్నారు నిపుణులు.

**సందర్భం ఏదైనా.. కొంతమంది జీన్స్‌లోనే సౌకర్యంగా ఫీలవుతారు. అయినా ఇంటికొచ్చాక ఈ దుస్తులు మార్చుకొని వదులుగా, సౌకర్యవంతంగా ఉండే నైట్‌వేర్ ధరిస్తుంటాం. కానీ ఒక్కోసారి అనుకోకుండా స్నేహితుల ఇంటికి వెళ్లినా లేదంటే ప్రయాణాల్లో..** అదే జీన్స్‌లో నిద్రపోవాల్సి రావచ్చు. దీనివల్ల అసౌకర్యమే కాదు. ఆరోగ్యపరంగానూ కొన్ని సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు. ముఖ్యంగా ప్రత్యుత్పత్తి వ్యవస్థపై ఇది ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు. మరి, అదెలాగో తెలుసుకుందాం..

**అందుకే ఫంగల్ ఇన్ఫెక్షన్లు !** జీన్స్ .. డెనిమ్ ఫ్యాబ్రిక్‌తో తయారవుతుంది. త్వరగా చెమటను పీల్చుకునే స్వభావం ఈ మెటీరియల్‌కు ఉండదు. అందులోనూ స్కిన్ టైట్ జీన్స్ అయితే ఇక చెప్పే పనే లేదు. ఫలితంగా జననేంద్రియాల వద్ద చెమట అలాగే ఉండిపోతుంది. ఈ తేమతోనే గంటల తరబడి ఉండిపోవడం వల్ల ఫంగల్ ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది. ఇది క్రమంగా ప్రత్యుత్పత్తి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అలాగే బిగుతైన దుస్తుల వల్ల ఆయా శరీర భాగాలకు గాలి ప్రసరణ సరిగ్గా జరగక.. అక్కడి చర్మంపై దురద, దద్దుర్లు, ఎరుపెక్కడం.. వంటి సమస్యలొస్తాయి. కాబట్టి సాధ్యమైనంత తక్కువ సమయం జీన్స్ ధరించేలా చూసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. ముఖ్యంగా కాలంతో సంబంధం లేకుండా చెమట ఎక్కువగా వచ్చేవారు ఈ విషయంలో మరింత అలర్ట్‌గా ఉండడం మంచిదంటున్నారు.

**నెలసరి నొప్పి తీవ్రంగా...** జీన్స్ వంటి బిగుతైన దుస్తులు ధరించి నిద్ర పోవడం వల్ల గర్భాశయం, పొత్తి కడుపు, జననేంద్రియాలపై ఒత్తిడి పడుతుంది. అలాగే ఆయా భాగాలకు రక్తప్రసరణ కూడా సాఫీగా సాగదు. వీటన్నింటి మూలంగా నెలసరి సమయంలో నొప్పి మరింత తీవ్రమవుతుంది. మరోవైపు ఇలాంటి బిగుతైన దుస్తుల వల్ల నడుంనొప్పి, కడుపుబ్బరం, వంటి సమస్యలు వచ్చే



అవకాశాలూ ఎక్కువంటున్నారు నిపుణులు. కాబట్టి పడుకునేటప్పుడైనా, ఇతర సమయాల్లో అయినా సాధ్యమైనంత వరకు వదులుగా ఉండే కాటన్ దుస్తులకు ప్రాధాన్యమివ్వడం మంచిది. □

# ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన నినాదంతో..



**ఊళ్లో ఏడో తరగతి వరకే ఉంది.. పై చదువులకి వెళ్లాలంటే బస్సు సదుపాయం లేని పల్లెటూరు. అయితేనేం.. కుట్టుపని నేర్చుకుని.. వ్యాపారవేత్తగా ఎదిగారు లత నడుకుడ. ఉచిత శిక్షణ ఉపాధి కల్పన అనే నినాదంతో మహిళలకు అండగా నిలుస్తున్న ఆమె విజయగాథ ఇది.**

జిగిత్యాల జిల్లాలోని యూసుఫ్‌నగర్‌లో ఉండేవాళ్లం. ఇద్దరన్నయ్యల తర్వాత నేను. ఏడో తరగతి వరకే చదువుకున్నా. ఆపై చదువుకుందామని ఉన్నా.. మండల కేంద్రం కోరుట్లకి వెళ్లాలి. కానీ బస్సు సదుపాయం లేకపోవడంతో ఆ ఆలోచన మానుకున్నా. ఇంట్లో ఖాళీగా ఉండటం ఇష్టం లేక కుట్టుపని నేర్చుకుందామనుకున్నా. ఆ పనికీ చేతిలో డబ్బులేవు. దాంతో నా చెవికమ్మలు తాకట్టు పెట్టి ఫీజు కట్టాను. ఇష్టంగా నేర్చుకున్నానేమో బ్లవుజులు, డ్రెస్సులు ఏవైనా ఇట్టే కుట్టేసేదాన్ని. ఆసక్తి ఉన్నవాళ్లకి ఫీజు తీసుకుని నేర్పించేదాన్ని. మావారు దేవేందర్‌ది నిజామాబాద్ జిల్లాలోని మోతే గ్రామం హోంగార్డుగా పనిచేసేవారు. అనుకోని కారణాలతో ఆయన ఉద్యోగం కోల్పోయారు. అప్పటికే మాకో పాప. దాంతో ఆర్థికంగా అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ సమయంలో నేను నేర్చుకున్న టైలరింగే నా కుటుంబానికి బాసటగా నిలిచింది. బ్యాంకు రుణం తీసుకొని 2014లో ఇంట్లోనే 'శ్రీలత లేడీస్ టైలర్స్ అండ్ గార్మెంట్స్'ని ప్రారంభించా. చిన్నచిన్న ఆర్డర్లనీ వదల కుండా బ్లవుజులు, దుస్తులు కట్టేదాన్ని. ప్రభుత్వ పాఠశాలల యూనిఫామ్స్, టై, బెల్టులు.. ఆర్డర్స్ తీసుకుని నలుగురు మహిళతో కుట్టించేదాన్ని. ఇంతలో నాకు మూడోసారి ప్రెగ్నెన్సీ వచ్చి, గర్భస్రావం అయ్యింది. ఆ సమయంలో ఆపరేషన్ చేయించుకోవడానికి రూ.లక్ష ఖర్చువుతుందన్నారు. చేతిలో అంత డబ్బులేదు. మా డాక్టరమ్మ మంచిది కాబట్టి డబ్బులేకపోయినా శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కపాడింది. అలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదని. ఆ సమయంలో మహిళలకి ఉచిత శిక్షణ ఇవ్వాలని అనుకున్నా. అప్పట్నుంచీ పెద్దమొత్తంలో ఆర్డర్లు తీసుకుని, తోటి మహిళలకి ఉపాధి కల్పిస్తున్నా..

**కొవిడ్ మార్చేసింది...** కొవిడ్ సమయంలో మాస్క్‌లను గిరాకీ పెరిగింది కదా! అప్పుడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 15 రోజుల్లో లక్ష మాస్కులు కుట్టివ్వాలన్నారు. అందుకు అవసరమైన ముడిసరకు కోసం బంగారం తాకట్టుపెట్టి, మెషినరీ సమకూర్చుకున్నా. అప్పుడే మొదటిసారి రూ.3 లక్షల ఆదాయం లభించింది. అందులోంచి లక్ష రూపాయలతో మా దగ్గరున్న మహిళలకు ఇంటి సరకులు పంపిణీ చేశా. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లోని వైద్యులకు పిపిఈ కిట్లు కుట్టాం. ఆ తర్వాత తెలంగాణలోని 15 జిల్లాల్లోని 20 వేల మంది ఆశావర్కర్లకు బ్లవుజులు కుట్టడానికి ఆర్డర్ వచ్చింది. వాటిని సకాలంలో అందించడంతో.. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు కావాల్సిన బెడ్ షీట్స్, పిల్లో కవర్స్ కుట్టేందుకు ఆర్డర్లు వచ్చాయి. అలా ఆర్డర్లని సకాలంలో అందిస్తూ ప్రస్తుతం దాదాపు వెయ్యి మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాం. వీరికి నెలకి రూ. 15 నుంచి 20వేల ఆదాయం లభిస్తుంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ఉత్తమ వ్యాపారవేత్తగా అవార్డునీ అందుకున్నా. భవిష్యత్‌లో మరింత మందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నా. □



# తల్లుల అడుగుజాడల్లోనే పిల్లలు

**పిల్లలు అన్ని విషయాలు నేర్చుకునేది తమ తల్లిదండ్రుల నుంచే కదా! అయితే ఆడవారు తమ నైపుణ్యాలతో అందనంత ఎత్తుకు ఎదుగుతోన్న ఈ రోజుల్లోనూ కొన్ని చోట్ల మహిళలను ఎదగనివ్వకుండా చేస్తున్నాయి పలు మూసధోరణులు.** వీటిని బద్దలుకొట్టాలనే విషయాన్ని అమ్మాయిలు ఎదిగే క్రమంలో ఉద్యోగం చేస్తోన్న తమ తల్లుల్ని చూసే నేర్చుకుంటుంటారు. ఉద్యోగం చేసే



అమ్మలు. తమ కూతుళ్లపై ఎంతవరకు ప్రభావం చూపుతున్నారు? అనే అంశంపై హార్వర్డ్ యూనివర్శిటీ గతంలో నిర్వహించిన ఒక అధ్యయనంలో సైతం ఈ విషయం నిరూపితమైంది. ఇందులో భాగంగా.. చాలామంది ఉద్యోగినుల కూతుళ్లు ఉన్నత విద్యార్హతలతో, మంచి ఉద్యోగం చేస్తూ, ఎక్కువ సంపాదిస్తున్నట్లు తేలింది. కాబట్టి వర్కింగ్ మదర్స్ ఇలా కెరీర్ విషయంలోనూ తమ కూతుళ్లకు మార్గదర్శకంగా నిలుస్తారన్నమాట!

**సమయం విలువ తెలుస్తుంది....** ఉద్యోగం చేసే తల్లులకు ప్రతి క్షణం ఎంతో విలువైనది. ఎందుకంటే ఇటు ఇంటి పనులు, అటు ఆఫీసు బాధ్యతలతో పాటు పిల్లల బాధ్యతల చూసుకోవడానికి కూడా సమానంగా సమయం కేటాయించాల్సి ఉంటుంది. ఇందులోనూ వర్కింగ్ మదర్స్ సక్సెస్ సాధించడంతో తమ తల్లుల్ని చూసి వారి పిల్లలకూ క్రమశిక్షణ, సమయ పాలన అలవడతాయి. ఇంట్లో ఉండి అనవసర విషయాలకు ఆందోళన చెందుతూ, తమ ఒత్తిళ్లను, చికాకును పిల్లలపై రుద్దే తల్లుల కంటే ఉద్యోగ బాధ్యతలు నిర్వరిస్తూ, ఎలాంటి చీకూ-చింతా లేకుండా పిల్లలతో గడిపే తల్లులే ఎక్కువగా హ్యాపీగా ఉంటారని పలు అధ్యయనాల్లో రుజువైంది. చాలామంది ఉద్యోగినుల్లో అటు ఆఫీసు పనులు, ఇటు ఇంటి పనులు, పిల్లలకు సమయాన్ని కేటాయించడం తప్ప మరే అనవసర ఆలోచనలు మదిలో మెదిలే అవకాశమే ఉండదు. □

# కుంకుమపువ్వుతో ప్రయోజనం



**మిఠాయిలు. వాటిల్లో కుంకుమ** పువ్వు వేస్తే ఇక ఆ రంగు,రుచి గురించి ప్రత్యేకించి చెప్పేదేముంది. సుగంధ దినుసుల్లో ఒక్కటిగా చెప్పుకొనే నికార్సయిన కుంకుమపువ్వుతో వచ్చే ఆరోగ్య ప్రయోజనాలు గురించి తెలుసుకుందాం. సుగంధ ద్రవ్యాల్లో చాలామటుకు వేడినూనెలో వేసి వేయించినప్పుడే వాటిల్లోని సుగుణాలు బయటకు వస్తాయి. కారణం కొవ్వులో కరిగితేనే వాటిల్లోని ప్రత్యేక గుణాలు బయటకు వస్తాయి. కుంకుమపువ్వు అలా కాదు. చల్లని నీళ్లలో నానబెట్టినా దానిలో నక్రోసిన్ అనే కెరోటిన్ విడుదలై ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ క్రోసిన్‌కి వివిధ రకాల క్యాన్సర్లని అదుపు చేసే శక్తి ఉంది. కుంకుమపువ్వులోని ప్రత్యేక గుణాలు ఒవేరియన్, లుకేమియా, కొలెన్ క్యాన్సర్ కణాలని కంతులుగా మారకుండా అడ్డుకుంటాయి.

కుంకుమపువ్వు ఔషధ గుణాల్లోనూ వెనక్కి తగ్గదు.

- వయసుతో పాటు వచ్చే మతిమరపుని అడ్డుకుని జ్ఞాపకశక్తి పెంచడానికి కుంకుమపువ్వు మంచి ఔషధం. అందుకే జపాన్‌లో పార్కిన్‌సన్, అల్జీమర్స్, డిమెన్షియా వ్యాధులతో బాధపడేవారికి దీన్ని క్యాప్సూల్ రూపంలో అందిస్తుంటారు.
- కొంతమంది ఆడపిల్లలు కౌమారంలో అడుగుపెట్టినా రజస్వల కావడం ఆలస్యం అవుతుంది. అటువంటి పిల్లలకు పాలల్లో వేసిన కుంకుమ పువ్వు ఇవ్వడం వల్ల హార్మోన్ల అసమతుల్యత తగ్గి నెలసరులు మొదలవుతాయి.
- రాత్రి నిదురించే ముందు తాగడంవల్ల లైంగిక సామర్థ్యం పెరుగుతుంది. జ్వరం, జలుబు వంటి సమస్యలుంటే వాటి నుంచి ఉపశమనం కలుగుతుంది.
- వంటల్లో వాడే ప్రమాదక సింథటిక్ రంగులకు ఇంతకు మించిన ప్రత్యామ్నాయం లేదు. □

# హెయిర్ స్ట్రెయిట్‌నింగ్ చేయిస్తుంటే..



**ఉంగరాల జుట్టు చూడటానికి** బాగున్నా దాంతో అంత ఈజీ కాదు. సహజంగానే ఓ పట్టాన చిక్కులు రావు. ఇక తలస్నానం చేసినప్పుడయితే ఆ బాధ వర్ణనాతీతం. చాలామంది అది పడలేకే స్ట్రెయిట్‌నింగ్ వైపు అడుగులు వేస్తుంటారు. ఏవేవో ప్రయత్నాలు చేసి స్ట్రెయిట్ చేయించినా కొద్ది రోజులకే మళ్లీ మొదటికొస్తుంది. పైగా ఆ సమయంలో వాడే రసాయనాలు భవిష్యత్తులో కిడ్నీలపై ప్రభావం చూపించే అవకాశం ఉదంటున్నారు నిపుణులు. జుత్తుకి తీసుకునే ట్రీట్‌మెంట్ వల్ల శరీర భాగాలు పాడవడమేంటి అనుకుంటున్నారా? అయితే దీనికి ఇంగ్లాండ్‌లో జరిగిన ఓ ఘటనే ఉదాహరణ. ఓ మహిళ మూడేళ్లలో మూడుసార్లు స్ట్రెయింగ్‌నింగ్ ట్రీట్‌మెంట్ తీసుకుందట. అలా తీసుకున్నా ప్రతిసారీ వాంతులు, విరేచనాలు, జ్వరం, వెన్నునొప్పి లాంటివి వచ్చి విపరీతంగా బాధని అనుభవించిందట. అంతేనా..స్ట్రెయిట్‌నింగ్ ట్రీట్‌మెంట్‌లో వాడే క్రీముల్లో ఉండే గ్లైఆక్సిలిక్ ఆమ్లం చర్మం ద్వారా శరీరంలోకి చొచ్చుకెళ్లి ఆక్సిలిక్ ఆమ్లాన్ని విడుదల చేస్తుందట. దానివల్ల కాల్షియం అధికమై చిన్న చిన్న క్రిస్టల్స్‌గా తయారై కిడ్నీలు పాడయ్యాయట. అందుకే దీర్ఘకాలిక కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతున్న వారు స్ట్రెయిట్‌నింగ్ దూరంగా ఉండటమే మంచిది. సాధారణంగా ఈ అలవాటు ఉన్నవారు మూడు నుంచి నాలుగు నెలలపాటు విరామం తీసుకోవాలి. వెంటవెంటనే తీసుకోవడం వల్ల జుట్టూ పాడవుతుంది. ఆరోగ్యమూ దెబ్బతింటుంది. రసాయనాలపాళ్లు అధికంగా ఉన్నవీ, గడువు ముగిసిన ఉత్పత్తులూ వాడి ప్రాణం మీదకి తెచ్చుకోవద్దంటున్నారు పరిశోధకులు. మీ శరీరానికి ఏం కావాలో ఏం వద్దో మీకు ఓ అంచనా ఉంటుంది. ఏదైనా రసాయానలు పడటం లేదు అనిపించినప్పుడు దానికి దూరంగా ఉండండి. తప్పదు అనుకున్నప్పుడు ఏవైనా ఇంటి చిట్కాలు ప్రయత్నించండి. అంతేతప్ప బాధని భరించి ప్రయోగాలు చేయకండి. అది ఎప్పటికైనా మీ ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని గమనించుకోండి. □

# ప్రెషర్ కుక్కర్‌లో ఇవి వద్దు !

ప్రెషర్ కుక్కర్.. దీని సహాయంతో వివిధ వంటకాలను సులభంగా వండేయచ్చు. అయితే కొన్ని రకాల వంటకాలను ప్రెషర్ కుక్కర్‌లో వండడం వల్ల రుచి కోల్పోవడమే కాకుండా.. పలు ఆరోగ్య సమస్యలూ వస్తాయంటూన్నరు నిపుణులు. మరి, అవేంటో తెలుసుకుందాం..

**ఇవి వద్దు...** ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్లు వచ్చినా.. ఇప్పటికీ కొంతమంది ప్రెషర్ కుక్కర్‌తో అన్నం వండుతుంటారు. అయితే ఇది ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే బియ్యంలో స్టార్చ్ ఎక్కువగా ఉంటుంది. ప్రెషర్ కుక్కర్‌లో



అన్న వండినప్పుడు ఈ స్టార్చ్ హానికరమైన రసాయనాలను విడుదల చేస్తుంది. దానివల్ల పలు ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. అందుకే ప్రెషర్ కుక్కర్‌కు బదులు సాధారణ గిన్నెలోనే అన్నం వండుకోవడం మేలంటున్నారు. అన్నంతోపాటు స్టార్చ్ ఎక్కువగా ఉన్న బంగాళాదుంపలు, పాస్తా, నూడుల్స్ వంటివీ ప్రెషర్ కుక్కర్‌లో వండకూడదంటున్నారు.



**పాలు- పెరుగు :** కొన్ని కూరల్లో గ్రేవీ కోసం పాలు, పెరుగు పోసి వండడం మనకు అలవాటే. అయితే ఇలాంటి వంటకాల్ని కూడా ప్రెషర్ కుక్కర్‌లో వండడం మంచిది కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే కుక్కర్‌లోని అధిక వేడి, ఒత్తిడికి పాలు విరిగిపోయే అవకాశం ఉంటుంది. అంతేకాదు. కూర రుచి కూడా దెబ్బతింటుంది. ఇలాంటివి తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం.

త్వరగా ఉడికేవి ... త్వరగా ఉడకని పప్పులు, మటన్. వంటి పదార్థాలు కోసమే ఎక్కువ ప్రెషర్ కుక్కర్‌ని వాడుతుంటారు. కానీ కొంతమంది ఆకుకూరలు, వంకాయ, బ్రకలీ, క్యాలీఫ్లవర్.. వంటి త్వరగా ఉడికే వాటికీ ప్రెషర్ కుక్కర్ వాడుతుంటారు. అయితే దీనివల్ల అందులో ఉత్పత్తయ్యే అధిక వేడికి ఆయా కాయగూరలు, ఆకుకూరల్లోని పోషకాలు నశిస్తాయి. అలాగే అవి వాటి సాధారణ రంగు రుచిని కోల్పోతాయి. కాబట్టి ఇదీ ఆరోగ్యానికీ శ్రేయస్కరం కాదు.

**బేకింగ్ కోసం...** అవెన్ లేని వారు కేక్స్, కుకీస్.. వంటి బేకింగ్ ఉత్పత్తులు తయారుచేయడానికి ప్రెషర్ కుక్కర్‌ని వాడుతుంటారు. దీనివల్ల అవి అంత మృదువుగా రాకపోగా.. వాటి టెక్స్చర్, రుచి దెబ్బతింటాయి. కుక్కర్‌ని బేకింగ్‌కి అనువుగా తయారు చేయకపోవడమే ఇందుకు కారణమట.



# రామభక్త హనుమాన్



**రామనామాన్ని స్మరించినంతలో ఆ** రామునికన్నా ముందుగా ఆంజనేయుడు పలుకుతాడని నమ్ముతారు భక్తులు. రామభక్త హనుమాన్ అంటూ ప్రేమగా పిలుచుకుంటారు. తమను సర్వదా రక్షిస్తాడన నిండైన భక్తితో ఆరాధిస్తారు. భక్తి నవవిధాలు. అందులో స్మరణ భక్తికి, దాస్యభక్తికి ఆంజనేయుడు ప్రబల ప్రతీక. అంజనీదేవి పుత్రుడు కనుక ఆంజనేయుడని. వాయుదేవుని అంశతో పుట్టినవాడు కనుక మారుతి, పావని అని, హనువు (దవడ) దెబ్బతిన్న కారణంగా హనుమంతుడని ఆ పవనతనయుడికి ఎన్ని పేర్లో ! హను మంతుడు జన్మతఃవానరం (కోతి) పరమశివుని మరో రూపమైన రుద్రుని ఆంశతో, అగ్నితేజంతో, వాయుబలంతో జన్మించినవాడు. పసివాడుగానే ఆకాశంలోకి ఒక్క ఎగురు ఎగిరి, భానుడి వద్దకు వెళ్లాడు. ఏకంగా 14 లోకాలను తల్లడిల్ల చేయగల మహోగ్ర తేజోసంపన్నమైన సూర్యబింబాన్నే మింగబోయాడు. మహాశక్తిమంతుడైన ఆంజనేయుడు. జ్ఞానం, బలం, ధైర్యం, వీరం, సాహసం, యోగం, వేగం, భక్తి, శక్తి- ఇలా అన్నిటినీ కలిగి ఉన్న పరాక్రమశాలి హనుమంతుడు లోకైక శక్తికి ప్రతీక హనుమ. అందుకే దైహిక శక్తినిచ్చే వ్యాయామ శాలలకు హనుమాన్ అని పేరు పెట్టుకుంటారు. □



ఆధ్యాత్మికం

# అప్పటికప్పుడు వేడిగా..



**వర్షం చలి మొదలయిపోయింది.** ఎంత వేడిగా వండి వడ్డిదామను కున్నా భోజనాల బల్ల మీద కూర్చునే సరికి వంటకాలన్నీ చల్లారిపోతుంటాయి. తిరిగి వాటిని వేడిచేయాలంటే వేరే పాత్రలోకి తీసుకుని పొయ్యిమీద పెట్టాలి. మళ్లీ వాటన్నింటినీ తోముకోవాలి. ఇంత పని లేకుండా.. మీరే సమయంలోనైనా వేడి తినాలనుకుంటే ఈ గ్రేవీ వార్మర్ మీ దగ్గర ఉంటే చాలు. చూడాడనికి చక్కని సెరామిక్ బౌల్‌లా ఉంది కదా! అదే దీని ప్రత్యేకత. వండిన వంటలనీ ఈ బౌల్‌కి తీసుకుంటే చాలు. దీనికి అడుగున కరెంట్‌తో పనిచేసే ఒక బేస్ ఉంటుంది. దానికి కాసేపు ఛార్జింగ్ పెట్టి తీసేస్తే చాలు. ఈ బేస్‌పై



వార్మర్‌ని ఉంచితే గంటపాటు వంటకాలు వేడిగా ఉంటాయి. డైనింగ్ టేబుల్‌పై తక్కువ స్థలంలో అందంగా అమరిపోతుంది. □

# టి20 వరల్డ్ కప్ సూపర్ 8కు 8 జట్లు




## రెండు గ్రూపులుగా కేటాయింపు

## మొత్తం 12 మ్యాచ్‌లు

## 19న అమెరికా, దక్షిణాఫ్రికా మధ్య ఫస్ట్ మ్యాచ్

## 20, 22, 24 తేదీల్లో టీమిండియా మ్యాచ్‌లు

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ టి 20 వరల్డ్ కప్–2024 గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లు దాదాపు ముగియడంతో సూపర్–8 స్టేజ్‌కు షెడ్యూల్ ఖరారయ్యాయి. అంటిగ్వా, బార్బడోస్, సెయింట్ లూసియా, సెయింట్ విన్సెంట్ వేదికగా సూపర్–8 దశలో మొత్తం 12 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ నెల 19వ తేదీ నుండి సూపర్–8 స్టేజ్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. 19వ తేదీన అంటీగ్వాలో తొలి మ్యాచ్ అమెరికా, దక్షిణాఫ్రికా మధ్య జరగనుంది. అమెరికా, వెస్టిండీస్ వేదికలుగా జరుగుతున్న టీ 20 ప్రపంచ కప్ రెండో స్టేజ్‌లో ఎవరు ఎవరితో ఏ వేదికపై తలపడుతారో ఫిక్స్ అయింది. రెండో స్టేజ్‌కి చెందిన జట్లను నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) ఫైనల్ చేసింది. టి 20 వరల్డ్ కప్, 9వ షెడ్యూల్ టోర్నీకి సంబంధించి గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లు సోమవారంతో ముగిసినా, ఈ నెల 18వ తేదీన వెస్టిండీస్, అఫ్ఘాన్ మధ్య నామమాత్రంగా ఇంకో మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నీలో 20 దేశాలకు చెందిన 20 జట్లు తలపడగా వీటిలో 8 జట్లు అధికారికంగా సూపర్–8కు చేరుకున్నాయి. మరో 12 జట్లు అధికారికంగా గ్రూప్ దశ నుండి ఎలిమినేట్ అయ్యాయి. ఆ ఈ మేరకు వీటి వివరాలను ఐసిసి సోమవారం ప్రకటించింది. సూపర్–8 మ్యాచ్‌ల కోసం 8 జట్లను 2 గ్రూపులుగా విభజించారు. గ్రూప్ 1లో ఇండియా, ఆస్ట్రేలియా, అఫ్ఘాన్, బంగ్లాదేశ్ జట్టు ఉన్నాయి. అలాగే గ్రూప్ 2లో వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, అమెరికా జట్లు ఉన్నాయి. ప్రతీ జట్టూ ఈ గ్రూప్ దశలో మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. రెండు గ్రూపుల్లో టాప్ నిలిచే రెండు జట్లు సెమీ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లు ఈ నెల 19వ తేదీ నుండి అంటిగ్వాల సూపర్–8 స్టేజ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. అమెరికా, దక్షిణాఫ్రికా మధ్య తొలి మ్యాచ్‌తో సూపర్–8 స్టేజ్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. అదే రోజు సెయింట్ లూసియాలో వెస్టిండీస్, ఇంగ్లండ్ తలపడనున్నాయి. ఈ నెల 20వ తేదీన బార్బడోస్‌లో ఇండియా, ఆఫ్ఘనిస్థాన్ మధ్య మ్యాచ్ ఉంటుంది. కరీబియన్ వేదికగా ఈ టోర్నీలో ఇండియా తన తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ నెల 22వ తేదీన బంగ్లాదేశ్‌తో ఇండియా రెండవ మ్యాచ్ ఆడుతుంది. ఇక 24వ తేదీన సూపర్–8 స్టేజ్ మ్యాచ్‌లో బారత్ చివరి మ్యాచ్‌ను ఆస్ట్రేలియాతో తలపడనుంది.




# నేపాల్‌పై బంగ్లా హ్యాట్రిక్

## 21 పరుగుల తేడాతో ఘన విజయం

**న్యూఢిల్లీ:** ఐసిసి టి20 వరల్డ్ కప్, 9 షెడ్యూల్ టోర్నీలో బంగ్లాదేశ్ హ్యాట్రిక్ సాధించింది. ఫలితంగా గ్రూప్ డి నుండి బాంగ్లాదేశ్ సూపర్–8లో బెర్త్ ఖరారు చేసుకుంది. ఈ మెగా టోర్నీలో భాగంగా కింగ్స్‌టౌన్‌లో సోమవారం జరిగిన గ్రూప్ డి లీగ్ మ్యాచ్‌లో నేపాల్‌పై 21 పరుగులు తేడాతో బంగ్లా జట్టు ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బాంగ్లాదేశ్ నేపాల్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేయడంతో 19.3 ఓవర్లలో 106 పరుగులకే కుప్పకూలింది. జట్టులో షకీబ్ అలీ హుస్సేన్ 22 బంతుల్లో 17 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇక జట్టులోని లిట్టన్ దాస్ 12 బంతుల్లో 10 పరుగులు, నజ్మల్ హుస్సేన్ శాంటో 5 బంతుల్లో 4 పరుగులు, ట్వహిద్ హరిదోయ్ 13 బంతుల్లో 13 పరుగులు, జకీర్ అలీ 26 బంతుల్లో 12 పరుగులు, టాంజిమ్ హుస్సేన్ షకీబ్ 5 బంతుల్లో 3 పరుగులు, రషీద్ హోస్సైన్ 7 బంతుల్లో 13 పరుగులతో పేలవ ప్రదర్శన చేశారు. లామిచానె, దీపేంద్ర సింగ్, సోంపాల్, రోహిత్ పౌడెల్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేధనకు దిగిన నేపాల్ మరింత దారుణంగా ఆడింది. టాప్ ఆర్డర్‌లో ఆసిస్ తప్ప అందరూ దారుణంగా బ్యాటింగ్ చేసి తీవ్ర నిరాశ పరిచారు. జట్టులోని ఆసిఫ్ షైఖాన్ 14 బంతుల్లో 17 పరుగులు, రోతీహిత్ పౌడెల్, సన్దీప్ జోరా తలా ఒక పరుగు చేయగా, అనిల్ కుమార్ షా, గుల్‌సన్ ఝా, సోంపెల్ కామి ఒక్క పరుగు కూడా చేయకుండానే ఔటయ్యారు. అయితే మిడిలార్డర్‌లో కుశాల్ మల్లా 40 బంతుల్లో 27 పరుగులు, దీపేంద్ర సింగ్ 31 బంతుల్లో 25 పరుగులు చేసి జాగ్రత్తగా ఆడి నేపాల్ జట్టును గెలిపించేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. కానీ చివరికి 19.2 ఓవర్లలో 85 పరుగులకే ఆలౌట్ అయింది. పైగా నాలుగు వికెట్లు సైతం కోల్పోయింది. బంగ్లా బౌలర్ తన్జిమ్ 4/7 దెబ్బకు నేపాల్ కుప్పకూలింది. దీంతో నెదర్లాండ్స్ సూపర్–8కి చేరుకునే ఆశలు ఆవిరయ్యాయి.

# గ్రాండ్ ప్రిక్స్ బాక్సింగ్ టోర్నీలో లవ్లీకి రజతం



**న్యూఢిల్లీ:** గ్రాండ్ ప్రిక్స్–2024 బాక్సింగ్ టోర్నీలో భారత్ మహిళా బాక్సర్‌కు రజత పతకం లభించింది. ప్రతిష్టాత్మక గ్రాండ్ ప్రిక్స్ బాక్సింగ్ టోర్నీలో భారత్‌కు చెందిన మహిళా బాక్సర్ లవ్లీనా బోర్గోహెయిన్ ఉత్కంఠ భరిత పోరులో రజతాన్ని చేజిక్కించుకుంది. చెక్ రిపబ్లిక్ వేదికగా ముగిసిన బాక్సింగ్ ఫైనల్ బౌట్‌లో లవ్లీనా 2–3తో చైనా బాక్సర్ లి కియాన్ చేతిలో పోరాడి ఓడింది. పారిస్ ఒలింపిక్స్‌కు ముందు ఇటువంటి పోటీల్లో పాల్గొని పతకాన్ని సాధించడం తనలో మరింత పట్టుదల, ఆత్మ విశ్వాసానిన నింపిందని రజతం నెగ్గిన తర్వాత మీడియాతో లవ్లీనా పేర్కొంది.

**వాణిజ్యం**

# ఖరీదైన నగరాల్లో ముంబై టాప్..

**ముంబై, జూన్ 17:** దేశవ్యాప్తంగాముంబై ఖరీదైన నగరాల్లో మొదటిస్థానంలో ఉంద ని సర్వే వెల్లడించింది. కలల నగరంగా పేరున్న భారత వాణిజ్య రాజధాని ముంబైలో జీవనవ్యయం భారీగా పెరిగిందని నివేదికలో తెలిపారు. వ్యక్తిగతఖర్చులు, రవాణా ఖర్చు లు, గృహ అద్దెలు, అధిక స్థాయిలో ఉన్నాయని సర్వేలో వెల్లడైంది. నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ముంబై గతంలో కంటే 11 స్థానాలు ఎగబాకి 136వ ర్యాంకుకు చేరుకుంది. ఢిల్లీ 4 స్థానాలు పెరిగి 164వ ర్యాంకు, చెన్నై, ఐదుస్థానాలు దిగజారి 189కి, బెంగళూరు ఆరు స్థానాలు తగ్గి 195కి, హైదరాబాద్ ఎలాంటి మార్పు లేకుండా 202 వద్ద స్థిరంగా ఉంది. పుణె ఎనిమిది స్థానాలు పెరిగి 205కి, కోల్‌కతా నాలుగు స్థానాలు పెరిగి 207కి చేరుకుంది. అంతకుముందు యేడాది కంటే 2023లో 20 స్థానాలు దిగజారి 147వ ర్యాంకుకు చేరుకున్న ముంబై 2024లో 136వ ర్యాంకుకు పెరిగింది. ఎకాన మీలో వస్తున్న ఆర్థిక మార్పుల వల్ల ముంబైలో జీవన వ్యయం పెరుగు తోందని నివేదిక పేర్కొంది. అంతకు ముందు యేడాదితో పోలిస్తే 2023లో ఢిల్లీ 169 నుంచి 164కి, కోల్‌కతా 211 నుంచి రూ.207కి, పుణె 215 నుంచి 205కి చేరు కుంది. చెన్నై 184 నుంచి 189కి, బెంగళూరు 189 నుంచి 195కి, హైదరాబాద్ 202 వద్ద నిలకడ గా ఉంది. ఆసియావ్యాప్తంగా ఉన్న అత్యంత ఖరీ దైన నగరాల్లో ముంబై 21వ స్థానంలో, ఢిల్లీ 30వ స్థానం లో ఉన్నాయని నివేదిక తెలిపింది.
ఢిల్లీలోగృహఅద్దెలు అత్యధికంగా 12–15 శాతం పెరిగాయి. ముంబైలో 6–8శాతం, బెంగళూరులో 3–6శాతం, పుణె, హైదరా బాద్, చెన్నైలో 2–4శాతం గృహ అద్దెలో పెరుగుదల కనిపించింది. ఆటోమొబైల్స్, ఆటోవిడిభాగాలు, నిర్వ హణ, రవాణా ఖర్చులు పెరిగాయి. ఈ విభాగంలో బెంగళూరు తర్వాతి స్థానంలో ఉంది. ఇతర దేశాల్లోని ప్రతిభ కలిగిన ఉద్యోగులను ఆకర్షించడంలో స్థానికం గా ఉన్న హౌసింగ్ ఖర్చులు కీలకంగా మారుతాయని నివేదికతెలిపింది. దాంతోపాటు ఉద్యోగులజీవన నాణ్య తపై ప్రభావం పడుతుందని చెప్పింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ద్రవ్యోల్బ ణాన్ని ఎదుర్కొంటుందని, దాంతో సంస్థలు, ఇతర దేశాల్లోని ప్రతిభ ఉన్నవారిని ఆకర్షించే పనిలో ఉన్నా యని నివేదిక తెలిపింది. చాలా కంపెనీలు ముంబైలో తమ కార్యకలాపాలు సాగిస్తుండడంతో విదేశీ ఉద్యోగు లకు తగిన జీవన ప్రమాణాలు అందించేలా ఏర్పాటు చేస్తున్నాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో ఖర్చులు పెరిగాయి.

## ఐపిఒలతో ఇన్వెస్టర్లకు కాసుల వర్షం..

**ముంబై, జూన్ 17:** ఈ యేడాది వానాకాలం ఇన్వెస్టర్ల కు లాభాల వర్షం కురవనుంది. స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లపై కాసుల వర్షం కురిసే అవకాశం ఉంది. వివరాల్లోకి వెళితే, హ్యుండాయ్ మోటార్ ఇండి యా లిమిటెడ్‌తో సహాదాదాపు 56 కంపెనీలు తమ ఐపిఒ, ఎఫ్‌పిఒ ద్వారా రూ.90 వేల కోట్లకుపైగా సమీకరించాలని ప్లాన్ చేస్తున్నాయి. అందు బాటులో ఉన్న సమాచారం ప్రకారం సుమారు 17 కంపెనీలు తమ ఐపిఒలను ప్రారంభిం చేందుకు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) నుంచి అనుమతి పొందాయి. పెద్ద ఐపిఒల జాబితాలో స్విగ్గీ రూ.8వేల కోట్లు, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ రూ.7వేల కోట్లు, ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ రూ.7వేల కోట్లు, ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ రూ.5,500 కోట్లు, నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్‌లున్నాయి. బలమైె ఫండ మెంటల్స్, పెద్ద రిటైల్ భాగస్వామ్యం భారతదేశ బలమైన స్థూల ఆర్థిక మూలాధారాలు, పెద్ద రిటైల్ భాగస్వామ్యం ఐపిఒ మార్కెట్‌ను నడిపిస్తున్నాయని కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకిం గ్ మేనేజింగ్ డైరెక్టర్, బోర్డు సభ్యుడు వి జైశంకర్ అన్నారు. పెరిగిన ప్రభుత్వవ్యయం, అనుకూలమైన రుతుపవనాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ప్రయోజనం పొందుతుందని అంచనా వేయ డంతోవృద్ధి ఎజెండా కొనసాగుతుందని భావిస్తున్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.